www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

పేజీలు: 14
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 155

గురువారం | 19-9-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 12.40 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 8.04, రేవతి తె. 5.15; వర్జ్యం: రా. 6.39-8.04; దుర్ముహూర్తం: ఉ. 10.08-10.56, మ. 2.57-3.45; అమృతఘడియలు: తె. 3.07-4.32; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.10

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ప్రజా పాలనకు 100 రోజులు

ఏపీకి తిరిగి ఊపిరి పోసిన కూటమి పాలన
ఐదేళ్ల వైసీపీ అరాచకం నుంచి రూ.5కే కడుపు నింపే స్థితికి
రాష్ట్రమంతా తెరుచుకున్న అన్న క్యాంటీన్లు
వృద్ధులకు వెయ్యి పెంచి రూ.4 వేల పింఛను
ఉద్యోగులకు ఒకటో తారీఖునే వేతనాలు
కేంద్రం స్నేహంతో ప్రగతికి దారులు
పోలవరం, అమరావతిలో తిరిగి కదలిక

కోటి ఆశలు.. కొండంత భరోసా




(అమరావతి - ఆంధ్రజ్యోతి)
అగాథంలో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిలబెట్టే ప్రయత్నం చేస్తూనే, సామాన్యులు, బాధితులకు ఉన్నంతలో ఉపశమనం కలిగించడానికి చంద్రబాబు ప్రభుత్వం తొలి వంద రోజుల్లో గట్టి ప్రయత్నం చేసింది. ఎన్డీయే కూటమి భాగస్వామిగా కేంద్రంలో పొందిన పలుకుబడితో రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు సాధించడం ద్వారా రాజధాని వంటి కొన్ని కీలక కార్యక్రమాలు పూర్తి కాగలవన్న నమ్మకాన్ని ఈ ప్రభుత్వం కలిగించగలిగింది. వైసీపీ హయాంలో రాష్ట్రంలో నెలకొన్న అరాచక పరిస్థితులకు కళ్లెం వేసి ప్రజలు
మిగతా 11వ పేజీలో...

వంద రోజుల్లో.. వెయ్యి అడుగులు!
11
రేపటి నుంచి 10 రోజులు ప్రజల్లోకి ఎమ్మెల్యేలు
పవన్ పోరాట యోధుడు
కూటమి భేటీలో బాబు

తిరుమల లడ్డూ అపవిత్రం
వైసీపీ హయాంలో ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వు కలిపారు
అన్నప్రసాద నాణ్యతా తగ్గించారు
మేమొచ్చాకే మళ్లీ మంచి నెయ్యి: సీఎం
2

చంద్రబాబు విజన్ సూపర్
ఆలోచనలో దశాబ్దం ముందు
సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా
11
కష్టాన్నెలా ఎదుర్కోవాలో ఆయన్ని చూసి నేర్చుకోవాలి
నిధులు లేకపోయినా వంద రోజుల్లో అద్భుత పాలన
వస్తూనే 7 వేలు పెన్షన్ ఓ హిస్టరీ: డిప్యూటీ సీఎం పవన్

క్వార్టర్ 99కే!



సిసలైన బ్రాండ్లు అందుబాటులోకి

అందుబాటు ధరకే తక్కువ రకం మద్యం
పక్క రాష్ట్రాల్లో ధరల ఆధారంగా సగటు ధర
నాణ్యత లేని లిక్కర్ బ్రాండ్లకు చెల్లుచీటీ
రాష్ట్రంలో 12 ఎలైట్ షాపులకు గ్రీన్‌సిగ్నల్
అక్టోబరు నుంచి నూతన మద్యం పాలసీ
10 శాతం షాపులు కల్లుగీత కులాలకే
వలంటీర్ల కొనసాగింపుపై అధ్యయనం
భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి పేరు
మాజీ సైనికుల కోసం 10 కోట్ల ప్రత్యేక నిధి
చిన్న పరిశ్రమల కోసం వంద కోట్లతో..
కొత్త డయాఫ్రం వాల్ పనులు మేఘాకే
డీమ్డ్ వర్సిటీగా ఎస్ఆర్ఎంకు ఎన్‌వోసీ
బీసీలకు 33% కోటాకు కేంద్రానికి సిఫారసు
'రైతు సేవా కేంద్రం' జీవోకు ధ్రువీకరణ
అమరావతిలో న్యాయ విశ్వవిద్యాలయం
అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు
రాష్ట్ర మంత్రిమండలి కీలక నిర్ణయాలు



దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు చౌక మద్యాన్ని(చీప్ లిక్కర్) అందుబాటు ధరలకే అందించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. క్వార్టర్ రూ.99కే అందుబాటులోకి తీసుకురానుంది. సాధారణ లిక్కర్ షాపులతో పాటు కేవలం ప్రీమియం రకం మద్యం బ్రాండ్లు మాత్రమే ఉండే ఎలైట్ షాపుల ఏర్పాటుకూ ఆమోదముద్ర వేసింది. మద్యం దుకాణాల్లో పది శాతాన్ని
మిగతా 12వ పేజీలో...

జగన్ పత్రికకు రూ.650 కోట్లు!
ఇది అధికార దుర్వినియోగమే: చంద్రబాబు

ఆ ఒక్క పత్రికకే రూ.440 కోట్ల ప్రభుత్వ ప్రకటనలు
మిగతావాటన్నిటికీ కలిపి 400 కోట్లే
ఈ చెల్లింపుల తీరుపై విచారణ జరపాలని మంత్రివర్గ నిర్ణయం
వలంటీర్ల సర్వీసు నిరుడు ఆగస్టులోనే ముగిసింది
అయినా 9 నెలలు జీతాల చెల్లింపు
ఉద్యోగంలోనే లేనప్పుడు జీతాలెలా ఇవ్వడమంటూ మంత్రుల సందేహం!
రాష్ట్ర విజన్ ప్రణాళిక పేరు స్వర్ణాంధ్ర-47

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు చెందిన రోతపత్రికకు ప్రభుత్వ ధనం దోచిపెట్టారని.. వివిధ రూపాల్లో రూ.650 కోట్లు చెల్లించినట్లు తేలింది. ఇది సంపూర్ణంగా అధికార దుర్వినియోగమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో
మిగతా 12వ పేజీలో...


ఇసుక బుకింగ్ కష్టాలకు చెల్లు
నేటి నుంచి ఆన్‌లైన్ బుకింగ్ విధానం
అందుబాటులోకి వెబ్‌సైట్
10





ఒకే దేశం.. ఒకే ఎన్నిక

జమిలికి సై


వివరాలు వెల్లడిస్తున్న మంత్రి అశ్వినీ వైష్ణవ్

కేంద్రం కీలక నిర్ణయం.. కోవింద్ కమిటీ సిఫారసులకు క్యాబినెట్ ఓకే

విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహిస్తాం
ఏకాభిప్రాయ సాధనతో ముందుకు వెళ్తాం
వ్యతిరేకించే పార్టీలూ వైఖరి మార్చుకుంటాయి
ఈ నిర్ణయంతో దేశ ప్రజాస్వామ్యం మరింత చైతన్యవంతం: ప్రధాని మోదీ
పంట ఉత్పత్తులకు మెరుగైన ధరలు
35 వేల కోట్లతో పీఎం-ఆశ కొనసాగింపు
ఫాస్ఫేట్, పొటాష్‌పై 24 వేల కోట్ల సబ్సిడీ
గిరిజనుల అభ్యున్నతికి 79,156 కోట్లు
చంద్రయాన్-4, వీనస్ మిషన్‌కు ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు, స్థానిక సంస్థలకు దశల వారీగా జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సిఫారసులను ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఏకాభిప్రాయాన్ని సాధించి, దీనిని అమలు చేయాలని తీర్మానించింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశమైంది. జమిలి ఎన్నికలతోపాటు పలు ఇతర నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రైతులకు పంట ఉత్పత్తులకు ప్రోత్సాహకర ధరలు అందించటానికి వీలుగా పీఎం-ఆశ పథకాన్ని రూ.35,000 కోట్లతో
మిగతా 2వ పేజీలో...

ఆచరణాత్మకం కాదు
కేంద్రం నిర్ణయంపై విపక్షాల ఫైర్
ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం
ప్రజల దృష్టి మరల్చడానికే..: ఖర్గే
అన్ని ఎన్నికలను ఐదేళ్లు వాయిదా వేసే ప్లాన్: సేన (యూబీటీ)

సవాళ్లెన్నో!
జమిలి కోసం రాజ్యాంగానికి 18 సవరణలు చేయాలి
కొన్నింటికి సగం కంటే ఎక్కువ రాష్ట్రాలు అంగీకరించాలి
2

జమిలి అమలైతే..
తొలుత లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి
మధ్యంతరం వచ్చినా.. మిగిలిన కాలానికే ఆ ప్రభుత్వం

జమ్మూకశ్మీర్‌లో 59% పోలింగ్

ప్రశాంతంగా తొలి దశ ఎన్నికలు

పంచాయతీలకు రూ.989 కోట్లు!
15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు
ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
పంచాయతీల ఖాతాల్లో జమ చేయనున్న రాష్ట్రం
హర్షం వ్యక్తంచేస్తున్న సర్పంచ్‌లు
గ్రామాల్లో చేపట్టే పనులపై నిఘా కోసం పోర్టల్
రెండు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు
నిబంధనలు ఉల్లంఘించి నిధులు ఖర్చు చేస్తే అధికారులతో పాటు సర్పంచ్‌లపైనా చర్యలు
పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టింది. కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో జవసత్వాలు నింపుతోంది. పంచాయతీలను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం.. విద్యుత్ చార్జీల పేరుతో వాటి నిధులను నేరుగా వాడేసింది. పంచాయతీల ఖాతాల్లో ఒక్క పైసా కూడా లేకపోవడంతో బ్లీచింగ్ పౌడర్ కూడా కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొంది. దీనికితోడు ఎక్కడైనా పనులు చేసి, సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు పెడితే ఆర్థికశాఖ డబ్బులు విడుదల చేసేది కాదు. ఇచ్చిన నిధులు సద్వినియోగం కాకపోవడంతో రాష్ట్రంలోని
మిగతా 12వ పేజీలో...

పేదల ఇంటికి పెత్తందార్ల కన్నం!



'తోపుదుర్తి'కి 320 కోట్లు దోచిపెట్టిన గత సర్కారు

పేరుకే పేదలు.. పెద్దలకే మేలు జరిగేలా స్కెచ్
టెండరు లేకుండానే మాజీ ఎమ్మెల్యే ఫ్యామిలీకి పనులు
7 ఉమ్మడి జిల్లాలు.. 35 లే అవుట్లు.. 51,633 ఇళ్లు
గంపగుత్తగా 'రాక్రీట్'కు..'పెద్దమేస్త్రీ'కి ఇచ్చినట్టు రికార్డు
పునాదుల్లో ఇళ్లు.. పూర్తయినట్టు రూ.కోట్లలో బిల్లులు
సిమెంట్, ఇసుక, ఇనుము కొనుగోళ్లలో గోల్‌మాల్
భారీగా 'భారతీ' సిమెంట్ కొనుగోలు.. దోపిడీలో వాటా
కాంట్రాక్ట్ సంస్థ నుంచి రికవరీ, అధికారులపై చర్యలు
చంద్రబాబు ప్రభుత్వానికి విజిలెన్స్ సిఫారసు

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదలకు పక్కా గృహాల నిర్మాణానికి ఇచ్చిన నిధులను అప్పట్లో వైసీపీ నేతలు దోచేశారు. అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడికి చెందిన 'రాక్రీట్' నిర్మాణ సంస్థ చేసిన పనుల కన్నా, నిధులు ఎక్కువ తీసుకుంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైనదాని కంటే కూడా ఎక్కువగా 'భారతీ' సిమెంటు కొనుగోలు చేసి జగన్ సతీమణికి అప్పట్లో దోపిడీలో వాటా ఇచ్చింది. 'పెద్ద మేస్త్రీ' కట్టుబడి పేరిట దందా సాగింది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పక్కా ఇళ్ల నిర్మాణంలో జరిగిన భారీ దోపిడీ పర్వం వెలుగులోకి వచ్చింది. ప్రతి పేదోడికీ ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చి 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగనన్న కాలనీల పేరుతో సెంటు స్థలం ఇచ్చేందుకు భూ సేకరణలో భారీ దోపిడీకి తెరతీసింది. రైతులకు, భూ యజమానులకు ఇచ్చింది తక్కువ.. వైసీపీ నేతలకు దోచి పెట్టిందే ఎక్కువ. నిజానికి, పేదల ఇళ్ల కోసం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అప్పట్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద 1.50 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులు చాలక పోవడంతో ఉపాధి నిధుల నుంచి మరో 30 వేలు చేర్చి పేదోడి ఇంటి నిర్మాణానికి 1.80 లక్షలు ఇచ్చింది. ఇళ్ల నిర్మాణానికి జగన్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. పైగా తమ ప్రభుత్వమే లక్షలాది ఇళ్లు నిర్మిస్తున్నట్లు
మిగతా 2వ పేజీలో...


3

వైసీపీకి బిగ్ షాక్
మాజీ మంత్రి బాలినేని గుడ్‌బై
ఫలించని జగన్, సజ్జల బుజ్జగింపులు
మంత్రి పదవిని వదులుకుని ఆనాడు వైసీపీలో చేరిన బాలినేని శ్రీనివాసరెడ్డి
కానీ, మంత్రిగా పూర్తికాలం చాన్స్ ఇవ్వని జగన్
సీట్ల కేటాయింపులో ఇద్దరి మధ్య తకరారు
ప్రకాశం జిల్లా అధ్యక్ష పదవిపైనా విభేదాలు
జగన్ చాలా తప్పులు చేశాడు.. ఇంకా మారలేదు: బాలినేని.. నేడు పవన్‌తో భేటీ

భూమి కంపించేలా దాడి

రష్యా ఆయుధ డిపోపై ఉక్రెయిన్ డ్రోన్ల పిడుగు

పేలిన 240 టన్నుల ఆయుధాలు
తీవ్రతకు 6 కి.మీ. మేర భూకంపం
14 కిలోమీటర్ల దాకా రేడియేషన్
క్షిపణి దాడులను తట్టుకునేలా డిపోను నిర్మించిన రష్యా
10
దాడికి 50కి పైగా డ్రోన్లు వినియోగం
కొన్నింటినే నిలువరించిన రష్యా

నిన్న పేజర్లు.. నేడు వాకీటాకీలు
లెబనాన్‌లో మళ్లీ పేలుళ్లు
కార్లలో ఎఫ్ఎం రేడియోలు..
ఇళ్లలో గృహోపకరణాల విస్ఫోటం
9 మంది మృతి.. 300 మందికి గాయాలు
పేజర్లలో లిథియం అయాన్‌తోపాటు పీఈటీఎన్ పేలుడు పదార్థం వినియోగం



కూల్చేయండి
నేహారెడ్డి అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేయండి
రాజకీయ జోక్యంతో చర్యలు ఆపొద్దు: హైకోర్టు
కూల్చివేతలపై స్టే ఇవ్వడం కుదరదని స్పష్టీకరణ
10
విచారణ 25కి వాయిదా

తీవ్రవాదుల పార్టీ బీజేపీ
రాహుల్‌ను హత్య చేయించేందుకు కుట్ర
విద్వేష వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి: షర్మిల
3

విజయవాడలో కాంగ్రెస్ నేతల ధర్నా
బీజేపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు

జమిలి అమలైతే..

తొలుత లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు

అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు కార్డు, ఒకే ఓటరు జాబితా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు 2029లో నిర్వహించాలంటే.. తగిన సన్నాహాలు ఇప్పటి నుంచే జరపాలని భావిస్తున్న మోదీ ప్రభుత్వం.. శీతాకాల సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. కొత్త విధానం ప్రకారం.. ఒక ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే పడిపోయి, ఎన్నికలు జరపాల్సి వస్తే.. అప్పుడు ఏర్పడే ప్రభుత్వం మిగిలిన మూడేళ్ల కాలం వరకే కొనసాగుతుంది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం.. జమిలి ఎన్నికలు రెండు దశలుగా అమలవుతాయి. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి. రెండవ దశలో.. అంటే సార్వత్రిక ఎన్నికలు జరిగిన 100 రోజుల్లోనే పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయి. అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా ఉంటుంది.

వేటిని సవరించాలి?

లోక్‌సభ పదవీకాలాన్ని నిర్ణయించే ఆర్టికల్ 83, అసెంబ్లీల పదవీకాలాన్ని నిర్ణయించే ఆర్టికల్ 172లో.. మూడేసి సెక్షన్లను ప్రధానంగా సవరించాల్సి ఉంటుంది. సభల ఆమోదం పొందితే.. చాలా రాష్ట్ర అసెంబ్లీల పదవీ కాలం కుదించుకుపోతుంది! కాగా.. 83, 172 అధికరణలకు చేసే రాజ్యాంగ సవరణలకు రాష్ట్ర అసెంబ్లీల ఆమోదం అవసరం లేదని కోవింద్ కమిటీ పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించిన తర్వాత వంద రోజులకు స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి మాత్రం.. ఆ మేరకు చేసే రాజ్యాంగ సవరణలకు సగం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్టికల్ 324 కింద ఎన్నికల పర్యవేక్షణ, నియంత్రణ ఎన్నికల కమిషన్ చేతుల్లోనే ఉంటుంది కనుక ఈ ఆర్టికల్‌ను కూడా సవరించాల్సి ఉంటుంది. మునిసిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలను ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఆర్టికల్ 324(ఏ)ను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒకే ఓటరు జాబితాను, ఒకే ఫొటో గుర్తింపు కార్డును ఎన్నికల కమిషన్ రూపొందించేందుకు ఆర్టికల్ 325ను సవరించాల్సి ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజనతో పాటు జమిలి ఎన్నికలు అనే పదాలను చేర్చేందుకు, శాసనసభల ఎన్నికలకు సంబంధించి పార్లమెంట్ అధికారాలను నిర్దేశించేందుకు ఆర్టికల్ 327ను సవరించాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్లతో సంప్రదించి దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు జాబితాను రూపొందించాలంటే.. రాజ్యాంగంలోని 243కె, 243జడ్‌ఏలను కూడా సవరించాల్సి ఉంటుంది. ఈ సవరణలు (324 ఏ, 325, 243కె, 243జడ్‌ఏ) రాజ్యాంగంలోని షెడ్యూలు 7 కింద రాష్ట్రాల జాబితాలను ప్రభావితం చేస్తున్నందున.. 368(2) కింద వాటిని రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించాల్సి ఉంటుంది. ఇక.. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలం ఒకే రకంగా ఉండాలంటే ఆర్టికల్ '82ఏ'ను రాజ్యాంగంలో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీల తొలి సమావేశపు రోజును నిర్ణయించేందుకు, రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేసేందుకు, వాటి పదవీకాలాన్ని ఒకేసారి ముగించేందుక 82వ అధికరణలో అయిదు సెక్షన్లకు సవరణలు చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు.. జమ్ముకశ్మీర్ సహా శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాల్లో కూడా జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కనీసం 3 సవరణలు చేయాలి.

పీఎఫ్ ఉపసంహరణ పరిమితి లక్ష!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: ఈపీఎఫ్‌వోకి సంబంధించి కేంద్ర కార్మిక శాఖ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎఫ్ ఉపసంహరణ పరిమితిని రూ.లక్షకు పెంచడంతోపాటు వేతనం సీలింగ్‌ను కూడా సవరించింది.

పిల్లల కోసం ఎన్‌పీఎస్ వాత్సల్య ప్రారంభం

పెన్షన్ ఖాతాలో పెట్టుబడి ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేసేలా నేషనల్ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్)-వాత్సల్యను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. ఈ ఖాతాను రూ.1,000తో ఆన్‌లైన్, బ్యాంకు, పోస్టాఫీసులో తెరవొచ్చు.

జమిలికి కేంద్రం సై!

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించాలని నిర్ణయించింది. చంద్రుడి మీదికి భారతీయ వ్యోమగాములను తీసుకెళ్లే చంద్రయాన్-4 మిషన్‌కు అంగీకారం తెలిపింది. క్యాబినెట్ సమావేశం వివరాలను కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లకు వెల్లడించారు. జమిలి ఎన్నికలకు పలు రాజకీయ పార్టీలు ఇప్పటికే మద్దతు తెలిపాయని.. దీనిని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు సైతం ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందనతో ఒత్తిడికి గురై వైఖరి మార్చుకుంటాయన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ జరిపిన సంప్రదింపుల్లో పాల్గొన్న వారిలో 80 శాతానికిపైగా జమిలి ఎన్నికలకు మద్దతు తెలిపారని, ముఖ్యంగా యువత ఈ ప్రతిపాదనను బలంగా సమర్థించారని వెల్లడించారు. కోవింద్ కమిటీ సిఫార్సులపై దేశవ్యాప్తంగా పలు వేదికల మీద చర్చలను నిర్వహిస్తామని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. చర్చల ద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించాలన్నది ప్రభుత్వ అభిమతమన్నారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని దీర్ఘకాలంపాటు ప్రభావితం చేసే కీలక అంశాలపై ఏకాభిప్రాయంతో ముందుకెళ్లాలని తమ ప్రభుత్వం భావిస్తుందని మంత్రి తెలిపారు. చర్చల ప్రక్రియను ముగించిన తర్వాత కేంద్ర న్యాయశాఖ ముసాయిదా బిల్లును రూపొందిస్తుందని, క్యాబినెట్ ఆమోదంతో పార్లమెంటులో ప్రవేశపెడుతుందని వెల్లడించారు. కాగా, జమిలి ఎన్నికల్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారని విలేకర్లు అడగ్గా.. అశ్వినీ వైష్ణవ్ సూటిగా సమాధానం చెప్పకుండా, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత హయాంలోనే దీనిని అమలు చేస్తుందంటూ హోంమంత్రి అమిత్ షా చెప్పారని గుర్తు చేశారు. జమిలి ఎన్నికలపై పార్లమెంటులో ఒకే బిల్లుగానీ.. కొన్ని బిల్లులను గానీ ప్రభుత్వం ప్రవేశపెట్టవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. జమిలి ఎన్నికలను ఆమోదిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం వల్ల భారతదేశ ప్రజాస్వామ్యం మరింత చైతన్యవంతమవుతుందని, ప్రాతినిధ్యం పెరుగుతుందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు


రాష్ట్రపతి ముర్ముకు జమిలిపై నివేదిక అందజేస్తున్న కోవింద్

ఎక్స్‌లో ట్వీట్ చేశారు. జమిలి ఎన్నికలకు సంబంధించి విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరిపి, ఈ ప్రక్రియకు సారథ్యం వహించినందుకు మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు అభినందనలు తెలుపుతున్నానన్నారు.

క్యాబినెట్ ఇతర నిర్ణయాలు

- రైతులకు పంట ఉత్పత్తులకు ప్రోత్సాహకర ధరలను ఇవ్వటానికి వీలుగా 'ప్రధానమంత్రి రైతు ఆదాయ సంరక్షణ పథకం'(పీఎం-ఆశ) కొనసాగింపు. ఈ పథకానికి 15వ ఆర్థిక సంఘం గడువైన 2025-26 వరకూ రూ.35,000 కోట్ల మొత్తం కేటాయించింది. ధరల మద్దతు, ధరల స్థిరీకరణ నిధి, లోటు ధరల చెల్లింపులు, మార్కెట్ జోక్యం పథకాలను కలిపి పీఎం-ఆశ పేరుతో కేంద్రం తీసుకొచ్చింది. రైతులకు మద్దతు ధరల భరోసా కల్పించటం దీని లక్ష్యం.
- 2024-25 రబీ సీజన్‌కు ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై రూ.24,474 కోట్ల సబ్సిడీ.
- దేశవ్యాప్తంగా గిరిజనుల సామాజిక ఆర్థిక అభ్యున్నతి కోసం రూ.79,156 కోట్లతో ప్రధానమంత్రి జన్‌జాతీయ గ్రామ్ అభియాన్ పథకం.
- చంద్రుడి మీదికి భారతీయ వ్యోమగాములను తీసుకెళ్లి సురక్షితంగా తిరిగి తీసుకొచ్చే లక్ష్యంతో కూడిన చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోదం. 2040 నాటికి ఈ మిషన్‌ను పూర్తి చేయటానికి అవసరమైన టెక్నాలజీలను స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తారు. చంద్రుడి మీద ఉన్న మట్టిని తీసుకొచ్చి దానిపై పరిశోధనలు నిర్వహిస్తారు. మిషన్ వ్యయం రూ.2,104 కోట్లు.
- రూ.1,236 కోట్ల వ్యయంతో శుక్ర గ్రహంపై అధ్యయనానికి ఉద్దేశించిన 'వీనస్ ఆర్బిటర్ మిషన్'కు క్యాబినెట్ ఆమోదం. ఈ మిషన్‌లో భాగంగా భూమికి అతి దగ్గరి గ్రహమైన శుక్రుడి కక్ష్యలోకి ఓ ఉపగ్రహాన్ని పంపిస్తారు.
- రూ.8,240 కోట్ల వ్యయంతో పాక్షిక పునర్వినియోగ 'న్యూ జెనరేషన్ లాంచ్ వెహికిల్'(ఎన్‌జీఎల్వీ) వ్యోమనౌకను రూపొందించే ప్రాజెక్టుకు క్యాబినెట్ అంగీకారం. అంతరిక్ష ప్రయోగాలకు ఇస్రో అత్యధికంగా ఆధారపడే జీఎస్ఎల్వీ మార్క్-3 కన్నా మూడు రెట్లు అధిక పేలోడ్‌ను ఎన్‌జీఎల్వీ మోసుకెళ్లగలదు. 8 ఏళ్లలో మిషన్ పూర్తి చేయాలన్నది లక్ష్యం.
- ఐఐటీ, ఐఐఎంల మాదిరిగా ముంబైలో 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ'ని నెలకొల్పుతారు. భారత్‌ను కంటెంట్ హబ్‌గా మార్చటం, మీడియా, వినోదం రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం లక్ష్యంగా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తారు.
- బయోటెక్నాలజీ రంగంలో అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించటం కోసం బయో-రైడ్ పథకం.

త్వరలో లా కమిషన్ నివేదిక!

జమిలి ఎన్నికలకు సంబంధించి లా కమిషన్ కూడా తన నివేదికను త్వరలో వెలువరించే అవకాశం ఉంది. 2029 నుంచి దీనిని అమలు చేయాలని లా కమిషన్ సిఫార్సు చేయవచ్చని అంచనా. వాస్తవానికి, స్వాతంత్ర్యానంతరం 1951 నుంచి 1967 వరకూ దేశంలో జమిలి ఎన్నికలే జరిగాయి.

జమిలి అమలుకు సవాళ్లెన్నో!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: కోవింద్ కమిటీ నివేదికను కేంద్ర కేబినెట్ ఆమోదించినప్పటికీ జమిలి ఎన్నికలు ఆచరణ రూపం దాల్చాలంటే ఎన్నో సవాళ్లున్నాయి. అన్నింటికంటే ముఖ్యమైంది రాజ్యాంగ సవరణ. జమిలి కోసం రాజ్యాంగానికి 18 సవరణలు చేయాలని కోవింద్ కమిటీ తన నివేదికలో సూచించింది. ఎన్డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీలు, రాజ్యసభలో 119 మంది ఎంపీలున్నారు. ఏదైనా రాజ్యాంగ సవరణ ప్రతిపాదన బిల్లు ఆమోదానికి లోక్‌సభలోనైనా రాజ్యసభలోనైనా ఆయా సభల మొత్తం సంఖ్యాబలంలో సాధారణ మెజారిటీ అవసరం. అంతేకాదు, సభకు హాజరై ఓటింగ్‌లో పాల్గొనే సభ్యుల్లో 2/3వ వంతుమంది మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందాలంటే మొత్తం సంఖ్యాబలమైన 543లో కనీసం 272 మంది మద్దతు అవసరం. దీంతోపాటు సభకు హాజరయ్యే ఎంపీల్లో 2/3 వంతు మంది ఓటేయాలి. లోక్‌సభలో ఎన్డీఏ బలం 293 మాత్రమే. ఇక రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి కనీసం 123 మంది మద్దతు అవసరం. ఎన్డీఏ బలం 113 మాత్రమే. అంతేగాక కొన్ని రాజ్యాంగ సవరణలకు సగం కంటే ఎక్కువ రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అవసరమవుతుంది. కాంగ్రెస్, ఇండియా కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రాలు అంగీకరిస్తాయా అన్నది అనుమానమే. జమిలి వల్ల చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నిర్దిష్ట కాలపరిమితి కంటే ముందే రద్దు అవుతాయి. దీనికి ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడతాయనేది మరో సవాలు. ఒకేసారి దేశమంతా ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలు భారీ సంఖ్యలో కావాలి. 47 పార్టీలు తమ అభిప్రాయాన్ని కోవింద్ కమిటీకి తెలియజేశాయి. వాటిలో 32 సమర్థించాయి. సభలో వీటి సంఖ్యాబలం 271. వ్యతిరేకించిన 15 పార్టీల సంఖ్యాబలం 205. కోవింద్ కమిటీకి అభిప్రాయాలు తెలుపని పార్టీల్లో టీడీపీ కూడా ఉంది. తాజాగా జమిలికి సైద్ధాంతికంగా మద్దతిస్తామని ఆ పార్టీ తెలిపినట్లుగా ఓ వార్తాసంస్థ వెల్లడించింది.

లోకం తీరు



ఇస్రోకు భారీ బూస్ట్!

చంద్రయాన్-4, శుక్రయాన్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: ఇస్రో తదుపరి మూన్ మిషన్ చంద్రయాన్-4కు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో పాటు వీనస్ ఆర్బిటర్ మిషన్, భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుతోపాటు నెక్స్ట్-జెన్ లాంచ్ వెహికిల్ (ఎన్‌జీఎల్‌వీ) వంటి భారీ ప్రాజెక్టులకు కూడా ఓకే చెప్పింది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు నిధులు సైతం కేటాయించింది. కేబినెట్ భేటీలో ఇస్రో ప్రాజెక్టులపై తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. చంద్రయాన్ 4లో ల్యాండర్, రోవర్ చంద్రుడిపై దిగడమే కాకుండా.. అక్కడ చంద్రుడి మట్టి, రాళ్లను సేకరించి భూమిపైకి తీసుకొచ్చేలా డిజైన్ చేశారు. ఈ ప్రయోగం మూడేళ్లలో పూర్తి కావొచ్చని భావిస్తున్నారు. చంద్రయాన్-4 మిషన్‌కు రూ.2,104 కోట్లు ఖర్చవుతుందని అంచనా. చంద్రుడు, అంగారకుడు తర్వాత ఇస్రో.. శుక్ర గ్రహంపై దృష్టి పెట్టింది. వీనస్ ఆర్బిటర్ మిషన్ (వీవోఎం)పేరిట శుక్రయాన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 2028 మార్చిలో ఈ మిషన్ ప్రయోగం ఉంటుంది. శాస్త్రీయ పరిశోధనల కోసం సొంతంగా భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2028 నాటికి భారత స్పేస్ స్టేషన్ మొదటి దశను పూర్తిచేసేలా సన్నాహాలు చేస్తున్నారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష స్టేషన్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ప్రారంభించాలని, 2040 నాటికి.. భారతీయ వ్యోమగామిని చంద్రుడిపై కాలుపెట్టేలా చూడాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం గగన్‌యాన్ మిషన్‌ను ఇస్రో సవరించింది. దీని ప్రకారం కేంద్రం కూడా ఈ మిషన్‌కు ఇచ్చే నిధులను రూ.20,193 కోట్లకు పెంచింది. నెక్స్ట్-జెన్ లాంచ్ వెహికిల్ (ఎన్‌జీఎల్‌వీ) అభివృద్ధికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. ఎన్‌జీఎల్వీ ప్రాజెక్టు మొత్తం బడ్జెట్ రూ.8,240 కోట్లు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎనిమిదేళ్లలో 3 లాంచ్ వెహికిల్స్‌ను అభివృద్ధి చేయనున్నారు.

పేదల ఇంటికి పెత్తందార్ల కన్నం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారం చేసుకుంది. ఇందులోనూ సొమ్ములు కొట్టేసేందుకు ఎత్తుగడ వేసిన వైసీపీ నేతలు, అరకొర నిర్మాణాలు చేపట్టి అడ్డగోలుగా దోచేశారు.

రంగంలోకి 'పెద్ద మేస్త్రీ'

పేదల ఇళ్ల నిర్మాణం బాధ్యత రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ తీసుకోవాలి. అయితే ఇంటి నిర్మాణంలో లబ్ధిదారుడికి మూడు రకాల ఆప్షన్లు ఇచ్చిన గత వైసీపీ ప్రభుత్వం....ఎక్కువగా నిర్మించి ఇచ్చేందుకే మొగ్గు చూపింది. వాటిని మేస్త్రీని పెట్టించి స్వయంగా కట్టిస్తానని ప్రకటించింది. ఎందుకంటే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడికి చెందిన రాక్రీట్ ఇన్‌ఫ్రాకు భారీగా దోచిపెట్టడానికి! ఎలాంటి టెండర్ లేకుండా రూ.950.63కోట్ల విలువైన పనులను రాక్రీట్‌కు అడ్డగోలుగా అప్పగించింది. రికార్డుల్లో మాత్రం 'పెద్ద మేస్త్రీ'తో పనులు చేయించినట్లు రాసుకున్నారు. ఏడు ఉమ్మడి జిల్లాల్లోని 35 లేఅవుట్లలో 51,633పక్కా గృహాల నిర్మాణాన్ని రాక్రీట్‌కు అప్పగించింది. అందులో 51,256 ఇళ్లకు పునాదులు వేశామని, కొంత మొత్తం విడుదల చేస్తే శ్లాబు వరకూ పూర్తి చేస్తామని రాక్రీట్....గృహ నిర్మాణశాఖకు ఇండెంట్ పెట్టింది. దీంతో మొదటి విడతగా 325 కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ సొమ్మును అప్పటి వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. అందులో ఎక్కువ మొత్తం సిమెంట్ కొనుగోలు పేరిట 'భారతీ' సిమెంటుకే పోయిందని సమాచారం. ఇసుకకు కూడా మార్కెట్ ధర కన్నా ఎక్కువగా బిల్లులను రాక్రీట్ చూపించింది. ఇనుము అదే విధంగా కొనుగోలు చేసింది. కానీ ఇళ్ల నిర్మాణాన్ని మాత్రం అసంపూర్తిగా వదిలేసింది.

విచారణకు ఆదేశించిన ఎన్డీఏ ప్రభుత్వం...

రాష్ట్రంలో ఎన్నికల తర్వాత భారీ విజయం సొంతం చేసుకున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలు తేల్చాలంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు రాక్రీట్ ఇన్‌ఫ్రాకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన కేంద్ర నిధులు.. కొనుగోలు చేసిన భారతీ సిమెంటు.. జగనన్న దోపిడీ ఇసుక.. ఇతర మెటీరియల్ లెక్క తేల్చాలని చెప్పింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరిగిన పేదల ఇళ్ల నిర్మాణంలో ఎక్కడెక్కడ లోపాలున్నాయి..? అక్రమాలు ఏ మేరకు జరిగాయి.? పేదల ఇంటికి రాక్రీట్ ఎలా కన్నం వేసింది.? కేంద్ర ప్రభుత్వ నిధులు వైసీపీ నేతలు ఏ విధంగా కాజేశారు.? తదితర అంశాలపై విజిలెన్స్ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టింది. మొత్తం 35 కాలనీలకు వెళ్లి ఎన్ని ఇళ్లు పూర్తి అయ్యాయి.. మొండి గోడలతో ఆగినవి ఎన్ని.. పునాదిలోనే అసంపూర్తిగా మిగిలి పోయినవి ఎన్ని.. వాటికి వాడిన మెటీరియల్ తదితర అంశాలపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి ఇచ్చింది.

ప్రభుత్వానికి విజిలెన్స్ సిఫారసులు..

- రాక్రీట్ ఇన్‌ఫ్రాకు ఏకపక్షంగా జగన్ ప్రభుత్వం పనులు అప్పగించింది.
- పెద్ద మేస్త్రీ పేరుతో విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లాల్లోని 35 కాలనీల్లో 51,633 ఇళ్లకు గానూ 51,256 ఇళ్లకు ఈ సంస్థ పునాదులు తవ్వింది.
- చాలాచోట్ల బేస్‌మెంట్ వరకూ నిర్మాణం చేపట్టి ప్లింత్ లెవల్ వరకూ పూర్తి చేసినట్లు రాక్రీట్ తప్పుడు వివరాలు ఇచ్చింది.
- వేలాది ఇళ్లకు బేస్‌మెంట్ ఫిల్లింగ్, బెడ్ ఫ్లోరింగ్ వంటి కీలకమైన పనులు చేయకుండానే బిల్లుల చెల్లింపులు జరిగిపోయాయి.
- గోడలు అరకొర కట్టేసి పూర్తి అయినట్లు చూపించి ఇంటికి 1.80లక్షలు చొప్పున బిల్లు కాంట్రాక్టు సంస్థ తీసుకుంది. బిల్లుతో పాటు సిమెంటు, ఇతర నిర్మాణ సామాగ్రి తీసుకున్నట్లు చూపించినా కొనకుండానే బిల్లులు పెట్టినట్లు తేలింది.
- మంజూరైన 51,633 ఇళ్లకు గానూ 23,963 ఇళ్లలో అక్రమాలు కనిపించాయి. ఇందులో బిల్లు (సామగ్రి కాకుండా) రూపంలో రాక్రీట్ ఇన్‌ఫ్రా తీసుకున్న మొత్తం 47.23కోట్ల వరకూ ఉంది.
- ఇంటి నిర్మాణ డిజైన్లు పరిశీలిస్తే ఇనుము తక్కువగా వాడి ఎక్కువ చూపించినట్లు స్పష్టమైంది. సంబంధిత శాఖ ఇచ్చిన ఇనుము లెక్కలకు, జారీ చేసిన బిల్లులకు భారీ వ్యత్యాసం ఉంది. సరఫరా అయిన ఇనుము కన్నా చెల్లింపు ఎక్కువగా ఉంది.
- ఇనుము తక్కువగా వాడి పక్కా గృహాలు నిర్మించడంతో వాటి నాణ్యత తగ్గింది. ఇంటి ఆయుష్షు కూడా ఎక్కువ కాలం నిలవదు.
- నిర్మాణానికి వాడిన ఇనుము, డ్రా చేసుకున్న బిల్లుల్లో వ్యత్యాసం 12.60కోట్లుగా తనిఖీల్లో పాల్గొన్న ఇంజనీర్ల బృందం నిర్ధారించింది.
- ఇళ్ల నిర్మాణంలో వివిధ స్థాయిలను పర్యవేక్షించాల్సిన ఇంజనీర్లు పూర్తిస్థాయిలో తమ విధులు నిర్వర్తించలేదని నాణ్యతలో లోపాలు స్పష్టం చేస్తున్నాయి.
- రాక్రీట్ నిర్మాణ సంస్థకు టెండర్ కట్టబెట్టడంలోనే పెద్ద తప్పుంది. ఎలాంటి బిడ్డింగ్ లేకుండా పారదర్శకతకు పాతరేసి రాజకీయ కోణంలో సొంత పార్టీ ఎమ్మెల్యేకి గత వైసీపీ ప్రభుత్వం పనులు కట్టబెట్టినట్లుంది. దీనిపై మరింత లోతుగా ఆరా తీసి సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉంది.
- మేస్త్రీ పేరు పైకి చెప్పి వందల కోట్ల టెండర్ సొంత పార్టీ ఎమ్మెల్యేకి కేటాయించడంలో రాజకీయ కోణం ఉంది. బిల్లుల అక్రమ చెల్లింపులో నేరపూరిత కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది.
- ప్రభుత్వ సొమ్మును అధికారులు, కాంట్రాక్టు సంస్థ వాటాలేసుకున్నాయి. ఈ చర్యను దోపిడీ కింద పరిగణించి చర్యలు తీసుకోవాలి.
- అక్రమాలకు పాల్పడి కాంట్రాక్టు సంస్థ నుంచి అదనపు మొత్తాన్ని రికవరీ చేసి అక్రమాలకు సహకరించి లబ్ధి పొందిన అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి.

జమిలి ఆచరణాత్మకం కాదు

కేంద్రం నిర్ణయంపై విపక్షాల మండిపాటు.. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం

- ప్రజల దృష్టి మరల్చడానికే 'జమిలి': ఖర్గే
- జమిలికి బీఎస్పీ చీఫ్ మాయావతి మద్దతు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. ఈ విధానం ఆచరణాత్మకం కాదని, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, సమాఖ్య విధానానికి వ్యతిరేకమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. మోదీ ప్రభుత్వం అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. జమిలి విధానాన్ని దేశం అంగీకరించబోదని పేర్కొన్నారు. 'ఒక దేశం.. ఒకేసారి ఎన్నికలు' అంశం బీజేపీ మరో చౌకబారు ఎత్తుగడ అని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ విమర్శించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలంటున్న బీజేపీ.. ప్రస్తుతం హరియాణా, జమ్మూ కశ్మీర్‌తో పాటు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలను ఒకేసారి నిర్వహించలేని కేంద్రం జమిలి పాట పాడుతోందని శివసేన (యూబీటీ) విమర్శించింది. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం, మహిళలపై నేరాలు, రైతుల కష్టాలు వంటి సమస్యలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వానికి జమిలి ఎన్నికల అంశం మాత్రం చాలా ముఖ్యమైపోయిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి, ఎంపీ అరవింద్ సావంత్ వ్యాఖ్యానించారు. ఒక దేశం.. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆదిత్య ఠాక్రే 'జోక్'గా అభివర్ణించారు. త్వరలో నిర్వహించాల్సిన అన్ని ఎన్నికలను ఐదేళ్ల పాటు వాయిదా వేసేందుకు కేంద్రం కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రాల హక్కులను హరిస్తుందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా ఆందోళన వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలు సమాఖ్య విధానాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తాయని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. రాష్ట్రాల్లో వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరగడం వల్ల ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తప్ప ఎవరికీ ఎలాంటి సమస్య లేదని వ్యాఖ్యానించారు.


బుధవారం విలేకరులతో మాట్లాడుతున్న ఖర్గే

దేశాన్ని ఎప్పటికీ తామే పాలించాలని ఆరాటపడుతున్న బీజేపీ జమిలి ఎన్నికల కోసం ప్రయత్నిస్తోందని జేఎంఎం విమర్శించింది. మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేనను చీల్చిన బీజేపీ.. ఝార్ఖండ్‌లో జేఎంఎంను దెబ్బతీయాలని చూస్తోందని ఆ పార్టీ ఎంపీ మహువా మాఝీ ఆరోపించారు. జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలను నాశనం చేయాలన్నదే బీజేపీ ఎజెండా అని పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయాన్ని ఆప్ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. 4 రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం చేతకానప్పుడు దేశమంతా ఒకేసారి ఎన్నికల గురించి మాట్లాడడం విడ్డూరమని ఎద్దేవా చేసింది. కాగా, కేంద్రం నిర్ణయానికి బీఎస్పీ మద్దతు తెలిపింది. ఈ విషయంలో తమ పార్టీ అనుకూల వైఖరి అవలంబిస్తుందని, దేశ ప్రయోజనాలే జమిలి లక్ష్యం కావాలని మాయావతి అన్నారు.

చరిత్రాత్మక నిర్ణయం: ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు

జమిలికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడాన్ని బీజేపీ నాయకులతో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు స్వాగతించాయి. రాష్ట్రాల్లో వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత విధానంతో అభివృద్ధికి విఘాతం కలుగుతోందని, ఖజానాపై భారం పడుతోందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఎన్నికల ప్రక్రియను క్రమబద్ధం చేయడానికి జమిలికి కేంద్రం ఆమోదం తెలిపిందని, తద్వారా ఎన్నికల ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఎల్‌జేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కొనియాడారు. జమిలితో దేశంలో తరచూ ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం తప్పుతుందని జేడీ(యూ) అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్‌ప్రసాద్ పేర్కొన్నారు. రాజకీయ సుస్థిరతకు, ప్రజాసామ్య పటిష్టానికి కేంద్రం మైలురాయిలాంటి నిర్ణయం తీసుకుందని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు. జమిలి ప్రక్రియను తొలి ప్రధాని నెహ్రూయే ప్రారంభించారని, ఆయన చేసింది తప్పని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నిరూపిస్తారా అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రశ్నించారు.

జమ్ము, కశ్మీర్‌లో 59% పోలింగ్

- ప్రశాంతంగా తొలి దశ ఎన్నికలు

శ్రీనగర్/జమ్ము, సెప్టెంబరు 18 : జమ్ము, కశ్మీర్‌లో 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారిగా జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 59 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. జమ్ము, కశ్మీర్‌లో జరిగిన గత ఏడు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఇదే అత్యధిక పోలింగ్ అని జమ్ము, కశ్మీర్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పీకే పోలే తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, మారుమూల ప్రాంతాల పోలింగ్ వివరాలు కూడా అందితే ఈ పోలింగ్ శాతం మరింత పెరగవచ్చని ఆయన చెప్పారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయిన పోలింగ్ రోజంతా స్థిరంగా కొనసాగింది. మహిళలు, పురుషులు, యువత, వృద్ధులు, నడవలేని వారు కూడా రాష్ట్రమంతటా పోలింగ్ బూత్‌ల వద్ద ఓపిగ్గా వేచిఉండడం కనిపించింది. ఈ రాష్ట్రంలోని మొత్తం 90 అసెంబ్లీ సీట్లకు తొలిదశలో 24 సీట్లకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 16 కశ్మీర్ లోయలో ఉండగా... 8 జమ్ము ప్రాంతంలో ఉన్నాయి. మొత్తం 23 లక్షల మందికిపైగా ఓటర్లు ఈ ఎన్నికల్లో 219 మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు భద్రతా దళాలతో విస్తృతంగా బందోబస్తు కల్పించారు. బిజ్‌బెహరా, డీహెచ్ పోరా వంటి ఒకటి రెండు చోట్ల రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలు తప్ప ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. సెప్టెంబరు 25, అక్టోబరు ఒకటవ తేదీన మరో రెండు దశల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

భూసేకరణ పరిహారంలో జాప్యమెందుకు?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ జరుపుతున్న ప్రభుత్వాలు.. బాధితులకు పరిహారం చెల్లింపులో, పునరావాసం కల్పించడంలో జాప్యం చేస్తుండడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భూ సేకరణ తర్వాత పరిహారం చెల్లింపు, పునరావాసం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ న్యాయవాది కిషన్‌చంద్ జైన్ ఈ ఏడాది ఆగస్టు 3న సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కేంద్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ కిషన్‌చంద్ జైన్ వాదనలు వినిపిస్తూ.. బాధితులకు సత్వర న్యాయం అందాలనే ఉద్దేశంతో భూసేకరణ, పునరావాస, పరిహార సంస్థ(ఎల్‌ఏఆర్‌ఆర్‌ఏ) ఏర్పడిందన్నారు. కానీ, ప్రస్తుతం పరిహారం అందజేత, పునరావాసం కల్పించడంలో అన్ని రాష్ట్రాల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఉదాహరణకు.. ఉత్తరప్రదేశ్‌లో 10,468 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కేసులను పరిష్కరిస్తున్న తీరును చూస్తే అవన్నీ పరిష్కారం కావడానికి మరో పదేళ్లు పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల తీరుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 21వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు అన్ని రాష్ట్రాలకు చెందిన బాధ్యులు వర్చువల్ విధానంలో సుప్రీంకోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది.

తిరుమల లడ్డూ అపవిత్రం

- వైసీపీ హయాంలో ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వు కలిపారు
- అన్నప్రసాద నాణ్యతా తగ్గించారు
- మేమొచ్చాక మంచి నెయ్యి తెప్పించాం: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే శ్రీవారి లడ్డూ ప్రసాదం నుంచి నిత్యాన్న ప్రసాదం వరకు అన్నింటినీ సర్వనాశనం చేశారని తెలిపారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యి ఉపయోగించి తయారు చేయాల్సిన శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో జంతువుల కొవ్వును కలిపారని చెప్పారు. "తిరుమల లడ్డూ ప్రసాదాన్ని నాసిరకంగా మార్చేశారు. ఎన్ని ఫిర్యాదుల చేసినా శ్రీవారి పవిత్రతను దెబ్బతీశారు. ఎన్నోసార్లు చెప్పాం. అయినా.. తిరుమలలో చాలా దుర్మార్గంగా ప్రవర్తించారు. చివరకు అన్న ప్రసాదంలోనూ నాణ్యత లేకుండా చేశారు. సాక్షాత్తూ స్వామి దగ్గర పెట్టే ప్రసాదం కూడా అపవిత్రం చేశారు. నాసిరకం సరుకులే కాకుండా, లడ్డూ ప్రసాదం తయారీకి నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారు. ఈ రోజు స్వచ్ఛమైన నెయ్యి తెమ్మన్నాం. ప్రక్షాళన చేయమని చెప్పాం. ఇప్పుడు నాణ్యత పెరిగింది. ఇంకా నాణ్యత పెంచుతాం. వేంకటేశ్వరస్వామి మనరాష్ట్రంలో ఉండడం మనందరి అదృష్టం. ఆయన కోసం ప్రపంచం మొత్తం మన దగ్గరకి వస్తోంది. అలాంటప్పుడు తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు అన్నారు.

లుక్ అవుట్ నోటీసులపై వివరాలు సమర్పించండి

▸ 'చెవిరెడ్డి' పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశం



అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులపై వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో జారీచేసిన లుక్ అవుట్ నోటీసును ఉపసంహరించేలా ఆదేశించాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది వెంకటేష్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రస్తుత కేసులో మోహిత్‌రెడ్డికి పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇచ్చారు. హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. విదేశాలకు వెళ్లకుండా నిషేధం విధిస్తూ ఎలాంటి షరతు విధించలేదు. పిటిషనర్ సోదరుడు చదువుకొనేందుకు యూకే వెళ్లాల్సి ఉంది. పిటిషనర్ రిఫరెన్స్ ఉంటేనే యునివర్సిటీలో సీటు లభించే అవకాశం ఉంది. ఈ నెల 19న ఇక్కడ నుంచి యూకే బయల్దేరాల్సి ఉంది. ప్రయాణ వివరాలు అధికారులకు అందజేశాం. మూడ్రోజుల పాటు యూకేకి వెళ్లేందుకు పిటిషనర్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి' అని అభ్యర్థించారు. ప్రభుత్వ న్యాయవాది సోమరాజు స్పందిస్తూ.. 'అడ్మిషన్ పొందేందుకు అక్టోబరు4 వరకు సమయం ఉంది. కేసు మొదటిసారి విచారణకు వచ్చింది. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలి' అని అభ్యర్థించారు. వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది.

టీడీపీలో చేరిన పశ్చిమ జడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ప్రసాదరావు అమరావతిలో మంత్రి నారా లోకేశ్ సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. పద్మశ్రీ దంపతులను మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సచివాలయంలో సీఎం చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగానే అంతా కలిసి పనిచేయాలని వారికి చంద్రబాబు సూచించారు.



లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన పద్మశ్రీ దంపతులు

తిరుపతి నుంచి నేరుగా ఢిల్లీకి విమాన సర్వీసులు

రేణిగుంట, సెప్టెంబరు 18: తిరుపతి నుంచి నేరుగా ఢిల్లీకి ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 5 నుంచి నేరుగా ఢిల్లీకి సర్వీసులు నడపనున్నట్లు ఇండిగో సంస్థ పేర్కొంది. ఢిల్లీలో ఉదయం 9.10 గంటలకు బయలుదేరి 11.45 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.45 గంటలకు ఢిల్లీకి వెళుతుంది.

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు మృతి



ఉబా రాజారావు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 18: మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఉబా రాజారావు (74) మృతిచెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు ముగ్గురు కుమారులు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారానికి చెందిన రాజారావు సుమారు 40 ఏళ్ల పాటు కార్మిక, దళిత ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. బొమ్మూరులో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

వైసీపీకి బిగ్ షాక్

గుడ్‌బై చెప్పిన మాజీ మంత్రి బాలినేని

(ఒంగోలు - ఆంధ్రజ్యోతి)

రాజకీయంగా కునారిల్లుతున్న వైసీపీకి మరో బిగ్ షాక్ తగిలింది. ఇప్పటికే ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ముగ్గురు ఎమ్మెల్సీలతో సహా పలువురు ముఖ్య నాయకులు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఇప్పుడు ఆ పార్టీ అధినేత జగన్ బంధువు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వంతు! బుధవారం ఆయన వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. విలువ లేని, ఆత్మాభిమానానికి అవకాశం లేని వైసీపీలో కొనసాగలేకపోతున్నానని ఆయన ప్రకటించారు. "జగన్ చాలా తప్పులు చేశాడు.. ఇప్పటికీ మారలేదు" అని బాలినేని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో ఆయన గురువారం భేటీ కాబోతున్నారు. దీంతో ఆయన జనసేనలో చేరబోతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. మాజీ సీఎం రోశయ్య మంత్రివర్గంలో గనులశాఖ మంత్రిగా ఉన్న బాలినేని వైసీపీ ఆవిర్భావంతో మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. అప్పటి నుంచి ఆ పార్టీ రాష్ట్ర నాయకుల్లో ఒకరిగా ఉన్నారు. జగన్‌కు వరుసకు బాబాయి అయిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి బాలినేని బావమరిది. దగ్గరి బంధుత్వం కావటంతో జగన్‌తో అవినాభావ సంబంధాలతో చాలాకాలం ఆ పార్టీలో పనిచేశారు. జగన్ ప్రభుత్వంలో తొలి మంత్రివర్గంలో స్థానం పొందారు. తర్వాతి విస్తరణలో ఆయనను జగన్ తప్పించారు. ప్రకాశం జిల్లాకు చెందిన మరో మంత్రి ఆదిమూలపు సురేశ్‌ను కొనసాగిస్తూ తనను పదవి నుంచి తప్పించటంపై అసంతృప్తి వ్యక్తంచేసిన బాలినేనిని, పలు ప్రయత్నాలతో జగన్ సర్దుబాటు చేసుకున్నారు. ఆ తర్వాత నుంచి అనేక సందర్భాల్లో జగన్ రాజకీయ, పాలనా నిర్ణయాల పట్ల అసంతృప్తిని బాలినేని వెలిబుచ్చుతూ వచ్చారు. దీనిని జీర్ణించుకోలేని జగన్, క్రమేపీ ఆయనను దూరం పెట్టారు. గత ఎన్నికల సమయంలో కూడా బాలినేని పార్టీ మారే ప్రయత్నాలు చేశారని చెబుతున్నారు. టికెట్ల కేటాయింపు సమయంలోనూ జగన్‌తో ఆయనకు విభేదాలు వచ్చాయి. ఒంగోలు ఎంపీగా తిరిగి మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఉంచాలని బాలినేని చేసిన ప్రయత్నాలను జగన్ తోసిపుచ్చారు. గత ఎన్నికల్లో పార్టీ ఓటమి అనంతరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా చెవిరెడ్డిని నియమించాలని జగన్ ప్రయత్నించగా, వ్యతిరేకించారు. తిరిగి ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఆ తర్వాత రాజకీయంగా ఎదురవుతున్న సవాళ్ల దృష్ట్యా బాలినేని మనసు మార్చుకున్నట్లు సమాచారం.



రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్‌రావు తమ పదవులకు, వైసీపీకి ఇటీవల రాజీనామా చేశారు. ఆ వెంటనే మోపిదేవి టీడీపీలో చేరారు. అదేక్రమంలో ముగ్గురు ఎమ్మెల్సీలు కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పారు. కింది స్థాయిలో ఆ పార్టీలోని పలు

ఎంపీల రాజీనామాలతో అలజడి..

వురు నాయకులు, ప్రజాప్రతినిధులు కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలో చేరటాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే మొదట్లో కాంగ్రెస్‌లోను, ఆ తర్వాత వైసీపీలోను ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన బాలినేని వైసీపీకి దూరమవుతున్నట్లు సంకేతాలు వచ్చాయి. ఇది గమనించిన జగన్ వారం క్రితం ఆయన్ను పిలిపించుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకొని రాజకీయంగా యాక్టివ్ కావాలని కోరారు. జనసేనలో చేరే ఆలోచన ఉంటే విరమించుకోవాలని, ఆ పార్టీకి భవిష్యత్ లేదని తిరిగి మనమే అధికారంలోకి రాబోతున్నామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జగన్ మాటలు పట్టించుకోని బాలినేని, వైసీపీలో తనకు జరిగిన అవమానాలను, జగన్ తీసుకున్న అనేక రాజకీయ విపత్కర నిర్ణయాలను, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఆ తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి విడదల రజనీ లాంటి నాయకులు జగన్ దూతగా బాలినేనిని సముదాయించే ప్రయత్నాలు చేశారు. అయితే వైసీపీని వీడాలని నిర్ణయానికి వచ్చిన బాలినేని, వారి ప్రతిపాదనను తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా చోటుచేసుకున్న కొన్ని పరిణామాల మధ్య ఆయన బుధవారం తన రాజీనామాను జగన్‌కు మెయిల్ ద్వారా పంపారు. మంగళవారం ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుతో భేటీ అయినట్లు తెలిసింది. ఆయనతో జరిగిన చర్చలు ఫలించటం, బుధవారం పవన్‌కల్యాణ్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావటంతో వైసీపీకి రాజీనామాను బాలినేని ప్రకటించారు. జనసేనానిని కలిసేందుకు హైదరాబాద్ నుంచి బుధవారం రాత్రికి విజయవాడ చేరారు.

వైసీపీలో విలువలు నిల్

వైసీపీలో రాజకీయ విలువలు కరువయ్యాయని రాజీనామా అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. పాలనా, రాజకీయపరమైన అనేక నిర్ణయాల్లో లోపాలను ఎత్తిచూపితే జగన్ భరించలేకపోయారన్నారు. పైగా పలు అంశాలను దృష్టిలో ఉంచుకొని తనను అనేక ఇబ్బందులకు గురిచేశారని వాపోయారు. తనను ఎన్నో అవమానాలకు గురిచేసినా, వైఎస్ రాజశేఖర రెడ్డి అంటే ఉన్న అభిమానంతోనే వైసీపీలో ఇంతకాలం కొనసాగానన్నారు. ఏఏ సందర్భాల్లో తాను ఇబ్బందిపడ్డానో, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసుకోవాల్సి వచ్చిందో సమయం వచ్చినప్పుడు చెబుతానని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో బాలినేని మాట్లాడుతూ, తాను ఎలాంటి షరతులు లేకుండా స్వచ్ఛందంగా జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యానని చెప్పారు. ప్రజాసేవ, పార్టీసేవలో తనను ఎలా వినియోగించుకోవాలనేది పవన్‌కల్యాణ్ నిర్ణయమన్నారు.

బాలినేని టచ్‌లో...

ప్రకాశం జిల్లాలో వైసీపీ గెలిచింది రెండు ఎమ్మెల్యే సీట్లు. అందులో ఒక ఎమ్మెల్యే. బాలినేని టచ్‌లో ఉన్నారు. ఈ జిల్లాలో ద్వితీయశ్రేణి వైసీపీ నాయకుల్లో పలువురు ఆయన బాటన నడిచేందుకు సిద్ధమయ్యారు. ఈ జిల్లాలో ఆ పార్టీ తరఫున గెలుపొందిన ఇద్దరు ఎమ్మెల్యేలలో కొత్త ఎమ్మెల్యే ఒకరు కూడా ఆయనతో టచ్‌లో ఉన్నారు. బాలినేని ప్రాతినిథ్యం వహించిన ఒంగోలు కార్పొరేషన్‌లోని మేయర్, మరో 20మంది వరకు కార్పొరేటర్లు ఇప్పటికే టీడీపీలో చేరగా, మరో 22 మంది బాలినేనితో ఉన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో చర్చల అనంతరం జిల్లాలోని కొందరు వైసీపీ నాయకులతో కలిసి ఆయన జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. సొంత బావ అయిన వైవీ సుబ్బారెడ్డితో కూడా బాలినేనికి రాజకీయ విభేదాలు ఉన్నాయి. బాలినేని వెంట ముఖ్యులు వెళ్లకుండా జిల్లాలోని వైసీపీ నాయకులను ఆపేందుకు సుబ్బారెడ్డి ప్రయత్నిస్తున్నారు.

తీవ్రవాదుల పార్టీ బీజేపీ

▸ విద్వేష వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి: షర్మిల

విజయవాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశంలో అసలు తీవ్రవాదులు ఎవరో బీజేపీ సమాధానం చెప్పాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీని ఉగ్రవాది అంటూ బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా విజయవాడలో బుధవారం కాంగ్రెస్ నేతలు ధర్నా చేశారు. రాహుల్‌ను హత్య చేయించడానికే బీజేపీ నేతలు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని షర్మిల మండిపడ్డారు. బీజేపీ నేతలు హద్దులు దాటి వ్యవహరిస్తున్నా మోదీ, అమిత్‌షా నోరు విప్పడం లేదన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసలు తీవ్రవాదుల పార్టీ బీజేపీ అని ధ్వజమెత్తారు. మతాల మధ్య చిచ్చుపెట్టి, అందులో చలి కాచుకోవాలన్నది బీజేపీ సిద్ధాంతమన్నారు. దేశంలో అట్టడుగు వర్గాల ప్రజలు 90 శాతం మంది ఉండగా, అభివృద్ధిలో వారికి వాటా లేదని చెప్పడం తీవ్రవాదమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అన్ని మతాలు, కులాలను సమానంగా చూసిందని చెప్పారు. రాహుల్ నాన్నమ్మ, తండ్రి ఇద్దరూ తీవ్రవాదుల చేతుల్లో బలయ్యారన్నారు. రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరించిందన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడం టెర్రరిజం కాదా అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, కొప్పుల రాజు, షేక్ మస్తాన్ వలీ, నరహరశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో ధర్నాచేస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, కాంగ్రెస్ నాయకులు

కాంట్రాక్టర్లు వచ్చేశారు!

▸ శ్రీశైలం క్రస్ట్‌గేట్ల మరమ్మతులకు త్వరలో శ్రీకారం

▸ వైసీపీ ప్రభుత్వంలో నాలుగుసార్లు టెండర్లు

▸ బిల్లులు రావనే భయంతో ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్‌గేట్ల మరమ్మతు పనులు చేసేందుకు ఎట్టకేలకు కాంట్రాక్టరు ముందుకు వచ్చారు. టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు ఇంజనీర్లు ఐదో విడత టెండర్లు పిలిచారు. క్రస్ట్‌గేట్ల మరమ్మతులకు కర్నూలు నగరానికి చెందిన కాంట్రాక్టరు శ్రీనివాసులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులకు హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టరు పాండురంగ టెండరు వేశారు. నిబంధనల మేరకు కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకుని త్వరలోనే మరమ్మతులకు శ్రీకారం చుడతామని జల వనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ కబీర్ బాషా, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. స్పిల్‌వే గేట్లు ఏర్పాటు చేసి 42ఏళ్లు దాటుతోంది. రబ్బర్ సీల్స్ దెబ్బతినడంతో చిన్నపాటి లీకేజీలు వస్తున్నాయి. రూ.1.5 కోట్లతో క్రస్ట్‌గేట్ల మరమ్మతులు, రూ.కోటితో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు గత వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్లుగా నాలుగు పర్యాయాలు టెండర్లు పిలిచారు. బిల్లులు రావడం లేదనే భయంతో అప్పట్లో ఏ ఒక్క కాంట్రాక్టరు కూడా ముందుకు రాలేదు. ఆగస్టు 1న సీఎం చంద్రబాబు శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా గేట్ల మరమ్మతుల అంశాన్ని ఇంజనీర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లి, ఐదో విడత టెండర్లు పిలిచారు. ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కిందపడే వరద మళ్లీ ఎగిరిపడే ప్రాంతం (ప్లంజ్ పూల్)లో భారీ గుంత ఏర్పడింది. ఇది 45 మీటర్ల లోతు, 270 మీటర్ల వెడల్పు, 400 మీటర్ల పొడవు ఉంటుందని అంచనా వేశారు. దీనిపై అధ్యయనం కోసం రూ.17 కోట్లు ఇవ్వాలంటూ ప్రాజెక్టు ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఫైలు ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉంది. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు డాక్టర్ హ్యానిశ్‌శాలం, అభిషేక్‌కుమార్ రెండు నెలల క్రితం డ్యాంను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాజెక్టు శాశ్వత మరమ్మతులపై పలు సూచనలు చేశారు. ఈ మేరకు 'డ్యాం రిహాబిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం'(డ్రిప్)-2 కింద రూ.203కోట్లు ఇవ్వాలని కోరుతూ ప్రతిపాదనలు పంపినట్లు సీఈ తెలిపారు.




నారాయణగిరి పార్కులో సర్వ దర్శన క్యూలైన్

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నాలుగు రోజులుగా రద్దీ కొనసాగుతోంది. వరుస సెలవులు, పెరటాశి మాసం ప్రారంభమైన నేపథ్యంలో తిరుమల కొండపై రద్దీ అధికంగా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. ఇక, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, స్లాటెడ్ సర్వదర్శన భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. వీరికి కూడా దర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పడుతోంది.

తిరుమలలో అన్యమత చిహ్నంతో ద్విచక్ర వాహనం

▸ అలిపిరిలో మరోసారి భద్రతా వైఫల్యం



తిరుమల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అలిపిరిలో మరోసారి భద్రతా వైఫల్యం బయటపడింది. అన్యమత చిహ్నంతో ఉన్న ఓ ద్విచక్ర వాహనం బుధవారం శ్రీవారి ఆలయం సమీపానే కనిపించడం కలకలం సృష్టించింది. ఉద్యోగులు, మీడియా, పోలీసు సిబ్బంది ద్విచక్ర వాహనాలను రాంభగీచ విశ్రాంతి గృహాల ముందున్న స్థలంలో పార్కింగ్ చేస్తారు. ఈక్రమంలో బుధవారం ఉదయం పార్కింగ్‌లో ఉన్న టీజీ 08సీ 3568 నంబరు గల ద్విచక్ర వాహనంపై ఇతర మతానికి చెందిన గుర్తు పెద్దగా ఉండటాన్ని అక్కడి వ్యాపారులు, స్థానికులు గుర్తించారు. వీరి సమాచారంతో భద్రతా సిబ్బంది చేరుకుని ఆ ద్విచక్రవాహనాన్ని విజిలెన్స్ కార్యాలయానికి తరలించారు. ఈ వాహనం ఎవరిదనేది తెలియాల్సి ఉంది. రాజకీయ, ఇతర మతాలకు చెందిన ఫొటోలు, గుర్తులు, నినాదాలతో ఉన్న వాహనాలను తిరుమలకు రాకుండా అలిపిరి టోల్‌గేటు వద్ద సిబ్బంది గమనించి అడ్డుకోవాలి. తనిఖీలను దాటుకుని అన్యమత చిహ్నంతో ద్విచక్ర వాహనం తిరుమలకు రావడంపై విజిలెన్స్ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.



బాలుడి మృతదేహంతో ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న తండ్రి, బంధువులు

అయిపోయిన ఆక్సిజన్.. బాలుడి మృతి

▸ అంబులెన్స్‌లోని సిలిండర్ దారిలోనే ఖాళీ

▸ ప్రైవేటు వైద్యుడి కాసుల కక్కుర్తి

▸ గుంతకల్లులో దారుణం

▸ ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 18: ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడి కాసుల కక్కుర్తి, అంబులెన్స్ నిర్వాహకుడి నిర్లక్ష్యానికి ఏడాది వయసున్న బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన షఫీ, జాస్మిన్ దంపతుల కుమారుడు ఇంతియాజ్(1) జ్వరంతో బాధపడుతుండటంతో పది రోజుల క్రితం పట్టణంలోని ఆర్టీ గుప్త ఆస్పత్రిలో చేర్చారు. జ్వరం తగ్గకపోవడంతో రెఫర్ చేస్తే బెంగళూరు లేదా కర్నూలుకు తీసుకెళ్తామని బాలుడి తల్లిదండ్రులు చెప్పగా.. వైద్యుడు కీర్తి కిరణ్ రెడ్డి అంగీకరించలేదు. 'నేను రెఫర్ చేస్తేనే వెళ్లాలి. అంతా మీ ఇష్టమేనా. ఇక్కడే తగ్గిపోతుందిలే' అన్నారు. బుధవారం వేకువజామున బాలుడి పరిస్థితి విషమించడంతో వెంటనే కర్నూలుకు తీసుకెళ్లాలని డాక్టర్ కీర్తి కిరణ్ సూచించారు. 'నేను అంబులెన్స్ రెడీ చేస్తాను. అందులో ఆక్సిజన్ ఉంటుంది. ఆక్సిజన్ పెట్టుకుని కర్నూలుకు తీసుకెళ్లండి' అన్నారు. అయితే, ప్యాపిలి మండల కేంద్రం వరకు వెళ్లగానే అంబులెన్స్‌లో ఆక్సిజన్ అయిపోయింది. దీంతో ఊపిరి అందక బాలుడు మరణించాడు. బాలుడి తల్లిదండ్రులు, బంధువులు మృతదేహంతో ఆర్టీ గుప్త ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నా సరైన వైద్యం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్, అంబులెన్స్ నిర్వాహకుడి నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని షఫీ ఆరోపించారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు అక్కడికి చేరుకొని వైద్యుడితో మాట్లాడారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తానని డాక్టర్ చెప్పడంతో ఆందోళన విరమించారు.

అంబులెన్స్ ఓనర్ బెదిరింపులు

బాలుడి మృతదేహాన్ని అంబులెన్స్‌లో తిరిగి గుంతకల్లుకు తీసుకొస్తున్న సమయంలో అంబులెన్స్ ఓనర్ సలీం తమను బెదిరించాడని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించారు. 'ఆసుపత్రి వద్ద గొడవ చేస్తే మీ సంగతి చూస్తా' అని బెదిరించాడన్నారు. ఆసుపత్రి వద్దకు రాగానే బాలుడి మృతదేహాన్ని కిందకు దించి, అంబులెన్స్ అద్దాలను పగులగొట్టారు. దీంతో అంబులెన్సు నిర్వాహకుడు అక్కడి నుంచి ఉడాయించాడు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

నార్పల, సెప్టెంబరు 18: అనంతపురం జిల్లా నార్పల మండలంలోని బి.పప్పూరు గ్రామానికి చెందిన రైతు కుళ్లాయప్ప(45) అప్పులబాధతో మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుళ్లాయప్ప తన రెండు ఎకరాల పొలంలో మిరప, టమోటా, అరటి సాగు చేసి నాలుగేళ్లుగా నష్టపోయాడు. అప్పులు రూ.8 లక్షలకు పైగా పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. కుళ్లాయప్పకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'జమిలి' దిశగా...

జమిలి ఎన్నికల విషయంలో మరో అడుగుపడింది. ఈ మధ్యనే, సార్వత్రిక ఎన్నికలకు కాస్తంత ముందు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన నివేదికను కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. లోక్‌సభలో సొంతబలం గట్టిగా ఉన్న తొలి రెండు పర్యాయాల్లో ఈ దిశగా సాగించిన ప్రయత్నాలను, ఇప్పుడు సరిపడా స్వశక్తి లేని దశలో కూడా ముందుకు తీసుకుపోవాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించుకుంది. జమిలితో దేశానికి ఎంతో మంచిది అంటూ బీజేపీ పెద్దలు పట్టు వీడకుండా పోరాడుతున్న తీరు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

విపక్షాలు ఆదినుంచీ జమిలిని వ్యతిరేకిస్తున్నాయి కనుక, ఇప్పుడు మరింత గట్టిగా విరుచుకుపడటం సహజం. దేశానికి మంచిదన్న పేరిట బీజేపీ తన స్వార్థరాజకీయ ప్రయోజనాలకోసం, ఉజ్వల భవిష్యత్తు కోసం, మిగతాపార్టీల పతనం కోసం ఈ జమిలిని దేశంమీదకు రుద్దుతున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. చీటికీమాటికీ ఎక్కడోక్కడ ఎన్నికలు వచ్చిపడుతూ, అవి ఎక్కడ జరిగినా విధాన నిర్ణయాలకు, అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతున్న స్థితిలో జమిలి వల్ల మాత్రమే ప్రజాధనం ఆదాకావడంతో పాటు, అభివృద్ధి కూడా పరుగులుపెడుతుందని అధికారపక్షం చెబుతూవస్తోంది. మోదీ మొదటివిడత ఎన్నికల మానిఫెస్టోలోనే జమిలి ప్రతిపాదన ఉంది. మరో రెండేళ్ళకు నీతిఆయోగ్ బరిలోకి దిగింది. మరో రెండేళ్ళకు లా కమిషన్ తన లోతైన అధ్యయనంతో ఏకకాల ఎన్నికలకు ఏయే రాజ్యాంగసవరణలు అవసరమో చెప్పింది. ఒకప్పుడు ససేమిరా కూడదన్న కమిషనే మోదీ ఏలుబడిలో అందుకు సరేనన్నది. ప్రధాని మోదీ ఓ అఖిలపక్షాన్ని ఏర్పాటుచేయడం, కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు వెళ్ళకపోవడం తెలిసిందే. జమిలిమీద ఎందుకంత ప్రేమ కలిగిందో తెలియదు కానీ, రెండేళ్ళక్రితం అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ తాము సిద్ధం అన్నరీతిలో ఓ ప్రకటన చేసేశారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తున్నప్పుడు, ఫలానా రాష్ట్రాన్ని జాబితాలో చేర్చకపోవడానికి ఈవీఎంల లభ్యత, సైనికబలగాల తరలింపుల వంటి సమస్యలు కారణమని ఎన్నికల అధికారులు చెబుతూంటారు. దేశవ్యాప్తంగా ఒకేమారు ఎన్నికలు జరపాలనుకుంటే ఈ తరహా చాలా రకాల కొరతలున్నాయని నిపుణులు చేస్తున్న విశ్లేషణలు కూడా కొందరికి నచ్చడం లేదు. బందోబస్తు సంగతి అటుంచితే, లక్షలాది ఈవీఎంలను వేలకోట్ల ఖర్చుతో కొనాల్సి ఉంటుందన్నది వాస్తవం. ఏకకాలంలో ఎన్నికల మంచిచెడులమీద ఇప్పటికే మాధ్యమాల్లో కొంత చర్చ జరిగింది. ప్రజాధనం వృధాకావడం నుంచి అభివృద్ధి సంక్షేమపథకాల నిరవధిక అమలు వరకూ ప్రతీ వాదనమీదా భిన్నాభిప్రాయాలున్నాయి.

జమిలి విషయంలో బీజేపీ పట్టుదల వెనుక తమ ఉనికిని దెబ్బతీసే రాజకీయ లక్ష్యం ఉన్నదని ప్రాంతీయపార్టీల వాదన. ఏకకాలంలో ఎన్నికలు జరిగినప్పుడు కేంద్రంలో ఎవరుండాలన్న అంశమే రాష్ట్రస్థాయి ఎంపికనూ ప్రభావితం చేస్తుందని, ఓటర్లు అక్కడా ఇక్కడా ఒకేపార్టీ అన్నధోరణిలో పోతారని వాటి భయం. జాతీయాంశాలు ముందుకు వచ్చి తమను దెబ్బకొడతాయని వాటి వాదన. దేశభక్తి, సరిహద్దు సమస్యలు, యుద్ధాలు, కులమతాలు ఇత్యాదివి ప్రభావితం చేసినప్పుడు స్థానికాంశాలు వెనక్కుపోవచ్చు. జమిలివస్తే ఒకేపార్టీకి ఓటుచేస్తామని డెబ్బయ్‌శాతం మంది ఓ సర్వేలో చెప్పారట.

'ఒకేదేశం–ఒకే ఎన్నిక' విధానం ప్రజాస్వామ్యానికి మంచిదా కాదా అన్నది అటుంచితే, బీజేపీ గతంలో కంటే దిగజారిన తన సంఖ్యాబలంతో దానిని గట్టెక్కించగలదా అన్నది ప్రశ్న. బీజేపీ ఆశిస్తున్నది జరగాలంటే, రాజ్యాంగానికి అరడజను సవరణలు చేయాలి, అందుకు మూడింట రెండువంతులమంది సభ్యులు దానిపక్షాన ఉండాలి, ఆ తరువాత రాష్ట్రాలు దానిని ఆమోదించాలి. ఈ దేశంలో ప్రజలూ ఇతర పార్టీలూ జమిలిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందున ఇదంతా జరిగేది కాదని, ప్రజల దృష్టిమరల్చే ప్రయత్నమని కాంగ్రెస్ అంటున్నప్పటికీ, తిమ్మినిబమ్మిని చేసి అయినా సరే, బీజేపీ కచ్చితంగా తాను అనుకున్నది సాధిస్తుందని అత్యధికుల విశ్వాసం. కోవింద్ కమిటీ ముందు తలూపిన పార్టీల్లో కొన్ని భవిష్యత్తులో కాదుపొమ్మన్నా, కొత్త చేయూతలతో గట్టెక్కవచ్చునని బీజేపీ పెద్దలు నమ్మకంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

భావుక 'నయాగరా'

'నయాగరా' కవులలో ఒకరైన బెల్లంకొండ రామదాసు 23 ఆగస్టు, 1923న గుంటూరు జిల్లా, నరసరావుపేట తాలూకా, పమిడిపాడు గ్రామంలో జన్మించారు. సంస్కారం, సంప్రదాయం, సంపత్తి త్రివేణీలా సంగమించిన కుటుంబంలో జన్మించిన రామదాసు బాల్యం నుంచీ భావుకులు. స్వాప్నిక వాతావరణంలో పెరిగారు. సౌందర్య ప్రియత్వం జన్మతః అబ్బిన గుణం. సాహిత్య ప్రియులైన తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా లభించిన సృజనాత్మకశక్తి... బ్రహ్మ సమాజం, కాంగ్రెస్, నవ్య సాహిత్య పరిషత్తుల ప్రభావంతో రూపుదిద్దుకుంది.

శ్రీశ్రీ బాటలో నడిచినా తనదైన ఒక ప్రత్యేక బాణీ ఏర్పరచుకొని, ఆకాశ మార్గంలో విహరించే కవిత్వాన్ని భూమ్మీదకు దారి మళ్ళించిన అభ్యుదయ కవుల్లో ఆయన ఒకరు. 1940లో 'శ్మశానం' అనే పేరుతో తొలి కవితా సంపుటి రచించారు. 1944లో ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులుతో కలిసి 'నయాగరా'– తొలి కావ్యం రచించారు. 1953లో తొలి నాటకం 'అతిథి' రచించారు. ఎంతో మననం, జీవితానుభవం, అంతరంగ బహిరంగ సంఘర్షణ, సూక్ష్మ పరిశీలన తరువాత, విశ్వ జీవిత వివిధ ముఖాలను దర్శించి, ధ్యానించి అవబోధన పొందిన తర్వాత తనలో ఏర్పడ్డ తత్వదృష్టిని 'అతిథి' అనే నాటకంలో ప్రస్తావించానని చెప్పుకున్న రామదాసు, తెలుగు నాటక రంగానికి ఒక కొత్త ఒరవడి దిద్దారు.

1956లో 'పునర్జన్మ' నాటకం రాశారు. హరీంద్రనాథ చటోపాధ్యాయ, శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయల ఆంధ్ర పర్యటన, మాస్కో ఆర్ట్ థియేటర్, స్టానిస్లావిస్కీల ప్రభావం తెలుగు నాటక రచయితల పైనా, నటనారీతుల పైనా, ప్రదర్శన ధోరణుల మీద పడింది.

నాటకరంగ పితామహుడు స్టానిస్లావిస్కీల ప్రభావం బెల్లంకొండ రచనా విధానంలోనూ, పాత్ర చిత్రణలోనూ కనిపిస్తుంది. రవీంద్రనాథ్ ఠాగూర్‌లోని సౌందర్య ప్రియత్వం, భావుకత ప్రభావం కూడా రామదాసు పాత్రల్లో గోచరిస్తుంది. 'పునర్జన్మ'లో 'మూర్తి' లాగానే భావుకుడైన రామదాసు కేవలం ఊహాలోకాల్లో విహరించలేదు. వాస్తవ జీవితంలో, సమాజంలోని అన్యాయాల పట్ల ఆక్రోశించే వ్యక్తిత్వం, తిరుగుబాటు చేసే విప్లవ దృక్పథమూ కనిపిస్తాయి. మనుషుల ప్రవర్తనలను పరిపాలించేవి వారికి ఎదురైన పరిస్థితులే అన్న నిజం ఈ నాటకంలో కనిపిస్తుంది. ఈ నాటకానికి ప్రేరణ రష్యన్ నాటకం 'రిజరెక్షన్' అని చెప్పినా, ఇందులో ప్రధాన పాత్ర శ్యామల... టాల్‌స్టాయ్ 'అన్నా కెరినినా'ను గుర్తుకు తెస్తుంది. పరిస్థితులకు లోబడి పతితగా మారి నైతిక ప్రాపకం కోసం ఆమె పడ్డ ఆరాటం, లోకనిందకు గురయి, స్వేచ్ఛ కోసం ఆమె పడ్డ తపన శ్యామల పాత్రలో గోచరిస్తాయి.



శ్రీశ్రీ బాటలో నడిచినా తనదైన ఒక ప్రత్యేక బాణీ ఏర్పరచుకొని, ఆకాశమార్గంలో విహరించే కవిత్వాన్ని భూమ్మీదకు దారి మళ్ళించిన అభ్యుదయ కవుల్లో బెల్లంకొండ రామదాసు ఒకరు. 1940లో 'శ్మశానం', 1944లో ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులుతో కలిసి తొలి వచన కావ్యం 'నయాగరా' వెలువరించారు.

1956లో 'పంజరం', 1957లో 'ఆకాశరామన్న' నాటకాలు రాశారు. ర.స.న. సమాఖ్య, విజయవాడ సంస్థలోని నటులు, దర్శకులు కె. వెంకటేశ్వరరావు కూడా "ఈ నాటకాన్ని రెంటాల గోపాలకృష్ణ, గిడుతూరి సూర్యంలు 'ఇన్‌స్పెక్టర్ జనరల్'; సోమంచి యజ్ఞన్న శాస్త్రి 'మహానుభావులు' పేరుతో అనువదించినా... 'ఆకాశరామన్న (1957)'కి లభించిన ప్రజాదరణ మిగిలిన వాటికి లభించలేదు" అంటారు. బెల్లంకొండ రామదాసు 'అతిథి', 'మాస్టర్జీ', 'పునర్జన్మ' 'ఆకాశరామన్న' నాటకాలు పీడిత ప్రజానీకానికి, ధనవంతుల అవినీతికీ దర్పణాలే. అదే సమయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నాటకాలను అనుసరించి 'రాజు–రాణి', 'బలిదానం'లను తెలుగులో రచించారు. 'అమ్మణ్ణి', 'గతానుగతం'... నాటకాలు రచించారు. యుద్ధము–శాంతి (సమరము –శాంతి) (3 భాగాలు), (టాల్‌స్టాయ్) – రెంటాల గోపాలకృష్ణతో కలిసి రచించారు. ఈ రోజున నా గీతం (నాటకం), 1957లో డోరియన్ గ్రే (ఆస్కార్ వైల్డ్) (అనువాద నవల), 1958లో నీలి కళ్లు (బాల్జాక్) (అనువాద నవల), 1959లో జీవితము–మతము (టాల్‌స్టాయ్ వ్యాసావళి– అనువాదం), 1959లో పరిత్యాగము (ఠాగూర్ – అనువాద కథలు – నన్నపనేని సుబ్బారావుతో కలిసి), 1959లో నానా (ఎమిలి జోలా – అనువాద నవల), 1960లో కలికాలం (చార్లెస్ డికెన్స్ – అనువాదం), చందమామ (కథ), చతురస్రం (గొలుసు– అనువాద కథ), పిచ్చివాని జ్ఞాపకాలు (టాల్‌స్టాయ్ కథలు– అనువాదం) (పిచ్చివాని జ్ఞాపకాలు, యజమాని–మనిషి, నెగడి), గిలక కడవ (బెంగాలీ అనువాద కథలు), మన కాలం వీరుడు (లెర్మంతోవ్ నవల), భయస్థుడు (గోర్కి– అనువాద నవల), ఇవాన్ ఇలిచ్ మృతి మరికొన్ని కథలు (టాల్‌స్టాయ్) (అనువాద నవల), కన్నీరు (మపాసా) (అనువాద నవల), గీతాంజలి (ఠాగూర్) (అనువాదం), రెబెకా (అనువాదం) వంటి రచనలు చేసిన సాహిత్యమూర్తి.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కాలంలో ఆనాటి యువకులను మార్క్సిజం పట్ల అనురక్తి, గాంధీవాదం పట్ల ఆసక్తి అల్లుకున్న కాలం అది... కాల్పనికవాదం, అనురాగం, అభ్యుదయ దృక్పథం, స్త్రీ సమస్యలూ ఆనాటి రచయితలను వెన్నంటిన రోజులవి. ప్రజా ఉద్యమాలకూ, రాజకీయ చైతన్యానికి, సాహిత్య, కళారంగాలకు నెలవైన విజయవాడ పట్టణంలో విద్యాభ్యాసం, పత్రికా రంగంలో ఉద్యోగం, ప్రసిద్ధ కవులు రచయితలతో పరిచయాలూ, ప్రముఖ ప్రచురణ సంస్థల ప్రోత్సాహమూ, కళా రంగంలో నిష్ణాతులూ, నూతన ప్రయోగాభిలాషుల తోడ్పాటుతో ఆయన నాటక కృషీవలత్వం కొత్త పుంతలు తొక్కింది. 'సంఘం కంటే మించింది అంతరాత్మ, దానికి మనం తల ఒగ్గాలి' అని ఒకచోట అంటే... 'అంతరాత్మ కంటే ఆకలి గొప్పది...' అంటూ 'ఆకలి అవినీతి వైపు చేయి చాచినా క్షమార్హమనే' అంటారు.

నాటకరంగంలో బంగారు పంటలు పండించిన బెల్లంకొండ రామదాసు 1969 సెప్టెంబరు 19న స్వర్గస్తులైనారు. భౌతికంగా దూరమైనా ఆయన స్థానం తెలుగు నాటకాభిమానుల గుండెల్లో చిరస్థాయిగా, పదిలంగా నిలిచే ఉంటుంది.

• డా. మోహనరావు కొల్లి
నాటకరంగ నిపుణులు

(నేడు బెల్లంకొండ రామదాసు వర్ధంతి)

రాజీవ్ గాంధీకి, తెలంగాణ తల్లికి పోటీ ఎందుకు?





■ కె. శ్రీనివాస్

సందర్భం

రాహుల్ గాంధీ మీద శివసేన ఎమ్మెల్యే ఒకరు, బీజేపీ ఎంపీ ఒకరు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ, బుధవారం నాడు ఢిల్లీలోనూ, హైదరాబాద్‌లోనూ జరిగిన ఆందోళనల తీరు చూస్తే, కాంగ్రెస్ శ్రేణులలో తిరిగి భావావేశాలు ప్రవేశించాయని అనిపించింది. రాహుల్ రాజకీయ పరిణతిని అభిమానించేవారే కాక, అయన వ్యక్తిత్వంతో అనుబంధాన్ని పెంచుకుంటున్నవారు కూడా పెరుగుతున్నారు. ఇది కాంగ్రెస్‌కు మంచిది. కొన్ని దశాబ్దాలుగా ఆ పార్టీ జనరంజక అధినేత లేని కొరతలో ఉంది, ఇందిర, రాజీవ్ ముఖచిత్రాల మీదనే ఇంకా ఆధారపడుతోంది.

గాంధీ కుటుంబం గురించి గాడిదలకేమి తెలుసును అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు కానీ, ఇక్కడ ఆయన ఉద్దేశం, గాంధీ కుటుంబం అంటే నెహ్రూ కుటుంబం. జాతీయోద్యమ నాయకుడిగా, సాహిత్య, కళా, మేధారంగాల అభిరుచి కలిగిన వాడిగా నెహ్రూ మీద దేశంలో గౌరవం, ఆరాధన ఉన్నాయి కానీ, ఆయనేమీ గాంధీ లాగా మాస్ లీడర్ కాదు. ప్రజా నాయకురాలు అంటే, ఇందిరాగాంధీయే. ఇందిర మరణానంతరం ఉప్పొంగిన సానుభూతి వెల్లువలో రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. ఆయన తరువాత, దేశంలో కాంగ్రెస్ మెజారిటీ ప్రభుత్వం ఏర్పడనే లేదు. యూపీఏ ప్రభుత్వాలకు సాంకేతిక నాయకత్వం వహించిన మన్మోహన్ సింగ్ కూడా గౌరవం పొందినంతగా జనాభిమానం పొందినవారు కాదు, అందుకు తగ్గ అధికార స్వేచ్ఛా ఆయనకు లేకపోయింది. కాంగ్రెస్‌కు తిరుగులేని రోజుల్లోనే ఆ పార్టీలో జనాకర్షక నేతలు వచ్చారు.

ప్రజారంజకత అనేది రాజకీయాల్లో ఒక జటిలమైన లక్షణం. ప్రజలు విపరీతంగా ప్రేమించడం వల్ల అధికారం అమితంగా పొందవచ్చు. అదే సమయంలో, అందుకు ప్రతిఫలంగా ప్రజలకు ఏదో ఒకటి చేస్తూ కూడా ఉండాలి. అట్లా చేయకపోయినా, అపకారం చేసినా, ప్రజలు ఆ తిరుగులేని అభిమానాన్ని వెనక్కి తీసుకుంటారు. ప్రజలకు అప్రియమైన లేదా కఠినమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు, ప్రజల్లో పెద్దగా చెలామణీ లేని నాయకుడు ఉండడమే రాజ్యానికి మంచిది. తనను జనం ప్రేమిస్తున్నారు కదా అని, ఆ ధీమాతో వారినే అణచివేయాలని చూసే నాయకులకు ఏమంత సానుకూలమైన ఫలితాలు లభించవు. ఇందిరాగాంధీ తన నినాదాల ద్వారా, తనను తాను ప్రదర్శించుకున్న తీరు ద్వారా, ఆ కాలంలో తీసుకోగలిగిన కొన్ని నిర్ణయాల ద్వారా, ప్రజలకు బాగా దగ్గరగా వెళ్లారు. తమ దాకా చేరిన ప్రతిసంక్షేమం మీదా ఇందిరపేరే ప్రజలకు వినిపించేది. ఇందిర అన్నీ మంచే చేయాలనుకుంటారని, మధ్యలో ఇతరులు దానిని భంగపరుస్తున్నారని జనం అనుకునేవారు. ఎమర్జెన్సీ అకృత్యాలకు గాను ఆమెను ఘోరంగా ఓడించినప్పటికీ, ఆమెతో మానసిక అనుబంధం మాత్రం జనంలో మిగిలే ఉండింది.

రాజీవ్ గాంధీ అట్లా కాదు. మొదట అతను రాజకీయాల మీద అనాసక్తుడు. తమ్ముడి అకాలమరణం వల్ల దిగక తప్పలేదు. ఇందిర హత్య కారణంగా, అనివార్య వారసుడయ్యాడు. నాలుగువందల పైచిలుకు స్థానాల విజయం ఇందిర మరణం వల్ల కలిగిన సానుభూతితోనే తప్ప, ఆయన స్వార్జితం కాదు. అంతటి బలం పునాదితో ప్రధాని అయిన వ్యక్తి, తనను తాను తల్లిలాగా బలపరచుకోవాలని, స్థిరపరచుకోవాలని అనుకోవడంలో తప్పులేదు. కానీ, రాజకీయంగా అనుభవం లేని రాజీవ్‌కు తప్పుడు మార్గదర్శనం లభించింది. పంజాబ్ కల్లోలాన్ని పరిష్కరించలేకపోయారు. దేశంలో అటానమీ ఉద్యమాల సమస్యలను ఎదుర్కొనలేకుండానే, పక్క దేశంలో వేర్పాటు ఉద్యమాలలో కల్పించుకున్నారు. దక్షిణాసియాలో పెద్దరికం చేయాలనుకున్నారు. ఇన్ని పెద్ద పెద్ద ప్రయత్నాల మధ్య పార్టీలో ప్రభుత్వంలో ఏమి జరుగుతున్నదీ తెలుసుకోలేకపోయారు. పెళ్లివల్ల ఏర్పడిన ఇటలీ అనుబంధంలో అవినీతి ఉన్నదన్న ఆరోపణలు వచ్చాయి. అంత గొప్ప మెజారిటీతో గెలిచిన నాయకుడు తరువాతి ఎన్నికలలో అధికారం కోల్పోయాడు. శ్రీలంక గొలుసుకట్టు ప్రభావాలు మరో రెండేళ్లకు ఆయన ప్రాణాలనే బలితీసుకున్నాయి. ఇందిర, రాజీవ్ ఈ దేశ ప్రజారంగంలో ఉంటూ, తమ విధానాలకోసం ప్రాణత్యాగం చేసిన మాట వాస్తవమే, అదే సమయంలో ఆ ఇద్దరి దురదృష్టకర మరణాల వెనుక అనేక విధాన వైఫల్యాలున్నాయి.

రాజీవ్ గాంధీ మరొక పార్శ్వం చూద్దాము. ఆయనకు ఇంకా జనం బ్రహ్మరథం పట్టక ముందే, ఇందిరాగాంధీ గొడుగు కింద పార్టీ పదవిలోను, ఎంపీగాను ఉన్న కాలంలోనే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అంజయ్యతో వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. అది ఎన్‌టి రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీకి ఒక ముఖ్య ప్రచారాస్త్రం అయింది. భావావేశాలు ముడిపడి ఉన్న ఒక నాయకురాలి కుమారుడు, తమ మనోభావాలను దెబ్బతీయడం తెలుగుప్రజలు ఇష్టపడలేదు. ఎన్టీయార్‌ను గద్దె దించిన పరిణామాలలో ఇందిరతో పాటు రాజీవ్ గాంధీ కూడా ఉన్నారు. ఇందిర దారుణ హత్యకు తెలుగు ప్రజలు గుండెలు పగిలి ఏడ్చారు కానీ, అనంతర ఎన్నికలలో కాంగ్రెస్‌కు, రాజీవ్ గాంధీకి ఓటు మాత్రం వేయలేదు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమ అనంతర ఎన్నికలు కావడం వల్ల, సానుభూతి ప్రభంజనం తెలుగు రాష్ట్రంలో వీచనే లేదు. 1989 లోక్‌సభ ఎన్నికలలో దేశమంతటా ఓడిపోయిన కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో ఘనవిజయం (42లో 39) సాధించడానికి కారణం రాజీవ్ గాంధీ జనాకర్షణ శక్తి మాత్రం కాదు, తెలుగుదేశం పాలనపై ఏర్పడిన విరక్తి, చెన్నారెడ్డి రూపంలో కాంగ్రెస్‌కు దొరికిన సమర్థమైన రాష్ట్ర నాయకత్వం. 1991లో సాధారణ ఎన్నికలు రాష్ట్రంలో రెండు దశలలో జరిగాయి. రాజీవ్ హత్యకు ముందు ఒకటి, ఆ తరువాత ఒకటి. సానుభూతి ప్రభావం ఉన్నది కానీ, ఆంధ్రప్రదేశ్‌లో దాని శక్తి మునుపటి ఎన్నికల స్థాయిని అందుకోలేకపోయింది. (1991లో గెలుచుకున్నది 42లో 25 మాత్రమే). రెండు సంవత్సరాల కాలంలోనే తెలుగుదేశం పార్టీ బాగా పుంజుకోగలిగింది (1989లో 2 స్థానాల నుంచి, 1991లో 11 స్థానాలకు). తెలంగాణ వరకే చూసుకున్నా, నాటి 15న్నర స్థానాలను మొత్తంగా 1989లో గెలుచుకోగా, 1991లో పది మాత్రమే నిలుపుకుంది. కోస్తాంధ్ర, రాయలసీమల కంటె మెరుగే. మొత్తం మీద రాజీవ్ గాంధీ తెలుగు రాష్ట్రం మీద వేసిన ప్రభావమూ తక్కువే, తెలుగు సమాజంతో ఆయనకు గాఢమైన అనుబంధం ఏర్పడడానికి కలిగిన అవకాశమూ తక్కువే.

గత మూడు నాలుగు దశాబ్దాలలో కాంగ్రెస్ తరఫున ప్రధానులుగా చేసినవారిలో జనరంజకులు ఎవరూ లేకపోయినా, రాష్ట్రాలలో కొందరు జనప్రియ నాయకులయ్యారు. అందులో ఒకరు రాజశేఖరరెడ్డి. తన హయాంలో నెహ్రూ, ఇందిర, రాజీవ్ గాంధీ పేర్లతో రాష్ట్రాన్నంతా నింపినప్పటికీ, తనకంటూ ఒక ప్రత్యేక ప్రతిష్ఠను, జనసంబంధాన్ని ఏర్పరచుకున్నారు. రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీ నాయకులకు మాత్రమే సాధ్యమయ్యే జనాకర్షణ ఆయనది. అట్లాగే, కర్ణాటకలో సిద్దరామయ్య సొంత ప్రతిష్ఠ కాంగ్రెస్ విజయానికి పనికివచ్చింది. రేవంత్‌రెడ్డి కూడా ఆ జనాకర్షక నాయకుల కోవలోకి చేరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన తన సొంత ఇమేజిని ప్రచారంలో పెట్టారు. రేవంత్‌కు ఏర్పడిన ప్రాచుర్యం వల్ల ముఖ్యమంత్రి ఎంపికలో అధిష్ఠానానికి వేరే దారే లేకుండా పోయింది. పాలనలో కూడా పార్టీలోని వివిధ బృందాలతో ఆయన ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మరో వైపు అధిష్ఠానాన్ని కూడా మంచిచేసుకుంటున్నారు. బహుశా, రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు కూడా ఆ 'మంచి' ప్రయత్నాలలో ఒకటి కావచ్చు! ఆ ప్రయత్నం హుందాగా జరిగితే రాజీవ్ స్మృతికి కూడా మరింత గౌరవం దక్కేది!

నిజానికి, రేవంత్‌రెడ్డి జనరంజక ప్రతిష్ఠ ఇంకా కౌమారదశలోనే ఉంది. ఘనవిజయాలను కూడా నిలుపుకోలేకపోయిన గత కాంగ్రెస్ నేతల కోవలోకి, తాను తొందరపాటుతో, ఆత్రుతతో జారిపోకుండా ఆయన జాగ్రత్తపడాలి. కానీ, ఆయన సలహాదారులెవరో కానీ, తెలంగాణ వాదంతో, సెంటిమెంట్‌తో తలపడడానికి, దానితో పోటీ పెట్టుకోవడానికి ఆయనను అనవసరంగా ప్రోత్సహిస్తున్నారు. కేసీఆర్‌ను, ఆయన పార్టీని ఎంతైనా విమర్శించవచ్చు, కానీ, తెలంగాణతనాన్ని వదులుకోగూడదు. ఒక విషయం గుర్తించాలి, ఈ రాష్ట్రం భౌగోళికంగా ఇట్లాగే ఉంటుంది, మరెప్పుడూ 2014కు ముందు రూపానికి వెళ్లదు. తెలంగాణ ఉద్యమం, దాని చిహ్నాలు, దాని నినాదాలు అన్నీ బీఆర్ఎస్ సొత్తూ కాదూ, కేసీఆర్ సొంత ఆస్తీకాదు. మొదట తెలంగాణ గీతం, చిహ్నం మొదలైన అంశాల మీద వివాదానికి ఆస్కారమిచ్చిన ముఖ్యమంత్రి, ఆ తరువాత తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో తగవుకు చోటిచ్చారు. ఇవన్నీ భావోద్వేగాలకు, మనోభావాలకు సంబంధించిన సున్నితమైన విషయాలు! తెలంగాణ తల్లితో ముడిపడిన భావావేశాలకు, ఎంత గొప్ప జాతీయనేత అయినప్పటికీ రాజీవ్ గాంధీ పోటీకాగలరా? రాజీవ్ గాంధీని ఆకాశమెత్తున గౌరవించుకోవడానికి మహానగరంలో మరెన్ని చోట్లు లేవు? సచివాలయం ప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహం పెట్టాలనుకోవడం కొంత గౌరవమే, ఇన్నేళ్లుగా తెలంగాణ తల్లిని కేసీఆర్ తన పార్టీ ఆఫీసుకే పరిమితం చేయడం నేరమే. అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం కలిగిస్తున్న కొరత పెద్దది కదా? ఒకనాటి తెలుగుతల్లి కూడలి, రాష్ట్ర విభజన తరువాత, తెలంగాణ తల్లి కూడలిగా ఉండడమే న్యాయం కదా?

పార్టీ పేరు నుంచి కూడా తెలంగాణను తొలగించిన బీఆర్ఎస్, ఇప్పుడు మనుగడ కోసం, తీవ్రమైన ప్రాంతీయ భాష మాట్లాడవలసి వస్తున్నది. ప్రజల మానసిక సున్నితత్వాలను దృష్టిలో పెట్టుకోకుండా, మొరటుగా వ్యవహరిస్తే, చేజేతులా ఆయుధాన్ని ప్రత్యర్థికి అందించినట్టే అవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ తెలుసుకోవాలి. రాహుల్ గాంధీ చుట్టూ ఆరోగ్యకరమైన, కొత్త భావోద్వేగాలు రూపొందాలని కోరుకుందాం. కానీ, ఒక చారిత్రక వాస్తవికతను కూడా గుర్తించాలి. తెలుగు రాష్ట్రాలలో, మొత్తంమీద దక్షిణాదిన ప్రాంతీయత కలిగించే మానసికానుబంధం, జాతీయస్థాయి రాజకీయం వల్ల ఎంత మాత్రం ఏర్పడదు. తెలంగాణలో సోనియాగాంధీకి లభించే గొప్ప గుర్తింపు కూడా, రాష్ట్రావతరణను సాధ్యం చేసిన నేతగానే! రాజీవ్ గాంధీకి లభించే స్మరణ కూడా తెలంగాణ "ఇచ్చిన" సోనియా భర్తగానే!

ఘనవిజయాలను కూడా నిలుపుకోలేకపోయిన గత కాంగ్రెస్ నేతల కోవలోకి, తాను తొందరపాటుతో, ఆత్రుతతో జారిపోకుండా రేవంత్‌రెడ్డి జాగ్రత్తపడాలి. కానీ, ఆయన సలహాదారులెవరో కానీ, తెలంగాణ వాదంతో, సెంటిమెంట్‌తో తలపడడానికి, దానితో పోటీ పెట్టుకోవడానికి ఆయనను అనవసరంగా ప్రోత్సహిస్తున్నారు. కేసీఆర్‌ను, ఆయన పార్టీని ఎంతైనా విమర్శించవచ్చు, కానీ, తెలంగాణతనాన్ని వదులుకోగూడదు. ఒక విషయం గుర్తించాలి, ఈ రాష్ట్రం భౌగోళికంగా ఇట్లాగే ఉంటుంది, మరెప్పుడూ 2014కు ముందు రూపానికి వెళ్లదు. తెలంగాణ ఉద్యమం, దాని చిహ్నాలు, దాని నినాదాలు అన్నీ బీఆర్ఎస్ సొత్తూ కాదూ, కేసీఆర్ సొంత ఆస్తీకాదు. మొదట తెలంగాణ గీతం, చిహ్నం మొదలైన అంశాల మీద వివాదానికి ఆస్కారమిచ్చిన ముఖ్యమంత్రి, ఆ తరువాత తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో తగవుకు చోటిచ్చారు. ఒకనాటి తెలుగుతల్లి కూడలి, రాష్ట్ర విభజన తరువాత, తెలంగాణ తల్లి కూడలిగా ఉండడమే న్యాయం కదా?

తెలుగు రాష్ట్రాలలో, మొత్తంమీద దక్షిణాదిన ప్రాంతీయత కలిగించే మానసికానుబంధం, జాతీయస్థాయి రాజకీయం వల్ల ఎంతమాత్రం ఏర్పడదు. తెలంగాణలో సోనియాగాంధీకి లభించే గొప్ప గుర్తింపు కూడా, రాష్ట్రావతరణను సాధ్యం చేసిన నేతగానే! రాజీవ్ గాంధీకి లభించే స్మరణ కూడా తెలంగాణ "ఇచ్చిన" సోనియా భర్తగానే!

ప్రాజెక్టులపై ఉత్తరాంధ్రలో కోటి ఆశలు

గత ముఖ్యమంత్రి ఐదేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టులపై కనీసం దృష్టి పెట్టలేదు. దీని వల్ల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అన్యాయం జరిగింది. అతి తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు లబ్ధి చేకూర్చగలిగే ప్రాజెక్టులున్న ఉత్తరాంధ్ర జిల్లాలకు మరింత పెద్ద దెబ్బే తగిలింది. పెండింగ్ ప్రాజెక్టుల మాట అటుంచితే, ఇప్పటికీ పలు ప్రాజెక్టుల పరిధిలో కాలువల ఆధునీకరణ, మరమ్మతు పనులు కూడా చేయలేదు. కాలువల్లో పూడికతీత, లైనింగ్ వంటివి కూడా జరగలేదు. కొన్ని ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ ఇంకా సశేషంగా ఉంది. 2019కి ముందే శ్రీకాకుళం జిల్లాలోని వంశధార, నాగావళి నదులను అనుసంధానించే ప్రాజెక్టు పనులు సుమారు 60 శాతం పూర్తయినా, మిగిలిన 40 శాతం పనులను పూర్తిచేసే ఉద్దేశం జగన్‌కి లేకపోయింది. అదేవిధంగా నాగావళిపై నిర్మితమైన నారాయణపురం ఆనకట్ట వరకూ సుమారు 30 కిలోమీటర్ల కాలువ తవ్వకపోవడం వల్ల హిరమండలం జలాశయంతో అనుసంధానం కూడా మూలన చేరింది. ఇప్పటికే అనుమతులు పొందిన వంశధార నేరడి బ్యారేజీ నిర్మాణం విషయంలో ఒడిషాతో ఉన్న ముంపు వివాదంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కూడా జగన్‌కి వీలుకాలేదు. గొట్టా బ్యారేజీ నుంచి ఎత్తిపోతల ద్వారా హిరమండలం జలాశయానికి వంశధార నీటిని తరలిస్తామని చేసిన ప్రకటన కూడా అమలుకాలేదు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని నాగావళి నదిపై 2.51 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన తోటపల్లి ప్రాజెక్టు పనులు చివరి దశలో పడకేశాయి. 2003 నవంబరులో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2014 వరకూ కుడి ప్రధాన కాలువ పనులు జరిగినా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పిల్లకాలువ నిర్మాణాలను పట్టించుకోలేదు. గడచిన ఐదేళ్లలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి కూడా పనుల పురోగతిపై ఒక్కసారైనా సమీక్ష జరపలేదు. దీంతో నేటికీ పిల్లకాలువల తవ్వకం, పూడికతీత పనులు కూడా ఎక్కడివక్కడే ఉన్నాయి. అలాగే, నాగావళి ఉపనది జంఝావతిపై నిర్మించిన రబ్బర్ డ్యాంలో ప్రాజెక్టు పరిధిలో నేటికీ భూసేకరణ, కాలువ మరమ్మతులు పూర్తి కాలేదు. ఇక, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఏ స్థాయిలో ఉందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించడం వల్ల సుజల స్రవంతి ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సుమారు 7.11 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఉత్తరాంధ్ర ప్రజల ఆకలి దప్పులు తీరాలంటే ఈ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న పెండింగ్ పనుల్లో కదలిక రావాలి. అదేవిధంగా విజయనగరం జిల్లాలో 181 కోట్ల రూపాయలతో నిర్మించతలపెట్టిన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు గత 18 సంవత్సరాలుగా ముందుకు కదలలేదు. ఉత్తరాంధ్రలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగు నీరందించాల్సిన ప్రాజెక్టులన్నీ బేలచూపులు చూస్తున్నాయి. కొత్త ప్రాజెక్టుల సంగతి దేవుడెరుగు, కనీసం పాత పథకాలైనా పూర్తయితే ఉత్తరాంధ్రుల జీవన పరిస్థితుల్లో కొంతైనా మార్పు వస్తుంది. సాగునీరు, తాగునీటి పథకాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న తమ ఆకాంక్షలు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిచ్చి పాలన సాగించగల ముఖ్యమంత్రి చంద్రబాబు వల్ల నెరవేరుతాయని ఇక్కడి ప్రజలు ఆశపడుతున్నారు.


– డొంకాడ గోపాల్

చిన్నతరహా సాగునీటి వ్యవస్థతోనే జలసిరి

భారతదేశంలోని చెరువులు, కుంటలు, సరస్సులు, రిజర్వాయర్ల సమగ్ర సమాచారంతో కూడిన నీటివనరుల గణన నివేదికను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ గత ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసింది. భారతదేశంలో సరస్సులు, చెరువులు, కుంటలు తదితర జలాశయాలు 24 లక్షల 24 వేల వరకూ ఉన్నాయని తొలిసారి జరిపిన సర్వేలో తేలింది. ఈ సర్వే ప్రకారం మొత్తం నీటివనరుల సంఖ్యలో ప్రథమ స్థానంలో (7లక్షల 47 వేలు) పశ్చిమ బెంగాల్ ఉన్నది. దేశంలో అత్యధిక చెరువులు ఆంధ్రప్రదేశ్‌లో, అత్యధిక సరస్సులు తమిళనాడులో ఉన్నాయని ఈ సర్వే చెబుతోంది. అలాగే జలసంరక్షణ పథకాలలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉంది. సుమారు 1,60,205 కి.మీ విస్తీర్ణం, ఐదు కోట్ల పాతిక లక్షలకు పైగా జనాభా కలిగివున్న సముద్రతీర రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో అనేక జీవనదులు, వాగులు, వంకలు ఉండి, తగినంత వర్షపాతం ఉండడం వల్ల నీటి లభ్యతకు కొదవలేదు. 1,90,777 సరస్సులు, చెరువులు, కుంటలు, రిజర్వాయర్లతో ఏపీ దేశంలోనే జలవనరుల విషయంలో మూడో స్థానంలో ఉందని పై సర్వే తెలిపింది. ఈ జలవనరులు ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో 99.7 శాతం (1,90,263), పట్టణ ప్రాంతాల్లో కేవలం 0.3 శాతం (514) ఉన్నాయి. వీటిలో 78.2 శాతం మాత్రమే వినియోగంలో ఉండగా, మిగిలిన 21.8 శాతం నీటి నిల్వ వ్యవస్థల్లో నీరు లేకపోవడం లేదా మరమ్మతులు చేయడానికి వీలులేని స్థితి, ఇంకా ఇతర సమస్యల వల్ల నిరుపయోగంగా మారాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఆసక్తికరమైన విషయం నీటి నిల్వ వ్యవస్థల్లో అత్యధికం చెరువులు(38,445), వాటి తర్వాత అధిక సంఖ్యలో ఉన్నవి నీటి సంరక్షణ పథకాల ద్వారా ఏర్పాటు చేసిన నీటి వనరులు, పెర్కొలేషన్ ట్యాంకులు, చెక్‌డ్యామ్‌లు. రాష్ట్రంలో చెరువుల నీటినిల్వ సామర్థ్యం 206.22 టీఎంసీలు కాగా, ఈ చెరువుల కింద సాగయ్యే ఆయకట్టు 26.60 లక్షల ఎకరాలు. అయితే ఒకవైపు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసినా, ఈ చెరువుల్లో 76.54 టీఎంసీల నీళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మొత్తం చెరువుల నీటినిల్వ సామర్థ్యంలో ఇది 37.12 శాతం మాత్రమే. మరోవైపు ప్రతి ఏటా కృష్ణా, గోదావరి, పెన్నా నదుల పరిధిలో మూడువేల టీఎంసీలకు పైగా విలువైన జలాలు సముద్రంలో కలసిపోతున్నాయి.

ఈ నేపథ్యంలోనే వృథా జలాలను ఒడిసిపట్టడం ద్వారా రాష్ట్రంలో సాగునీటి సమస్యను అధిగమించడంతో పాటు ఆయకట్టు చివరిలోని రైతులకు కూడా పుష్కలంగా నీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను రూపొందిస్తోంది. ఎగువ రాష్ట్రాల నుంచి భారీ వరద వచ్చినప్పుడు కృష్ణ, గోదావరి నదుల పరిధిలో ప్రధాన జలాశయాల నుంచి ప్రస్తుత సీజన్‌లో దిగువకు విడుదల చేసిన వందలాది టీఎంసీలు సముద్రంలో కలిసిపోయాయి. అదే సందర్భంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం తదితర జిల్లాల్లోని అత్యధిక చెరువులు అడుగంటిపోయాయి. ఈ పరిస్థితులలో వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కొంతమేరకు రాష్ట్రంలోని చెరువులు, తదితర నీటి వనరులకు మళ్లించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి కొరతను అధిగమించడంతో పాటు, సాగుకు కూడా సకాలంలో నీరు ఇవ్వవచ్చనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిన్న తరహా సాగునీటి వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి పెట్టారు.



నీటి కొరతను అధిగమించేందుకు నదుల అనుసంధాన కార్యక్రమం కంటే ముందుగా చెరువుల అనుసంధాన ప్రక్రియను చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 భారీ, మధ్య తరహా ప్రాజెక్టులలో 1400 టీఎంసిలకు పైగా నీటిని నిల్వ చేస్తున్నారు. వీటి నుంచి సాగు, తాగునీటి సరఫరాకు ప్రత్యేకంగా కాలువల వ్యవస్థ ఉంది. ప్రధాన కాలువలకు 5 నుంచి 10 కి.మీ దూరంలో ఉన్న చెరువులను గుర్తించి, అక్కడి వరకు పిల్లకాలువలు తవ్వి గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించి అన్ని జిల్లాల్లోని మంచినీటి చెరువులను సమీపంలోని నదులు, రిజర్వాయర్ల జలాలతో నింపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రచిస్తోంది.

నీటి కొరతను అధిగమించేందుకు నదుల అనుసంధాన కార్యక్రమం కంటే ముందుగా చెరువుల అనుసంధాన ప్రక్రియను చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 భారీ, మధ్య తరహా ప్రాజెక్టులలో 1400 టీఎంసిలకు పైగా నీటిని నిల్వ చేస్తున్నారు. వీటి నుంచి సాగు, తాగునీటి సరఫరాకు ప్రత్యేకంగా కాలువల వ్యవస్థ ఉంది. ప్రధాన కాలువలకు 5 నుంచి 10 కి.మీ దూరంలో ఉన్న చెరువులను గుర్తించి, అక్కడి వరకు పిల్ల కాలువలు తవ్వి గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించి అన్ని జిల్లాల్లోని మంచినీటి చెరువులను సమీపంలోని నదులు, రిజర్వాయర్ల జలాలతో నింపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రచిస్తోంది. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రాజెక్టుల నుంచి కొత్తగా కాలువలను తవ్వాలని, అవసరమైన చోట కాలువలను ఆధునీకరించాలని, ప్రధాన చెరువుల నుంచి చిన్న చెరువులను కలుపుతూ అవసరమైన చోట్ల కాలువ తవ్వకాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదే విధంగా నదుల అనుసంధాన ప్రక్రియను చేపట్టాలనే కృతనిశ్చయంతో ఉన్న చంద్రబాబు, తాజాగా ఆయా నదుల పరివాహక ప్రాంతాల్లో అనుకూల ప్రదేశాల్లో తక్కువ వ్యయంతో ఎక్కువ మంది రైతులకు, గ్రామాలకు లాభం చేకూర్చేలా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించాలని భావిస్తున్నారు. వరదలు వచ్చిన సందర్భంలో వీలైనంతవరకు ఆ నీటిని ఆయా రిజర్వాయర్లకు మళ్లించడం ద్వారా వరద ముప్పును తగ్గించడంతో పాటుగా, వృథా జలాలను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరుల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నీటి వనరుల పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించడమే కాకుండా, చెరువుల పూడిక తీయడం, కాలువలను ఆధునీకరించడం ద్వారా వాటి సామర్థ్యాన్ని పెంచాలి. జలాశయాల రక్షణకు తమిళనాడు ప్రభుత్వంలా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించి జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులను జలవనరుల శాఖ, రెవెన్యూ, స్థానిక సంస్థలతో పాటు, కాలుష్య నియంత్రణ మండలి, ఐటి శాఖల సహాయంతో ఉపగ్రహ సాంకేతికత ఆధారంగా మ్యాపింగ్ చేసి సరిహద్దులు నిర్ణయించాలి. ఒకసారి హద్దులు నిర్ణయించి ఆమోదం పొందాక, ఆ పరిసరాల్లో ఎవరు ఆక్రమణలకు ప్రయత్నించినా ఉపగ్రహ సాంకేతికత, ఇతర సెన్సర్లతో వెంటనే వివిధ శాఖలను అప్రమత్తం చేసేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించి జలవనరులకు రక్షణ కల్పించాలి. తక్కువ సమయంలో, పరిమిత వ్యయంతో నీటి సంక్షోభం అధిగమించేందుకు చిన్న తరహా సాగునీటి వ్యవస్థ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్ణయించడం ఖచ్చితంగా రాష్ట్ర ప్రయోజనాలకు తోడ్పడుతుంది.

■ లింగమనేని శివరామప్రసాద్





జలవనరుల శాఖలో ఇంజనీర్లు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. ప్రతి ఏడాదీ వేసవిలో ఉండే ఈ అవతారం ఈసారి మాత్రం వరదల పుణ్యమా అని ముందుగానే పోషిస్తున్నారు. టెండర్ల ద్వారా పనులు కేటాయించాల్సిన విధానానికి స్వస్తి పలికి నామినేషన్ పర్వానికి తెరదీస్తున్నారు. తద్వారా తమకు బినామీలుగా ఉన్న కాంట్రాక్టర్లను తెరపైకి తెచ్చి వారికే పనులు కేటాయించాలని సిఫార్సులు చేస్తున్నారు.

ఇంజనీర్లే కాంట్రాక్టర్లు

జలవనరుల శాఖలో జలగలు

ఎఫ్‌డీఆర్ పనులకు సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

- టెండర్లకు స్వస్తి పలికే యోచనలో డీఈలు
- రెండు సబ్ డివిజన్లలో జోరుగా పైరవీలు
- తెరపైకి బినామీ కాంట్రాక్టర్లు
- నామినేషన్‌పై పనులు ఇవ్వాలని సిఫార్సులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఈనెలలో ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. బుడమేరకు భారీస్థాయిలో వరద వచ్చింది. దీంతో అన్ని కాల్వలు నిండుగా ప్రవహించాయి. వరద దాటికి కొన్ని ప్రాంతాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో కాల్వలకు గండ్లు పడ్డాయి. ఫలితంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో కాల్వల కరకట్టకు భారీగానే నష్టం వాటిల్లింది. వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పూడ్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వరదల వల్ల జరిగిన నష్టం లెక్కలను, వాటిని సరిచేయడానికి అయ్యే అంచనాలను రూపొందించాలని ఆదేశించింది. దీంతో జలవనరుల శాఖ అధికారులు కట్టలకు జరిగిన నష్టాలు, పలుచోట్ల పడిన గండ్లకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేశారు. ఫ్లడ్ డ్యామేజీ రిలీఫ్ పనులకు అంచనాలు రూపొందిస్తున్నారు.

ఆ రెండు డివిజన్లలో బినామీ బాగోతం

గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో దోసపాడు ఛానల్ ఉంది. ఇది కోమటిగుంట లాకుల నుంచి నందివాడ మండలం కుదరవల్లి వద్ద కొల్లేరులో కలుస్తుంది. ఇందులోనే జొన్నపాడు సెక్షన్ ఉంది. ఇది వెంట్రపాడు రెగ్యులేటర్ దాటిన తర్వాత 21వ కిలోమీటరు నుంచి 35వ కిలోమీటరు వరకు కాళింగపేట వద్ద బుడమేరులో కలుస్తుంది. జొన్నపాడు సెక్షన్ పరిధిలో కట్టలకు గండ్లు పడ్డాయి. వాటిని స్థానికంగా ఉండే రైతులు పూడ్చేసుకున్నారు.

(మిగతా 6లో)

ప్రైవేటు చేతిలో వీఎంసీ స్టేడియాలు

విజయవాడ నగరంలో ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన స్టేడియాల్లో ప్రైవేటు వ్యక్తులు తిష్ట వేశారు. నగరంలోని దండమూడి రాజగోపాలరావు స్టేడియం, చెన్నుపాటి రామకోటయ్య స్టేడియం వీఎంసీ ఆధ్వర్యంలో ఉన్నాయి. వీటిని సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి చేశారు. కానీ నిర్వహణ చేయాల్సిన వీఎంసీ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కయి వాటిని వారికి అప్పగించేశారు. దీంతో వీఎంసీ రావాల్సిన ఆదాయం పోవడంతోపాటు ఔత్సాహిక క్రీడాకారులు ఆడుకోవాలన్నా పైసలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



దండమూడి రాజగోపాలరావు స్టేడియం

చెన్నుపాటి రామకోటయ్య స్టేడియం

శిక్షణ పేరుతో భారీగా ఫీజుల బాదుడు

- డీఆర్ఆర్, రామకోటయ్య స్టేడియాల్లో ప్రైవేటు వ్యక్తుల పాగా
- రూ.10 కోట్లతో స్టేడియాలను ఆధునికీకరించిన కార్పొరేషన్
- కోట్లు ఖర్చు పెట్టి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై విమర్శలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/భవానీపురం) : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అనుచరుడిగా పేరొందిన ఒక వ్యక్తి అసోసియేషన్ పదవితో వీఎంసీ పర్యవేక్షణలోని దండమూడి రాజగోపాలరావు స్టేడియంలో తిష్ట వేశారు. స్టేడియానికి బ్యాడ్మింటన్ ప్రాక్టీస్ చేసేందుకు వచ్చే క్రీడాకారుల నుంచి ఈయన అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వీఎంసీకి బ్యాడ్మింటన్ కోచ్‌ల లేకపోవడాన్ని సాకుగా చూపుతూ ప్రైవేటు కోచ్‌లను ఏర్పాటు చేసి డబ్బులు వసూళ్లు సాగిస్తున్నారు. ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు ఫిట్నెస్ శిక్షణ, సాయంత్రం 4.30 గంటల నుంచి 8 గంటల వరకు రెండు బ్యాచ్‌లకు కోచ్‌లు శిక్షణ ఇస్తారు. శిక్షణకు ఒక్కో క్రీడాకారుడి నుంచి రూ.1000 డిపాజిట్‌గా, ప్రతినెలా రూ.500 ఫీజు వసూలు చేయాలన్నది నిబంధన. అయితే క్రీడాకారుల నుంచి ఫీజుగా రూ.2500 నుంచి రూ.3000 వరకు నెలనెలా వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. అంత ఫీజు కట్టలేకనే ప్రభుత్వ స్టేడియాలకు వస్తుంటే ఇక్కడా వేలకువేలు ఫీజు వసూలు చేయడం ఏమిటని క్రీడాకారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్టేడియంలో అసోసియేషన్‌కు ఒక్క రూమ్ కేటాయించగా మిగిలిన రూములను వారు తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. స్టేడియంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపైనా క్రీడాకారుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహిళా క్రీడాకారిణులు ఆడుతుంటారని, అలాంటి చోట్ల సీసీ కెమెరాలు ఎలా పెడతారని వారు ప్రశ్నిస్తున్నారు. ఏమైనా ప్రశ్నిస్తే.. బడా బడా ఐఏఎస్‌లతో పరిచయాలున్నాయని చెబుతూ సదరు ప్రైవేటు వ్యక్తులు వీఎంసీ సిబ్బందిని కూడా బెదిరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రామకోటయ్య స్టేడియంలోనూ అదే దందా..

టీడీపీ హయాంలో రూ.8 కోట్ల వ్యయంతో పటమటలో నిర్మించిన చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలోనూ ప్రైవేట్ వ్యక్తులు పాగా వేశారు. శాప్‌లోని ఓ కోచ్ ఇక్కడ చక్రం తిప్పి ఏడాదిన్నర నుంచి వసూళ్ల దందా నడిపిస్తున్నారు. శిక్షణ పేరుతో ఒక్కొక్క క్రీడాకారుడి నుంచి రూ.2500 నుంచి రూ.10వేల పైబడే వసూలు చేస్తున్నారు. నామినల్ ఫీజుల మాత్రం వీఎంసీకి జమ అవుతున్నాయి. అతనికి శాప్ ఇచ్చే జీతం రూ.20వేల పై మాటే. దాంతోపాటు పటమట స్టేడియం నుంచీ నెలనెలా లక్షల్లోనే ఆర్జిస్తున్నట్లు సమాచారం. కోట్ల వ్యయంతో వీఎంసీ నిర్మించిన స్టేడియాల్లో ప్రవేట్ వ్యక్తుల జోక్యాన్ని నివారించి సొంతంగా కోచ్‌లను ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలకు శిక్షణ ఇప్పించడంపై వీఎంసీ కమిషనర్ దృష్టి సారించాల్సి ఉంది.

మరమ్మతులు చేసినా కారుతున్న స్టేడియం

దండమూడి రాజగోపాలరావు స్టేడియానికి వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు మరమ్మతుల పేరిట రూ.కోట్లలో వ్యయం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పై రూఫ్ నుంచి కారుతుండటంతో క్రీడాకారులకు ఆడుకోవడం ఇబ్బందిగా మారింది.

శిక్షణ బాగానే ఉంది... ఫీజులే ఎక్కువ

నా కుమారుడ్ని ఇక్కడ సంవత్సరం క్రితం చేర్పించాను. డిపాజిట్ కింద రూ.1000, ప్రతినెలా రూ.500 ఫీజుగా కార్పొరేషన్‌కు జమ చేయిస్తున్నారు. ఆ తర్వాత రూ.2500 దండమూడి రాజగోపాలరావు స్టేడియంలో కడుతున్నా. శిక్షణ బాగుంది. కానీ ఫీజులే ఎక్కువగా ఉన్నాయి.

- పోలిరెడ్డి, కృష్ణలంక



కోలాహలంగా గిరిప్రదక్షిణ

బాద్రపద శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారి గిరిప్రదక్షిణ బుధవారం కోలాహలంగా సాగింది. అమ్మవారి ఉత్సవ మూర్తులను తొలుత కొండపై నుంచి మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద వరకు తీసుకువచ్చారు. అక్కడ పూజలు నిర్వహించి హారతులు సమర్పించారు. తప్పెట వాయిద్యగాళ్లు, సన్నాయి మేళగాళ్లు, కోలాట బృందాల విన్యాసాలతో గిరిప్రదక్షిణ ముందుకు సాగింది. కుమ్మరిపాలెం సెంటర్, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్‌ల మీదుగా తిరిగి అమ్మవారి వాహనం కొండపైకి చేరుకుంది. - వన్‌టౌన్



కొనసాగుతున్న బోట్ల ఆపరేషన్


రెండో బోటు దిశను మార్చేందుకు కృషి

విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. బ్యారేజీ వద్ద ఉన్న మూడు బోట్లలో ఒక దాన్ని కావడి విధానంలో పున్నమి ఘాట్ వద్దకు చేర్చిన విషయం తెలిసిందే. బ్యారేజీ పిల్లర్‌ను అంటిపెట్టుకుని ఉన్న రెండో బోటును తొలగించే పనులను ఇంజనీరింగ్ బృందం బుధవారం మొదలుపెట్టింది. మొదటి బోటు మాదిరిగానే ఈ బోటుకు ఇనుప రోప్‌లు అమర్చి, మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద నుంచి భారీ క్రేన్ ద్వారా లాగుతున్నారు. ఇనుప గడ్డర్లు ఉన్న బోట్లకు లాక్ చేసే విధంగా ఇనుప రోప్‌లు కట్టడానికి రంధ్రాలు చేస్తున్నారు. ఒక వైపున ఆరు రంధ్రాలు, మరో వైపున ఆరు రంధ్రాలు చేశారు. బ్యారేజీ గేటుకు అడ్డంగా ఉన్న ఈ బోటు దిశను ముందుగా మార్చాలని ఇంజనీరింగ్ బృందం నిర్ణయించింది. పున్నమిఘాట్ వైపునకు వెళ్లేలా బోటును నిలబట్టే క్రమంలో లాగుతుండగా అది నీటిలో మునిగిపోయింది. సరిగ్గా ఈ బోటు ఇప్పుడు అప్పర్ వెప్రాన్‌పై ఉంది. దీంతోపాటు ఇక్కడ జడ్డీ స్టోన్స్ (పెద్దపెద్ద బండరాళ్లు) ఉంటాయి. ఇక్కడి నుంచి ఇసుక ప్రదేశంలో రావడానికి మొదటి బోటుకు పది రోజుల సమయం పట్టింది. ప్రస్తుతం నీటిలో మునిగిన బోటుకూ ఇదే సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత దీనికి కావడి సూత్రాన్ని ఉపయోగిస్తారు. బోటు నిండా నీళ్లు ఉన్నందున మొత్తం నాలుగు బోట్లతో ఈ బోటును బయటకు తీసుకువస్తారని తెలుస్తోంది.

పన్ను వసూళ్లు వాయిదా

వరద బాధిత ప్రాంతాల సౌలభ్యం కోసం..

వన్‌టౌన్, సెప్టెంబరు 18 : విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న కారణంగా పన్నుల వసూళ్లను మూడు నెలల పాటు వాయిదా వేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ఆర్థిక స్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సూచనలతో పన్నుల వసూలు వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. 1, 5, 7, 15 నుంచి 22 వరకు, 30, 32, 40 నుంచి 47 వరకు, 54 నుంచి 64 వరకు మొత్తం 32 డివిజన్లలో వచ్చే మూడు నెలల వరకు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఇతర పన్నుల వసూళ్లను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు తెలిపారు.



బుడమేరు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ శాటిలైట్ చిత్రం

బుడమేరుపై గురి!

ఆక్రమణల సంగతి తేల్చే పనిలో అధికారులు

బెజవాడ వాసులను బెంబేలెత్తించిన బుడమేరు ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. అసలు బుడమేరు విస్తీర్ణం ఎంత? ఏయే సర్వే నంబర్లలో విస్తరించి ఉంది? అనే వివరాలను సేకరిస్తోంది. ప్రత్యేక సర్వే ద్వారా ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులను బుడమేరుకు సంబంధించిన సమగ్ర వివరాలు సమర్పించాలని కలెక్టర్ సృజన బుధవారం ఆదేశించారు.

- (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

- సమగ్ర వివరాలు కోరిన కలెక్టర్
- రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులకు బాధ్యతల అప్పగింత
- ఆక్రమణల తొలగింపునకు సర్వే
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ దాటి మరీ ఆక్రమణలు
- చాలా వరకు కాలనీలుగా విస్తరింపు

ప్రభుత్వ పరిశీలన తర్వాత యాక్షన్

బుడమేరు పరీవాహక ప్రాంత సర్వే నెంబర్ల వారీగా బుడమేరు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) దాని బఫర్ జోన్ (బీజెడ్)లను నిర్ధయిస్తారు. అంతిమంగా ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. ఆక్రమణలకు సంబంధించి ప్రభుత్వ పరిశీలన అనంతరం అధికారులు రంగంలోకి దిగుతారు. బుడమేరు ఆక్రమణలకు ఎలా గురైందో 2009లోనే అప్పటి మునిసిల్ కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న నేతృత్వంలో అధ్యయనం చేశారు. 2011లో ఎఫ్‌టీఎల్, దాని బఫర్ జోన్‌లలో ఆక్రమణలు ఏ విధంగా చొచ్చుకు వచ్చాయో విజయవాడ విపత్తు ప్రణాళిక - 2011లో పొందుపరిచారు. అప్పట్లోనే శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఆక్రమణలను నిగ్గు తేల్చారు.

బుడమేరు చరిత్రలోనే తొలిసారి

చరిత్రలో చవిచూడని విధంగా ఈ ఏడాది 40 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో దిగువకు ఏకంగా 35 వేల క్యూసెక్కులను విడుదల చేయాల్సి రావడంతో 32 డివిజన్లు ముంపునకు గురయ్యాయి. విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, గన్నవరం మండలాలు కూడా బుడమేరు వరద ముంపును ఎదుర్కొన్నాయి. బుడమేరుకు వచ్చే వరదను వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ ద్వారా కృష్ణానదికి మళ్లించటం వల్ల ఇన్నాళ్లు వరదను చూడలేదు. ఇటీవల బుడమేరు ఫుల్ ట్యాంక్ లెవల్ దాటి దాని బఫర్ జోన్‌లోకి వరద భారీగా పోటెత్తింది. ఎఫ్‌టీఎల్, దాని బఫర్ జోన్ పరిధిలో ఆక్రమణల వల్ల వరద అనేక దిశలను మార్చుకుని విజయవాడలో సగం ప్రాంతాన్ని ముంచెత్తింది.

ఆక్రమణలు ఇలా



బుడమేరు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఆక్రమణల శాటిలైట్ చిత్రం

బుడమేరు బఫర్ జోన్ (బీజెడ్) పరిధిలోకి 2011లోనే కండ్రిక, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, పీఅండ్‌టీ కాలనీ, ఇందిరానాయక్ కాలనీ, విజయదుర్గ నగర్, అయోధ్య నగర్ కొంత భాగం, పాత రాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేట, సింగ్‌నగర్ ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ చాలా వరకు 2011 నాటికే బలమైన కాలనీలుగా ఏర్పడ్డాయి. అప్పట్లో కార్పొరేషన్ నేతృత్వంలోనే ఆయా కాలనీలకు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించడంతో క్రమంగా అవి మరింత విస్తరించాయి. బుడమేరు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి కూడా వచ్చాయి. ఆక్రమణలను తొలగించాలంటే కాలనీలకు కాలనీలే కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఇలాంటి సందర్భంలో బుడమేరు కాల్వ సరిహద్దులను నిర్ధయించి కృష్ణావాల్ మాదిరిగా రెండు వైపులా రిటెయినింగ్ వాల్స్ నిర్మించాలన్న సూచనలు కూడా వస్తున్నాయి. ఎనికేపాడు దగ్గర యూటీని తొలగించి దాని స్థానంలో బాక్స్ కల్వర్టును ఏర్పాటు చేస్తే నగరానికి ఇబ్బందిలేకుండా కొల్లేటిలోకి బుడమేరు వెళ్లిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమం ఉధృతం

2, 3, 4 తేదీల్లో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు.. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక

ధర్నాచౌక్: ఎన్నో ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక నేతలు పిలుపునిచ్చారు. ఈ పరిశ్రమను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడే బాధ్యత టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వేదిక నేతలు మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి గతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులను వీఆర్ఎస్‌ల పేరుతో తొలగించేందుకు యాజమాన్యం పూనుకుంటుందన్నారు. బొగ్గును కూడా సరఫరా చేయడం లేదని విమర్శించారు. అఖిలపక్షాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చించేందుకు తీసుకువెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి తలమానికమైన విశాఖ ప్లాంట్‌ను రక్షించుకునేందుకు అక్టోబరు 2, 3, 4 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరహారదీక్షలు, రిలేదీక్షలు చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, విద్యాలయాల్లో సెమినార్లు, చర్చాగోష్టిలు, సదస్సులు నిర్వహించి విద్యార్థులకు ఉక్కు పరిరక్షణపై అవగాహన కల్పించాలని తీర్మానించామన్నారు. వేదిక కన్వీనర్లు వి.ఉమామహేశ్వరరావు, జి.ఓబులేసు, నర్సింగరావు, కె.పోలారి, టీఎస్‌టీయూసీ నేత ఆర్.శ్యామ్, రైతు సంఘం నేతలు కొల్లా రాజమోహన్, ఎం.కృష్ణయ్య, ఎం.హరిబాబు, వెలగపూడి అజాద్, మరీదు ప్రసాద్ పాల్గొన్నారు.

వరద బాధిత రైతుల కౌలు రద్దు చేయాలి

భవానీపురం: వరదల్లో పంట నష్టపోయిన రైతుల కౌలు రద్దు చేయాలని, వరికి రూ.25 వేలు, కంద, పసుపునకు రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర కౌలు రైతుల సంఘ అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, కార్యదర్శి ఎం.హరిబాబులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సాయం కౌలు రైతులకే ఇస్తామనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. బుడమేరు, కృష్ణానది వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో ఒక్క వడ్ల గింజను గానీ, కంద, పసుపు దుంపను గానీ ఇంటికి తెచ్చుకునే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలకు కౌలు రైతుల కౌలును పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఈ ప్రాంతాల్లో వరి, పసుపు, కంద కూరగాయలు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అరటి, చెరకు లాంటి పంటలు సగం నుంచి మూడు వంతులకు పైగా నష్టపోయాయని వివరించారు. వరి పంటకు రైతుకు ఇప్పటికే రూ.30 నుంచి 35 వేల వరకు పెట్టుబడి పెట్టారని, కందకు లక్షపైనే, పసుపునకు లక్షన్నరపైనే రైతులు పెట్టుబడి పెట్టారని, మిగిలిన వాణిజ్య పంటలన్నింటికి లక్షల్లోనే అందిన ప్రతీ చోట అప్పులు తెచ్చి సాగుచేశారని తెలిపారు. దెబ్బతిన్న పంటలకు వరికి రూ.10 వేలు, కంద, పసుపులకు రూ.14వేలు ఎకరానికి ప్రకటించడం చాలా అన్యాయమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నష్టపరిహారం పాడైపోయిన భూములను సాగు చేసుకోవడానికి కూడా సరిపోదన్నారు.

ఆర్థికసాయంపై ఏపీ చాంబర్స్ ధన్యవాదాలు

విజయవాడ: వరదల కారణంగా నష్టపోయిన వ్యాపార రంగాలకు ఆర్థిక సహాయం ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలను తెలియచేస్తున్నామని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపార సంస్థలను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవటం ఇదే తొలి సారి అని చెప్పారు.

ఫైబర్‌నెట్ ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా బండారు

పటమట: ఫైబర్‌నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నూతన కమిటీని ఎన్నుకుంది. బుధవారం పటమటలోని మోహన్‌దాస్ కళామందిరంలో జరిగిన సమావేశంలో ఎన్నికల పరిశీలకులు అడపా వెంకట్రావు ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లాస్థాయి కన్వీనర్స్‌ను నామినేట్ చేయడంతో పాటు 2024-29 కాలానికి నూతన అధ్యక్షుడిగా కాకినాడకు చెందిన బండారు కృష్ణమూర్తి (తునికృష్ణ), ఉపాధ్యక్షుడిగా కర్నూల్‌కు చెందిన అచ్చుకట్ల అహమద్ ఆలీ, ప్రధాన కార్యదర్శిగా గుంటూరుకు చెందిన బోయపాటి వెంకట శివప్రసాదరావు, సంయుక్త కార్యదర్శిగా చింతపల్లికి చెందిన రమేష్ చౌదరి, కోశాధికారిగా సామర్లకోటకు చెందిన మల్లిపూడి వీరవెంకట శ్రీనివాస్, కో-ఆర్డినేటర్‌గా విశాఖపట్నంకు చెందిన రాపర్తి అప్పలరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రణాళికా బద్ధంగా దసరా ఉత్సవాలు

» ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం

» ఎమ్మెల్యే సుజనా చౌదరి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి
హాజరైన వివిధ విభాగాల అధికారులు



వన్‌టౌన్, సెప్టెంబరు 18 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వై.సుజనా చౌదరి అన్నారు. ఉత్సవాలపై బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భక్తుల సలహాలు, సూచనలు పొందాలని, ఇందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వీఐపీలు, వీవీఐపీలకు ప్రత్యేక టైమ్ స్లాట్‌లను కేటాయించాలన్నారు. భక్తులు వేచిఉండేందుకు స్థలాలను ఎంపిక చేయాలన్నారు.

● కలెక్టర్ సృజన మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా, సామాన్య భక్తులకు సంతృప్తికరమైన దర్శనం అందేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ లక్ష మందికి పైగా భక్తులు వస్తారని, మూలా నక్షత్రం రోజున 3 లక్షల మంది భక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలన్నారు. దాతల సహకారంతో భక్తులకు తాగునీరు, పాలు, అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూలా నక్షత్రం రోజున ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

● పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పోలీసులతో పాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 3,500 మంది పోలీసులను బందోబస్తుకు వినియోగించనున్నట్టు చెప్పారు. ప్రతి నిర్ణీత ప్రాంతం సెక్టారుకు ఒక ప్రత్యేక అధికారి పరిశీలనలో ఏర్పాట్లను పూర్తిచేయాలన్నారు. దుర్గాఘాట్ లోపల కమాండ్ కంట్రోల్ ద్వారా ఉత్సవాల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

● ఈవో కేఎస్ రామారావు మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో అక్టోబరు 3న బాలా త్రిపుర సుందరీదేవి, 4న గాయత్రి దేవి, 5న అన్నపూర్ణా దేవి, 6న లలితా త్రిపుర సుందరీదేవి, 7న మహాచండీ దేవి, 8న మహాలక్ష్మిదేవి, 9న సరస్వతీదేవి (మూలా నక్షత్రం), 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దినీదేవి, 12న రాజరాజేశ్వరిదేవి అలంకారాలలో కనకదుర్గమ్మ దర్శనం ఇస్తారన్నారు. అక్టోబరు 9న అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు.

దర్శనానికి ప్రత్యేక కౌంటర్లు

ఆన్‌లైన్ టిక్కెట్లే కాకుండా రిసెప్షన్, టోల్‌గేట్, ఓం టర్నింగ్, పున్నమీఘాట్, వీఎంసీ ఆఫీసు, కలెక్టర్ ఆఫీసు, స్టేట్ గెస్ట్ హౌస్, మోడల్ గెస్ట్ హౌస్, హెడ్‌వాటర్ వర్క్స్, బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద కరెంటు బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. వినాయకుడి గుడి నుంచి కొండపైన ఓం టర్నింగ్ వరకు మూడు క్యూలు ఉంటాయని, అక్కడ నుంచి ఉచిత దర్శనం, వీఐపీ క్యూలతో కలిసి మొత్తం ఐదు క్యూలు ఉంటాయి. వాటర్ ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిళ్లను కూడా భక్తులకు సరఫరా చేస్తామని ఈవో తెలిపారు.

ప్రసాదంగా 25 లక్షల లడ్డూలు

కనకదుర్గానగర్ వద్ద ప్రత్యేక కౌంటర్లతో పాటు ఓం టర్నింగ్ వద్ద కూడా ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొత్తంగా 25 లక్షల లడ్డూలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులకు అమ్మవారి ఉచిత ప్రసాదం కింద పులిహోర, కట్టుపొంగలి, దద్దోజనం, సాంబారు అన్నం, మహామండపం ఎదురుగాగల ఖాళీ ప్రదేశంలో అందిస్తామన్నారు.

అంచనా వ్యయం రూ. 9 కోట్లు

దుర్గగుడిలో దసరా మహోత్సవాలకు రూ. 9 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. వీటిలో ఇంజనీరింగ్ పనులకు సుమారు 3 కోట్ల రూపాయలకు పైగా వ్యయం అవుతుందని చెబుతున్నారు. విద్యుదీకరణ, షామియానాలతో పాటు హంసవాహనం తదితరాల కోసం నిధులను వెచ్చించనున్నారు.

● భక్తులు స్నానం చేసేందుకు సీతమ్మవారి పాదాల ఘాట్ వద్ద 500లు, పున్నమీఘాట్ వద్ద 100, భవానీ ఘాట్ వద్ద 100 చొప్పున షవర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 150 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

● ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సూచనలు, సలహాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సహకారంతో దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీసీపీలు గౌతమీశాలి, ఎం.కృష్ణమూర్తి నాయుడు, అదనపు డీసీపీలు జి.రామకృష్ణ, ఎం.రాజారావు, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవో భవానీ శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, దేవస్థానం ఈఈలు ఎల్.రమా, కోటేశ్వరరావు, ఏఈఓలు, ఆయా విభాగాల సూపరింటెండెంట్‌లు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బుడమేరు పరిధిపై నివేదికివ్వండి

» జిల్లా కలెక్టర్ సృజన

బుడమేరు వరద ముంపు నుంచి జిల్లా, నగరానికి శాశ్వత పరిష్కారం దిశగా.. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ అడుగులు వేస్తోంది.. దీనిలో భాగంగా సర్వే, భూ రికార్డులు, ఇరిగేషన్, వీఎంసీ సిటీప్లానింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవ సర్వే నెంబర్లతో సహా ఎంతమేర ఆక్రమణలకు గురైందీ.. పూర్తి నివేదిక సమర్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 18: ఆక్రమణల గుర్తింపునకు తొలిదశలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సృజన, బుధవారం సర్వే, భూరికార్డులు, నగరపాలక సంస్థ, రెవిన్యూ అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల బుడమేరు వాగు పరీవాహక ప్రాంతంలో కురిసిన కుంభవృష్టితో ఊహించని విధంగా ప్రమాదకరస్థాయిలో దాదాపు 43 వేల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో గండ్ల ద్వారా వచ్చిన నీటితో విజయవాడ రూరల్, నగర పరిధిలో లోతట్టు ప్రాంతాలు, పంటపొలాలు జలమయమయ్యాయని, నగరంలోని రెండు లక్షలకు పైగా కుటుంబాలు ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పది రోజులకు పైగా కలెక్టరేట్‌లోనే పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులతో సమీక్షిస్తూ, బుడమేరు గండ్లను పూడ్చడం, బాధితులను పరామర్శించి, పూర్తి సహాయసహకారాలు అందించారన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగోనేందుకు 'ఆపరేషన్ బుడమేరు'ను ప్రకటించారని, ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించి జలవనరుల శాఖ అర్బన్, సిటీ పరిధిలో కాలువ విస్తీర్ణ నివేదికలను రూపొందించాల్సిన అవసరముందన్నారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఈ నేపథ్యంలో ఆక్రమణల వాస్తవ వివరాలను సర్వే నెంబర్లతో సహా సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, జిల్లా సర్వే, నగరపాలక సంస్థ సర్వే విభాగం, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ఆక్రమణలపై సర్వే నెంబర్లతో నివేదిక రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ నిధి మీనా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, నగరపాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లు

భారతీనగర్, సెప్టెంబరు 18 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఐటీఐ కోర్సుల్లో నాల్గవవిడత అడ్మిషన్లకు ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త విధానం ప్రకారం అభ్యర్థులు దరఖాస్తులో పేర్కొన్న కళాశాలకు సెప్టెంబరు 27వ తేదీ సాయంత్రం 5గంటలలోగా హాజరై ఒరిజినల్ సర్టిఫికెట్లను ఐటీఐలోని ప్రిన్సిపల్ వెబ్‌సైట్‌లో ధ్రువీకరించుకోవాల్సి ఉంది. జిరాక్స్ కాపీలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తును తీసుకురావాలి. ప్రభుత్వ ఐటీఐలో సెప్టెంబరు 28వ తేదీ, ప్రైవేట్ ఐటిఐలో సెప్టెంబరు 30 తేదీన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9490639639, 7780429468 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్



మైలవరం ఏసీపీగా ప్రసాదరావు

విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మైలవరం ఏసీపీగా వై.ప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ డీఎస్పీగా ఉన్న ప్రసాదరావును కొద్దిరోజుల క్రితం ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

కృష్ణా జిల్లా రిజిస్ట్రార్‌గా శైలజ

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లా రిజిస్ట్రార్‌గా డి.శైలజ బదిలీపై వస్తున్నారు. గుంటూరు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న శైలజను కృష్ణాజిల్లాకు బదిలీ చేయగా, మచిలీపట్నంలో జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.వి.వి.డి. ప్రసాద్‌ను ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ చేశారు.

పశుసంవర్ధక శాఖ జేడిగా..

జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీగా చిన నరసింహులు నరసరావుపేట నుంచి బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. కృష్ణాజిల్లా పశు సంవర్ధక శాఖ జేడీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు నెల్లూరుకు బదిలీ అయ్యారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణప్రసాద్

టీడీపీలోకి వైసీపీ సర్పంచ్..

పెడన : గూడూరు మండలం తరకటూరు సర్పంచ్ చిన్నం వెంకటరమణ వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గూడూరు టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, తరకటూరు గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

22న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు: నూజివీడులోని ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్ గ్రౌండ్స్‌లో ఈ నెల 22న ఉదయం 8 గంటలకు కృష్ణా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాలబాలికల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వీవీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి రెండు తర్వాత పుట్టిన బాల, బాలికలు అర్హులన్నారు. ఎంపికైన జట్లను అక్టోబరు 5 నుంచి 7వరకు వైజాగ్‌లోని సునపర్తిలో జరిగే ఏపీ అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు పంపుతామని ప్రసాద్ తెలిపారు. క్రీడాకారులు 9490334333లో సంప్రదించాలన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న సంఘం సభ్యులు

సీఎం సహాయ నిధికి రూ.24 లక్షలు

వన్‌టౌన్ : సీఎం సహాయ నిధికి ఆంధ్రప్రదేశ్ అద్దె బస్సుల యజమానుల సంఘం సభ్యులు బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలిసి రాష్ట్ర రవాణ, యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.24 లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వరద బాధితుల సహాయం కోసం మరింత మంది ముందుకు రావాలన్నారు.

ఆయిల్ టిన్నుల్లో మద్యం రవాణా

» పట్టుబడిన ఇద్దరు బెల్టు షాపు నిర్వాహకులు

అవనిగడ్డ, సెప్టెంబరు 18 : పోలీస్, ఎక్సైజ్ అధికారుల కళ్లు గప్పి, అక్రమ మార్గంలో మద్యాన్ని తరలించేందుకు ప్రయత్నించి ఇద్దరు బెల్టు షాపు నిర్వాహకులు అవనిగడ్డ పోలీసులకు పట్టుబడ్డారు. కోడూరు మండలం పాలకాయతిప్ప గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ శ్రీను, గోవిందరాజులు గ్రామంలో మద్యాన్ని అధిక ధరలకు విక్రయించేందుకు, ఎవరికీ అనుమానం రాకుండా ఆయిల్ టిన్నుల్లో మద్యాన్ని తరలించాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రెండు ఆయిల్ టిన్నులను కోసి వాటిలో 100 మద్యం



సీసాలు ఉంచి అవనిగడ్డ నుంచి వాటిని తరలించేందుకు ప్రయత్నించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు తనిఖీ చేసి ఆయిల్ టిన్నుల్లో మద్యం బాటిళ్లను గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు అవనిగడ్డ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



పాల సేకరణలో 4 శాతం వృద్ధి

» చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్ : కృష్ణా మిల్క్ యూనియన్ ఈ ఏడాది పాల సేకరణలో నాలుగు శాతం వృద్ధిని సాధించిందని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. యూనియన్ టర్నోవర్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1200 కోట్లు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది శాతం వృద్ధిని సాధించిందన్నారు. ముంపు బారిన పడిన ఫ్యాక్టరీని త్వరితగతిన పునరుద్ధరిస్తామన్నారు. విపత్తుల్లో నష్టపోయిన ఫ్యాక్టరీకి మళ్లీ జీవం పోయడానికి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు.

రెండు వర్గాల ఘర్షణ

» ఐదుగురికి తీవ్ర గాయాలు

» 19 మందిపై కేసు నమోదు

జగ్గయ్యపేట, సెప్టెంబరు 18 : పాత కక్షలతో క్రిస్టియన్‌పేటలో మంగళవారం అర్థరాత్రి సినీఫక్కీలో రెండు వర్గాలు కర్రలు, రాడ్లు, కారంతో దాడులు చేసుకుని భీతావహ వాతావరణం సృష్టించాయి. పరస్పర దాడుల్లో మహిళలూ పాల్గొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు వర్గాలపై లాఠీ ఝుళిపించి చెదరగొట్టారు. జగ్గయ్యపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రిస్టియన్‌పేటలో టీడీపీ నేత కర్ల జోజి, వైసీపీ నేత రుంజా నాగయ్య వర్గాల మధ్య కొద్ది రోజులుగా స్వల్ప ఘర్షణలు, కవ్వింపులు జరుగుతున్నాయి. ఫిర్యాదులు రావటంతో పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం రాత్రి వైసీపీ వర్గీయులు రెచ్చగొట్టటంతో టీడీపీ వర్గీయులు బాహాబాహీకి దిగారు. కర్రలు, రాడ్లు, కారంతో దాడు లు చేసుకుని కొట్టుకున్నారు. దాడుల్లో జీ.హైమవతి (33), కార్తీక్‌కుమార్ (20), నాగమల్లేశ్వరరావు (30), పి.జ్యోతి (36), ఎం.లక్ష్మయ్య (37)లు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో జ్యోతి, లక్ష్మయ్యలను విజయవాడ రిఫర్ చేయగా, మిగిలిన ముగ్గురు జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐ లు సంఘటనా స్థలంలో పరిస్థితిని పర్యవేక్షించారు. ఎం.లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కర్ల జోజి, కర్ల వెంకట్రావు, డేవిడ్, శేషయ్య, ఇ శ్రీకాంత్‌లపై, కర్ల వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రుంజా నాగయ్య, సాయి, బాబు, కె.డేవిడ్‌కుమార్, బత్తుల గోపి, జి.సాయి, బాబు, డేవిడ్ కుమార్, అయ్యప్ప, ఆర్.అంకమ్మ, మణి,అచ్చమ్మ, పిల్లి అచ్చమ్మ, జ్యోతి, విజయలపై వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇంజనీర్లే కాంట్రాక్టర్లు

(5వ పేజీ తరువాయి)

ఇప్పుడు ఈ పనులను ఎఫ్‌డీఆర్‌లో చూపించడానికి ఇంజనీరింగ్ అధికారులు రంగం చేసుకున్నారు. పడిన గండ్లను రైతులు పూడ్చేసుకుంటే వాటికి ప్రతిపాదనలు చేస్తున్నారు. ఈ పనులకు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. పైగా ఈ పనులకు ఎలాంటి టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిన చేసుకునేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం ఉయ్యూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్ పేరును సిఫార్సు చేశారు. ఆయనకు నామినేషన్ పద్ధతిపై రూ.30 లక్షల పనులను అప్పగించడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్నారు. కాంట్రాక్టర్ పేరు ఉయ్యూరు వాసిదే అయినా పనులు మాత్రం ఈ సబ్‌డివిజన్‌లో ఉన్న ఒక ముఖ్యఅధికారి చేసుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఆర్సీ (రివర్ కన్జర్వేషన్) సబ్ డివిజన్‌లోనూ ఇదే తంతు నడుస్తోంది. ఇప్పటి వరకు ఎలాంటి ఇరిగేషన్ పనులూ చేయని కాంట్రాక్టర్‌ను తీసుకొచ్చి పనులను నామినేషన్ పద్ధతిపై అప్పగించాలని చూస్తున్నారు. ఈ విషయంలో సబ్‌డివిజన్‌లో ఒక కీలక అధికారి పావులు కదుపుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి దిగువ నుంచి ఇటు విజయవాడ వైపు, అటు తాడేపల్లి వైపు మొత్తం రివర్ కన్జర్వేషన్ పరిధిలోకి వస్తుంది. బ్యారేజీకి ఇటీవల వచ్చిన 11.47 లక్షల క్యూసెక్కుల వరద కారణంగా దిగువ ప్రాంతంలో కట్టలకు నష్టం జరిగింది. ఈ పనులను చేయడానికి రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న ఒక అధికారి మాజీ మంత్రి జోగి రమేష్‌కు ముద్దుల అనుచరుడిగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ రూ.50 లక్షల పనుల కోసం ఇప్పటి వరకు ఇరిగేషన్ పనుల్లో ఎలాంటి అనుభవమూ లేని కాంట్రాక్టర్‌ను తీసుకొచ్చారని జలవనరుల శాఖలో ప్రచారం నడుస్తోంది. ఆ కాంట్రాక్టర్ ఈ ఏడాది నుంచే ఇరిగేషన్, డ్రెయినేజీ పనుల్లో అడుగుపెట్టినట్టు సమాచారం. ఆయనను ముందుపెట్టి నామినేషన్‌పై పనులు కట్టబెట్టి ఎఫ్‌డీఆర్ సొమ్ములు వెనుకేసుకోవడానికి ఇంజనీర్లు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన కొంతమంది కాంట్రాక్టర్లు అధికారులను ప్రశ్నించారు. టెండర్లను ఆహ్వానించకుండా నామినేషన్ పద్ధతి ఏమిటంటూ అడిగారు. దీనికి ఆయా సబ్‌డివిజన్ల ఇంజనీర్లు కూటమి ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల పేర్లు చెబుతున్నట్టు సమాచారం.

డీటీ కోసం పోటీ!

» ఉన్నచోటే పాతుకుపోవటానికి నీచ వ్యవహారాలు

» ఒకరిపై ఒకరు లైంగిక, ఉద్యోగాల స్కామ్ ఆరోపణలు

» ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్

సివిల్ సప్లయిస్‌లో బదిలీల వ్యవహారం వ్యక్తిగత వైషమ్యాలకు దారి తీస్తోంది. బాపులపాడు డీటీ పోస్టు కోసం కొందరు ఉద్యోగులు ఎంతకైనా తెగించటానికి సిద్ధమౌతున్నారు. వ్యక్తిగతంగా అల్లరి చేసుకునే పరిస్థితికి దిగజారారు. ఈ వ్యవహారంలో కొందరు మహిళా డీలర్లను రోడ్డు కీడ్చే పనులు చేస్తున్నారు. కృష్ణా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/జంక్షన్ రూరల్)

కృష్ణాజిల్లా బాపులపాడు మండలంలో పీడీఎస్ డీటీ ప్రధాన్, రెవెన్యూ డీటీ రమణల మధ్య పోస్టింగ్‌ల వార్ నడుస్తోంది. బదిలీలలో భాగంగా రెవెన్యూ డీటీ రమణ, పీడీఎస్ డీటీ ప్రధాన్ తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒకరిపై మరొకరు పరస్పరం ఫిర్యాదులు చేయించుకునే పరిస్థితికి దిగజారారు. రమణ గతంలో మహిళా డీలర్లతో అనుచితంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదులు ఉన్నాయి. లిఖిత పూర్వక ఫిర్యాదులు రాకపోవటంతో అతడిపై చర్యలు తీసుకోలేదు. నాలుగేళ్ల తర్వాత ఫిర్యాదు రాగా.. దాని వెనుక పీడీఎస్ డీటీ ప్రధాన్ హస్తం ఉందని తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. రమణ కూడా గతంలో ప్రధాన్ ఉద్యోగాల పేరుతో మోసం, ఆ తర్వాత వైసీపీ నేతల అండదండలతో మళ్లీ పోస్టింగ్ తెచ్చుకున్నాడన్న దానిపై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఇద్దరూ వ్యక్తిగతంగా పరస్పరం అల్లరి చేసుకోవటం వెనుక.. పీడీఎస్ డీటీ పోస్టును దక్కించుకోవటం కోసమేనని తెలుస్తోంది. మండలంలో పీడీఎస్ డీటీగా పనిచేయటం అంటే పేదల బియ్యం దేశ సరిహద్దులు దాటిపోవటం వెనుక రేషన్ మాఫియా శక్తులతో సంబధాలు కలిగి ఉండటమే కారణం. అందుకే ఇక్కడ డీటీకి విపరీతమైన పోటీ నెలకొంది. కృష్ణా జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై సీరియస్‌గా దృష్టి సారించి.. ఇద్దరినీ ఇక్కడి నుంచి కదిలించకపోతే తప్ప బాపులపాడు మండలం ప్రశాంతంగా ఉండే పరిస్థితి లేదని పలువురు పేర్కొంటున్నారు.

స్వలాభం కోసమే చీలికలు!

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల రేషన్ డీలర్లపై పీడీఎస్ డీటీ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, రేషన్ డీలర్లపై దాడులు చేస్తూ స్వలాభం కోసం సంఘంలోనే చీలికలు తెచ్చారని మండల అధ్యక్షుడు ఆర్నేపల్లి శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సంఘ నాయకులు పీడీఎస్ డీటీ వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీడీఎస్ డీటీగా ప్రధాన్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అసోసియేషన్‌లో చీలికలు తీసుకువచ్చారని, ఎదురు మాట్లాడినా, నెలవారీ మామూళ్లు సకాలంలో ఇవ్వకపోయినా దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే ఇద్దరు మహిళా డీలర్లపై కక్షపూరితంగా ఆరు కేసులు నమోదు చేయించారని తెలిపారు. అదేమని అడిగితే తనకు సంబంధం లేదని, వైసీపీ నేతల ఒత్తిడి మేరకే అని వారిపై నెట్టేసేవారన్నారు. ప్రభుత్వం మారినా ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోగా జనసేన నాయకులను అడ్డుపెట్టుకుని పబ్బం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే శేఖర్‌కు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని పిలిపించి నాపైనే ఫిర్యాదు చేయడానికి నువ్వు ఎవ్వడ్రా అంటూ దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు పెడతానని బెదిరించడంతో తప్పని పరిస్థితుల్లో నిరసన తెలియజేయాల్సి వచ్చిందని నాయకులు, డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను రాష్ట్ర సంఘానికి తెలియజేయగా మద్దతు ప్రకటించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు ధారావతు హరికృష్ణ, మండల కార్యదర్శి కగ్గా గాంధీ, కమిటీ సభ్యులు ఆకునూరి మాణిక్యాలరావు, మాతంగి కిషోర్, నల్ల పార్వతి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రేషన్ డీలర్ల సంఘ నేతలు

విభేదించాడని ప్రియుడి కారు దహనం

మచిలీపట్నం టౌన్: ఆరేళ్లపాటు తనతో స్నేహంగా ఉంటూ మోసం చేశాడన్న కోపంతో అతడి కారు దహనం చేసిన వైనమిది. చిలకలపూడి సీఐ నబి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొబ్బరితోటకు చెందిన బిల్డర్ విజయ్ తన కారును అనూష అనే మహిళ దహనం చేసిందని ఫిర్యాదు చేశాడు. దీంతో అనూషపై కేసు నమోదు చేశారు. కాగా 2017 నుంచి తనతో స్నేహంగా ఉంటూ ఉన్నట్టుండి మరో మహిళా ఉద్యోగినితో విజయ్ అక్రమంగా సంబంధం పెట్టుకుంటున్నాడని అనూష ఫిర్యాదు చేశారు. దీనిపై చిలకలపూడి పోలీసులు కారు దగ్ధం చేసిన నేరానికి అనూషపై కేసు నమోదు చేయగా, తనను మోసం చేశాడన్న అనూష ఇచ్చిన ఫిర్యాదుపై బిల్డర్ విజయ్‌పై మరొక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.45

అనధికార కట్టడం ధ్వంసం

భవానీపురం, సెప్టెంబరు 18 : 41వ డివిజన్‌లోని ఆశ్రమం వీధిలోని అనధికారిక నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. ఎం.వెంకటరెడ్డి అనే యజమాని జీప్లస్-3 నిర్మాణానికి అనుమతి తీసుకుని అదనంగా ఐదో అంతస్తు నిర్మాణం చేసినట్లు గుర్తించారు. డీసీపీ చంద్రబోస్ ఆధ్వర్యంలో టీపీబీవో వెంకటేశ్వరరావు. ప్లానింగ్ సెక్రటరీ సాయిశ్రీ పర్యవేక్షణలో ధ్వంసం చేశారు.



ఆశ్రమం రోడ్డులో అనధికార నిర్మాణం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యేలు బొండా ఉమ, కాలవ శ్రీనివాసులు



64వ డివిజన్‌లో బాధితులకు కిట్లు అందిస్తున్న టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్



బుడమేరు ముంపు బాధితులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నేతలు

బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యేలు బొండా ఉమ, కాలవ శ్రీనివాసులు పాలాభిషేకం

వన్‌టౌన్, సెప్టెంబరు 18: వరద బాధితులను సీఎం చంద్రబాబు ఆర్థికంగా ఆదుకుంటారని ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, కాలవ శ్రీనివాసులు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో రూ.3 వేల నుంచి 4 వేల వరకు మాత్రమే సహాయం అందినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం రూ.25వేలు ప్రకటించారన్నారు. టీఎన్‌టీయూసీ , తెలుగుమహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకుల ఆధ్వర్యంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాస్‌తో కలిసి చంద్రబాబుచిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల చిన్న, దాసరి ఉదయశ్రీ, పైడి శ్రీను, లబ్బా వైకుంఠం, కోలా శ్రీనివాస్, బంగారు నాయుడు, బెజవాడ తిరుపతి, పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం...

సెంట్రల్ నియోజకవర్గంలో పలు స్వచ్ఛంద, వాణిజ్య సంస్థలు, రాజకీయ పార్టీలు, వాసవీ, రోటరీ, లయన్స్ క్లబ్‌లు బాధితలకు అందించిన సహకారం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వరద బాధితుల కోసం 5వేల జీన్స్ ప్యాంట్‌లను వర్తక సంఘం తరఫున అందించారన్నారు. ప్రతిఒక్కరికీ సహాయం అందేలా చూడాలని కలెక్టరును కోరతామని ఎమ్మెల్యేలు అన్నారు.

కిట్లు పంపిణీ

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమ, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సహకారంతో 64వ డివిజన్ టీడీపీ నాయకులు కె.రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం దుస్తుల కిట్లను పంపిణీ చేశారు. పట్టాభిరామ్ ఇంటింటికి వెళ్లి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె. వరలక్ష్మి, గిరి, సాయి, జనసేన నాయకులుపాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉండాలి

వరద బాధిత కుటుంబాలకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలని హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలన అధికారి డాక్టర్ వి. నారాయణరావు అన్నారు. కాకరపర్తి భావన్నారాయణ కళాశాల యుజీసీ, ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో విన్నర్ వీల్ క్లబ్ అంబాపురంలోని బాధిత కుటుంబాలకు బియ్యం, చీరలు పంపిణీ చేశారు. విన్నర్‌వీల్ క్లబ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి, స్టడీ సెంటర్ కన్వీనర్ వి. శైలజ, విన్నర్ వీల్ క్లబ్ బాధ్యురాలు కరం కౌర్, క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్ర పాల్గొన్నారు.

యూటీఎఫ్ వితరణ

గవర్నర్‌పేట: ఎన్టీఆర్ జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం బుడమేరు ముంపు బాధితులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది సహకారం అందించారన్నారు. టీచర్లు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేశారని, ముంపు ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసరావు, సుందరయ్య, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కండ్రిక, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ది సుప్రీం ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ డీజీఎం మురళీకృష్ణ

కాశీ విశ్వేశ్వర స్వామికి రూ.3.81 లక్షల ఆదాయం

గవర్నర్‌పేట, సెప్టెంబరు 18: దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి వి.అనురాధ పర్యవేక్షణలో బుధవారం చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానాకి చెందిన నాలుగు హుండీల లెక్కింపు జరిగింది. ఆలయ వంశపారం పర్య ధర్మకర్తలు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ, హిందూ సేవాదళ సభ్యులు భక్తుల సమక్షంలో 114 రోజులు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 3, 81, 967లు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య తెలిపారు.





పాలఫ్యాక్టరీ ప్రాంతంలో మొక్క నాటుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచుదాం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

చిట్టినగర్, సెప్టెంబరు 18: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా బుధవారం 46వ డివిజన్ పాలఫ్యాక్టరీ సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమంలో మేయర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అమ్మ కోసం మొక్కలను నాటే కార్యక్రమం నిత్యం జరుగుతుండాలని, వీఎంసీ పరిధిలో నిత్యం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో..

కృష్ణలంక: కృష్ణలంక 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఆయన విద్యార్థులతో కలిసి బుధవారం మొక్కలు నాటారు. శానిటరీ ఇనస్పెక్టర్ ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోమ్మువారి వీధిలో..

సత్యనారాయణపురం: సత్యనారాయణపురం కోమ్మువారి వీధి బీఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలో చెత్త వేయవద్దని కార్పొరేటర్ శర్వాణీ మూర్తి స్థానికులను కోరారు. చెత్తను తొలిగించిన ఆప్రదేశంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని బ్యానర్ ఏర్పాటు చేశారు. ప్రతీ ఇంటికి చెత్తను సేకరించేందుకు పారిశుధ్య సిబ్బంది వస్తున్నారని వారికి చెత్త ఇవ్వాలన్నారు. మొక్కలు నాటిన ప్రాంతంలో ఎవరైనా చెత్త వేసినట్లుయితే జరిమానా విధిస్తారని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి...

వన్‌టౌన్ : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. బుధవారం స్వచ్ఛతా హి సేవను గులాం మొహిద్దీన్ రోడ్డులో జరిగింది. నేరేడు మొక్కలు నాటారు. రోడ్ల మీద, కాలువల్లో చెత్త వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు.

జీవో 107, 108లను రద్దు చేయాలి : సీపీఎం

గవర్నర్‌పేట, సెప్టెంబరు 18: గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్సింగ్, ఎన్ఆర్ఐ సీట్లకు అవకాశం కల్పిస్తూ తెచ్చిన జీవో నెంబరు 107, 108లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబును కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ దిశగా చేస్తున్న ప్రయత్నాలు సీపీఎం వ్యతిరేకిస్తుందన్నారు.

22న సీతారాం ఏచూరి సంతాప సభ

సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న సీతారాం ఏచూరి సంతాప సభ ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ కోత

గవర్నర్‌పేట, సెప్టెంబరు 18: మాచవరం సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచవరం బీఆర్‌టీఎస్ రోడ్డు, క్యాన్సర్ ఆసుపత్రి ఏరియా, నార్లవారి వీధి, బుల్లెమ్మ వీధి, కాటూరు వారి వీధి, దానయ్య వీధి, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాల్వ గట్టు, పడవల రేవు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బాబోయ్.. దానయ్య వీధి

●నెలల తరబడి పొంగుతున్న మ్యాన్‌హోల్స్● కన్నెత్తి చూడని కార్పొరేటర్

మొగల్రాజపురం, సెప్టెంబరు 18: పటమట 11వ డివిజన్ దానయ్య వీధి అంటే జనం బెంబేలెత్తుతున్నారు. ఆ వీధిలో నెలల తరబడి మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. ఫిర్యాదు చేసినా స్పందించే నాదుడులేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. డివిజన్‌కు కార్పొరేటర్ ఉన్నా లేనటే అంటున్నారు. టీడీపీ తరుపున వీఎంసీ ఎన్నికల్లో కేశినేని శ్వేత విజయం సాధించారు. ఎన్నికల ముందు వైసీపీలోకి వెళ్లారు. దాంతో దానయ్య వీధిని పట్టించుకోవడానికి ఎవరికి తీరిక లేదు. ఈ వీధిలో జనాభా ఎక్కువగా ఉంటారు. అన్నీ బహూళ అంతస్తులే.. కనీసం వెయ్యి మంది నివసించే ఈ వీధిలో చెత్త కూడా ఎక్కువగా వస్తుంటుంది. పారిశుధ్య సమస్యలు కూడా ఎక్కువగానే ఉంటాయి . గుర్తుకు వచ్చినపుడు సిబ్బంది డ్రెయిన్‌లో చెత్తను తొలగిస్తుంటారని స్థానికులు అంటున్నారు. చెత్త వాహనం రాకముందే చెత్త బుట్టలు రోడ్డుమీద పెడుతుండటంతో వీధి కుక్కలు వాటిని పడేసి చిందవందర చేస్తున్నాయి. దాంతో అపరిశుభ్రత నెలకొంటుంది.



మూడు నెలలుగా పొంగుతున్న మ్యాన్ హోల్

● దోమలు స్వైర విహారం

యూజీడీ మ్యాన్ హోల్స్ పొంగకుండా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మురుగు పక్కనే ఉన్న సైడు కాల్వలోకి వెళుతుంది. సైడు కాల్వలు తీయకపోవడం వల్ల పారుదల లేక ఆ కాల్వలు నిండిపోయాయి. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

● డెంగ్యూతో బెంబేలు

ఈ వీధిల్లో జ్వరబాధితులు కూడా ఎక్కువే. ప్రతి సీజన్‌లో డెంగ్యూ బారిన పడుతుంటారు. కార్పొరేటర్ దృష్టికి తీసుకెళదామంటే ఈ డివిజన్‌లో ఎన్నికల సమయంలో కనించారు. ఇప్పటి వరకు కార్పొరేటర్ రాలేదు.

అన్నదానం

సత్యనారాయణపురం, సెప్టెంబరు 18: సత్యనారాయణపురం గిరి వీధిలోని అభయ విఘ్నేశ్వరస్వామివారి ఆలయం వద్ద బుధవారం వినాయకచవితి ఉత్సవాల్లో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ 26 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. ముఖ్యంగా యువత సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. సుమారు 1000 మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో విఘ్నేస్వారస్వామి కమిటీ అధ్యక్షుడు బొగ్గవరపు బాలకోటేశ్వరరావు, 33వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్, కమిటీ కార్యదర్శి రఘు, కోశాధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ రావునగర్‌లో ..

చిట్టినగర్: లక్ష్మీ సేవాసమితి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కె.ఎల్.రావునగర్ 7వలైన్, జక్కంపూడి హౌసింగ్ కాలనీలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపీ, సంతోష్, వెంకటేష్, తామడ తిరుపతిరావు, సత్తిబాబు, లావేటి బ్రదర్స్ ప్రసాద్, తామడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ

వన్‌టౌన్, సెప్టెంబరు 18: కూటమి ప్రభుత్వం గురువారంతో 100 రోజులు పూర్తి చేసుకుంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయమలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి చంద్రబాబు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ

వన్‌టౌన్, సెప్టెంబరు 18: కూటమి ప్రభుత్వం గురువారంతో 100 రోజులు పూర్తి చేసుకుంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయమలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి చంద్రబాబు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

యువత సేవాభావం కలిగి ఉండాలి

సత్యనారాయణపురం: యువతరం సేవాభావం కలిగి ఉండాలని విశ్రాంత ఓఎన్‌జీసీ మేనేజర్ తలారి వేణుగోపాల్ అన్నారు. సత్యనారాయణపురం చిత్తరంజన్‌శాఖాగ్రంథాలయానికి 18వేల రూపాయల విలువైన కుర్చీలను బుధవారం గ్రంథాలధికారి సంపత్‌కుమార్‌కు అందజేశారు. గతంలో తాను చిత్తరంజన్ గ్రంథాలయంలో పాఠకుడినని, గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని ఉన్నత స్థాయి ఉద్యోగం సంపాదించానన్నారు. గ్రంథాలధికారి సంపత్‌కుమార్, ఎన్ఎస్‌సీ రంగనాధాచారి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 19 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

హేమ కమిటీ లాంటిది అవసరం లేదు



ఐశ్వర్యా రాజేశ్

'పరిశ్రమలో ఇప్పటివరకూ నేను లైంగిక వేధింపుల బారిన పడలేదు. నాకు తెలిసినంతవరకూ తమిళ చిత్రపరిశ్రమలో అలాంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. కాబట్టి మాలీవుడ్‌లో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాంటిది కోలీవుడ్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నాను' అని దక్షిణాది నటి ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె పై వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ నిజంగా ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే, దానికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి, మహిళల రక్షణే ముఖ్యం అని ఐశ్వర్య చెప్పారు.



మరో కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ తాను లైంగికవేధింపుల బారిన పడలేదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "ఎనిమిదేళ్ల వయసు నుంచే జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నాను. నా చుట్టూ ఏం జరుగుతుందో గమనిస్తూ ఉండేదాన్ని. అప్రమత్తతో ఉండడం వల్లే నాకు వేధింపులు ఎదురుకాలేదు. మలయాళ చిత్రపరిశ్రమలో చాలా సినిమాలు చేశాను. అక్కడ మంచి వాతావరణమే ఉంది. పరిశ్రమలో కన్నా బయట ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. అక్కడ మహిళలకు రక్షణ కరవైందని' శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు.

న్యాయం జరగాలి : అనసూయ



లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళలు ఎవరికీ భయపడకుండా, వెంటనే బయటపెట్టాలని నటి అనసూయ సూచించారు. జానీ మాస్టర్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా కొరియోగ్రాఫర్‌తో పలు సందర్భాల్లో కలసి పనిచేసినట్లు ఆమె సోషల్ మీడియాలో తెలిపారు. 'పుష్ప' చిత్రం సెట్స్‌లో ఆమె పనితీరు చూశాను, ప్రతిభావంతురాలు అని కితాబునిచ్చారు. ఆమెకు న్యాయం జరగాలని అనసూయ ఆకాంక్షించారు. మహిళల పైన సానుభూతి చూపడానికి పరిమితం కాకుండా వారికి అండగా నిలవాలని ఆమె ప్రజలను కోరారు.



ఎన్టీఆర్ కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'దేవర' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. బుధవారం ఎన్టీఆర్, జాన్వీకపూర్ రొమాంటిక్ లుక్‌ను విడుదల చేసింది.

విన్నవెంటనే ఆకట్టుకునేలా...



విష్వక్ సేన్, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. అక్టోబరు 31 విడుదలవుతున్న ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ పిల్లా'ను మేకర్స్ విడుదల చేశారు. విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉన్న ఈ రొమాంటిక్ సాంగ్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. కృష్ణ చైతన్య లిరిక్స్ అందించగా.. నకాశ్ అజీజ్ ఆలపించారు.

గుర్రం పై యోధుడు



కన్నడ కథానాయకుడు ఉపేంద్ర నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యూ ఐ ద మూవీ'. ఉపేంద్ర దర్శకత్వం వహిస్తున్న పదకొండో సినిమా ఇది. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి కేపీ శ్రీకాంత్ నిర్మాత. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. గుర్రం పై యోధుడి గెటప్‌లో ఉన్న ఆయన లుక్ అదిరింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు చెప్పారు. రీష్మా నాయక్, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, రవిశంకర్ ఇతర ముఖ్య తారాగణం.

ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో దిలీప్ ప్రకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు సూపర్‌హిట్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్లు కూడా వస్తున్నాయి. ఈ రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. "నాటక రంగం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను ఇంతటి హిట్ చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమాని చూసిన వారంతా ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది" అని దర్శకుడు అర్జున్ సాయి అన్నారు.

జర్నీ... మరోసారి



శర్వానంద్, అనన్య, జై, అంజలి ప్రధాన పాత్రలు పోషించిన అనువాద చిత్రం 'జర్నీ' 2011లో విడుదలై సంచలన విజయం సాధించింది. రెండు ప్రేమ కథలను సమాంతరంగా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు టాలీవుడ్‌లో రీ రిలీజ్ చిత్రాల ట్రెండ్ ఉంది కనుక సుప్రియ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మి నరసింహా మూవీస్ ఈ మ్యూజికల్ లవ్‌స్టోరీని ప్రేక్షకుల ముందుకు తెస్తోంది. ఈ నెల 21న 'జర్నీ' సినిమాను రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

ఊహించిన దాని కంటే పెద్ద హిట్

నితేశ్‌రాణా దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న సందర్భంగా దర్శకుడు నితేశ్‌రాణా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా విజయం ఇచ్చిన ఉత్సాహం ఒక వైపు.. చిరంజీవి, మహేశ్‌బాబు అందించిన ప్రశంసలు మరో వైపు.. ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి.



ఈ సినిమా మా చిత్రబృందం ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టీమ్ అంతా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా హ్యాట్రిక్ అస్సెట్‌గా నిలిచారు. కాలభైరవ ఇచ్చిన సంగీతాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమాలోని పాత్రల్ని జనరంజకంగా మలిచేందుకు ఎన్నో రిఫరెన్స్‌లు తీసుకున్నాను. ఇంకో సినిమా చేయడానికి సన్నాహాలు చేసున్నాను. ఆ తర్వాతే 'మత్తు వదలరా 3' ఉంటుంది.

మంచి విజయం సాధించాలి



'పిల్ల పిలగాడు' ఫేమ్ సాయి తేజ, పావని కరణం హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'పైలం పిలగా'. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను రామకృష్ణ బొద్దుల, ఎస్.కే. శ్రీనివాస్ నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్, ట్రైలర్‌ను చూసి హీరో బాలకృష్ణ ప్రశంసించారు. 'ఈ సినిమా కంటెంట్ బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

అద్భుతమైన విజువల్స్‌తో...



నటుడు రవిశంకర్ దర్శకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'సుబ్రమణ్య'. ఆయన తనయుడు అద్వయ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియం నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ ఇటీవలే విడుదలైంది. అద్భుతమైన విజువల్స్‌తో నిండిన ఈ సినిమా గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

రెట్టింపు వినోదం

యువ నటీనటులు, సాంకేతిక నిపుణులతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం లాస్టియర్ విడుదలై హిట్ అయింది. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.



ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' వస్తోంది. ఇందులోని తొలి పాటను ఈ శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, సంప్రదాయ దుస్తుల్లో ఉన్న మ్యాడ్ గ్యాంగ్ పోస్టర్‌ను విడుదల చేసింది 'సితార' సంస్థ. ఈ సీక్వెల్‌ను మరింత వినోదాత్మకంగా మలిచే పనిలో దర్శకుడు కల్యాణ్ శంకర్ ఉన్నారు. రెట్టింపు వినోదంతో, రెట్టింపు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటామని నిర్మాతలు హారిక సూర్యదేవర, సాయి సౌజన్య చెప్పారు. 'మ్యాడ్' చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికీ వర్క్ చేస్తున్నారు.

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024



ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000 (పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

దిక్సూచి

అడ్మిషన్స్

ఎన్ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కోర్సు, సీట్లు: యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.

- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్ఎల్ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్ఎల్ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

బిజినెస్

విజయవాడ ● గురువారం 19 సెప్టెంబరు 2024

ఫెడ్ రేటు తగ్గిందోచ్..

0.50% తగ్గింపుతో శ్రీకారం

నాలుగేళ్లలో ఇదే తొలిసారి

4.75-5 శాతానికి తగ్గిన ప్రామాణిక వడ్డీ రేట్ల శ్రేణి



జెరోమ్ పావెల్

న్యూయార్క్: అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్' ప్రామాణిక వడ్డీ రేట్ల తగ్గింపుపై గత కొన్ని నెలలుగా ప్రపంచ మార్కెట్లో కొనసాగుతున్న చర్చకు ఎట్టకేలకు తెరపడింది. బుధవారంతో ముగిసిన పరపతి సమీక్షలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేటును మెజారిటీ విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగా అర(0.50) శాతం తగ్గించింది. దాంతో ప్రామాణిక వడ్డీ రేట్ల శ్రేణి 23 ఏళ్ల గరిష్ఠ స్థాయి 5.25-5.50 శాతం నుంచి 4.75-5.0 శాతానికి తగ్గింది. ఫెడ్ రేట్లు తగ్గడం నాలుగేళ్లలో(2020 తర్వాత) ఇదే తొలిసారి. కొవిడ్ సంక్షోభం తర్వాత కూడా ఇదే తొలి వడ్డీ రేట్ల తగ్గుదల. ఇక దేశ ఆర్థిక వృద్ధితోపాటు జాబ్ మార్కెట్‌కు ఊతమిచ్చేలా ముున్ముందు సమీక్షల్లో వడ్డీ రేట్లను మరింత తగ్గిస్తామని ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. ఈ ఏడాది చివరి నాటికి మరో అర శాతం కోత పెట్టడంతోపాటు వచ్చే ఏడాదిలో ఒక శాతం తగ్గించే అవకాశాలున్నాయంది. 2026లో మరో 0.50 శాతం తగ్గించే అవకాశాలున్నాయి. కాగా, ఫెడ్ రిజర్వ్ బాటలోనే మరిన్ని దేశాల సెంట్రల్ బ్యాంక్‌లూ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. గురువారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఫెడ్ రేటు తగ్గింపు వార్త వెలువడిన వెంటనే అమెరికన్ మార్కెట్లు భారీగా పుంజుకుంది. డౌజోన్స్ ఒకదశలో 375 పాయింట్ల వరకు ఎగబాకింది. గురువారం ప్రపంచ మార్కెట్లు కూడా పాజిటివ్‌గా స్పందించనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు బంగారం ధర కూడా గణనీయంగా పెరిగింది.

రెపో తగ్గకపోవచ్చు

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

ఆహార ధరల ద్రవ్యోల్బణం తగ్గుదలపై ఇంకా అనిశ్చితి తొలగకపోవడంతో ఈ ఏడాదిలో ఆర్‌బీఐ ప్రామాణిక వడ్డీ (రెపో) రేటును తగ్గించకపోవచ్చని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. ఫెడరల్ రిజర్వ్ నాలుగేళ్లకు పైగా కాలం తర్వాత తొలిసారిగా ప్రామాణిక వడ్డీ రేటును తగ్గించింది. దాంతో మిగతా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు కూడా వడ్డీ రేట్ల కోతకు శ్రీకారం చుట్టవచ్చన్న అంచనాలున్నాయి. అయితే, ఈ విషయంపై శెట్టి కొంత భిన్నంగా స్పందించారు. "వడ్డీ రేట్ల విషయంలో చాలా సెంట్రల్ బ్యాంక్‌లు దేశీయ పరిస్థితులకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటున్నాయి. ఫెడ్ రేట్ల తగ్గింపు అందరినీ ప్రభావితం చేయనున్నప్పటికీ, ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకునే రెపో రేటు పై నిర్ణయం తీసుకోనుందని మేం భావిస్తున్నాం. ఈ ఏడాదిలో రెపో రేటు తగ్గింపు ఉండకపోవచ్చని అనుకుంటున్నాం. వచ్చే ఏడాది మార్చి త్రైమాసికం వరకు వేచి చూడాల్సి రావచ్చ"ని శెట్టి అన్నారు.

రికార్డు గరిష్ఠాల నుంచి నష్టాల్లోకి..

సెన్సెక్స్ 131 పాయింట్లు పతనం.. ఐటీ రంగ షేర్లలో లాభాల స్వీకరణ

ఫెడ్ పరపతి సమీక్ష నేపథ్యంలో ఈక్విటీ మదుపరుల అప్రమత్తత

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు బుధవారం ఆరంభ ట్రేడింగ్‌లో సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకినప్పటికీ, మధ్యాహ్నం నుంచి యూటర్న్ తీసుకున్నాయి. చివరికి స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు ఐటీ రంగ షేర్లలో భారీగా లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. కాగా, బ్యాంకింగ్, ఆర్థిక సేవల షేర్లలో కొనుగోళ్లు నష్టాలను పరిమితం చేశాయి. ఒక దశలో సెన్సెక్స్ 246.72 పాయింట్లు ఎగబాకి 83,326.38 వద్ద, నిఫ్టీ 63.65 పాయింట్ల వృద్ధితో 25,482.20 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 131.43 పాయింట్ల నష్టంతో 82,948.23 వద్ద, నిఫ్టీ 41 పాయింట్లు కోల్పోయి 25,377.55 వద్ద స్థిరపడ్డాయి.

సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 నష్టపోయాయి. టీసీఎస్ 3.49 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్ షేర్లూ 3 శాతానికి పైగా క్షీణించాయి. టెక్ మహీంద్రా 2.79 శాతం పతనమైంది.

ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9 లక్షల కోట్లు

ప్రైవేట్ రంగ ఐసీఐసీఐ బ్యాంక్ షేరు ఒక దశలో 2 శాతం ఎగబాకి ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.1,295కు చేరింది. చివరికి 1.55 శాతం లాభంతో రూ.1,288.05 వద్ద ముగిసింది. తాజా ర్యాలీలో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14,921 కోట్ల పెరుగుదలతో రూ.9,07,391.45 కోట్లకు చేరుకుంది. బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.9 లక్షల కోట్ల మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్లో ఐదో అత్యంత విలువైన కంపెనీగా కొనసాగుతోంది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.10,000 కోట్ల ఐపీఓ

దేశంలో అతిపెద్ద విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీకి చెందిన పునరుత్పాదక ఇంధన విభాగం 'ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ' పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. ఐపీఓలో తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.10,000 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి కంపెనీ ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.7,500 కోట్లను రుణాల తిరిగి చెల్లింపుల కోసం ఉపయోగించనున్నట్లు తెలిపింది. మిగతా నిధులను వ్యాపార అవసరాల కోసం వినియోగించుకోనుంది. ఈ ఆగస్టు నాటికి ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ 3,071 మెగావాట్ల సోలార్, 100 మెగావాట్ల పవన్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది.

ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్‌లో 'కేర్' విలీనం!

తుది దశకు చేరిన చర్చలు

ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు బ్లాక్‌స్టోన్, టీపీజీ సంస్థల నిర్వహణలోని కేర్ హాస్పిటల్ రివర్స్ మెర్జర్‌కు సిద్ధమవుతోంది. ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ లిమిటెడ్ అనే లిస్టెడ్ కంపెనీలో విలీనమయ్యేందుకు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ రెండు సంస్థల ఈక్విటీల్లోనూ బ్లాక్‌స్టోన్ పీఈ సంస్థకు మెజారిటీ వాటా ఉంది. ఈ చర్చలు ఫలిస్తే అపోలో హాస్పిటల్స్, మణిపాల్ హాస్పిటల్స్ తర్వాత ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ లిమిటెడ్ దేశంలో అత్యధిక పడకలు ఉన్న మూడో అతిపెద్ద హాస్పిటల్ చైన్ అవుతుంది. ప్రస్తుతం కేర్ హాస్పిటల్ ఈక్విటీలో బ్లాక్‌స్టోన్‌కు 73 శాతం, టీపీజీ గ్రూప్‌నకు 27 శాతం వాటా ఉంది. కేర్ హాస్పిటల్ ప్రస్తుతం భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌లోనూ హాస్పిటల్స్ నిర్వహిస్తోంది. కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హెల్త్) కూడా కేర్ అనుబంధ సంస్థగానే పనిచేస్తోంది. ఈ హాస్పిటల్ ఈక్విటీలో మెజారిటీ వాటాను బ్లాక్‌స్టోన్ సంస్థ గత ఏడాది అక్టోబరులో కొనుగోలు చేసింది.

తెలంగాణలో ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ

రూ.204 కోట్ల పెట్టుబడితో శామీర్‌పేటలో ఏర్పాటు: హెరిటేజ్ ఫుడ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఐస్‌క్రీమ్స్ ఉత్పత్తి కోసం కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేటలో రూ.204 కోట్ల పెట్టుబడితో ఈ కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనుంది. బుధవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకుంటారు. వచ్చే ఏడాది నవంబరుకల్లా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. తెలంగాణ ప్రాంతంలో ఐస్‌క్రీమ్స్‌కు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది.

బెంగళూరుకు యశోద హాస్పిటల్

రూ.344 కోట్లతో 4.5 ఎకరాల కొనుగోలు

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న యశోద హాస్పిటల్ తన కార్యకలాపాలను బెంగళూరుకు విస్తరిస్తోంది. ఇందుకోసం బెంగళూరు రింగ్ రోడ్డులోని సిల్క్ బోర్డు జంక్షన్ ప్రాంతంలో రూ.344 కోట్లతో 4.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అనేక ప్రముఖ కంపెనీల ఆఫీసులు ఉండే ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర అని భావిస్తున్నారు. తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉన్న బెంగళూరు రియల్ ఎస్టేట్ కంపెనీ ఓజోన్ గ్రూప్ నుంచి యశోద హాస్పిటల్ ఈ భూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిలో ఓజోన్ గ్రూప్ 12 లక్షల ఎస్‌ఎఫ్‌టీలో భవనాలు నిర్మించి యశోద హాస్పిటల్‌కు అప్పగిస్తుంది. యశోద హాస్పిటల్ ఇందుకు మరిన్ని నిధులు సమకూరుస్తుంది. అయితే ఈ భూమి కొనుగోలు వార్తలపై యశోద హాస్పిటల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

త్వరలో రెనో నిస్సాన్ కొత్త కారు

చెన్నై: ఫ్రెంచి, జపాన్ ఆటో దిగ్గజాల అలయెన్స్ రెనో నిస్సాన్ ప్లాట్‌ఫామ్‌పై రెండు విద్యుత్ కార్లు సహా ఆరు కొత్త కార్ల తయారీ కార్యకలాపాలు అనుకున్న ప్రణాళిక ప్రకారం సంతృప్తికరంగానే సాగుతున్నట్టు రెనో ఇండియా కంట్రీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ మామిళ్లపల్లి వెంకట్రామ్ అన్నారు. ఈ కార్ల ఉత్పత్తిపై రెనో నిస్సాన్ జాయింట్ వెంచర్ రూ.5,300 కోట్లు పెట్టుబడి పెడుతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో రెనో నిస్సాన్ ఈ పెట్టుబడిని ప్రకటించాయి. ఆ మొత్తంలో 70 నుంచి 80 శాతం ఇప్పటికే పెట్టుబడి పెట్టినట్టు ఆయన చెప్పారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు కింద కొత్త కారు విడుదల ప్రకటన వింటారని రెనో నైట్ అండ్ డే లిమిటెడ్ ఎడిషన్ కార్ల విడుదల కార్యక్రమానికి హాజరైన విలేకరులకు ఆయన తెలిపారు. అయితే కొత్త కారు ఎప్పుడు విడుదల చేయబోయేది చెప్పడానికి ఆయన నిరాకరించారు. బుధవారం విడుదల చేసిన లిమిటెడ్ ఎడిషన్ కింద కేవలం 1,600 కార్లు ఉత్పత్తి చేస్తామని, ఎవరు ముందొస్తే వారికి అనే ప్రాతిపదికన వాటిని విక్రయిస్తామని వెంకట్రామ్ చెప్పారు. కస్టమర్ల స్పందన బాగున్నట్టయితే మరిన్ని కార్లు తయారుచేసే విషయం పరిశీలించనున్నట్టు తెలిపారు. లిమిటెడ్ ఎడిషన్ క్విడ్ కారు ధర రూ.4,99,500 కాగా లిమిటెడ్ ఎడిషన్ ట్రైబర్ ధర రూ.7 లక్షలని, కైగర్ ధర రూ.6,74,990 అని ఆయన వెల్లడించారు.

ఎంఎస్‌ఎంఈల కోసం టాలీప్రైమ్ 5.0

టాలీ సొల్యూషన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్‌ఎంఈ) సంస్థలకు వ్యాపార నిర్వహణ సాఫ్ట్‌వేర్ సేవలందిస్తున్న టాలీ సొల్యూషన్స్. టాలీప్రైమ్ 5.0 పేరుతో సరికొత్త సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. కనెక్టెడ్ జీఎస్‌టీతో తీసుకువచ్చిన ఈ కొత్త వెర్షన్ జీఎస్‌టీ పోర్టల్‌లో లాగిన్ కాకుండానే అన్ని రకాలైన జీఎస్‌టీ సంబంధిత కార్యకలాపాలను నిర్వహించే వీలుందని సంస్థ సౌత్ జోన్ హెడ్ అనిల్ భార్గవన్ తెలిపారు. ఏపీఐ ఆధారిత పన్ను ఫైలింగ్ విధానంతో వ్యాపార సంస్థలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎంఎస్‌ఎంఈ రంగం శరవేగంగా విస్తరిస్తోందని, వారి వ్యాపార, పన్ను సంబంధిత వ్యవహారాలను సులభతరం చేసే ఉద్దేశంతో కొత్త పన్ను సొల్యూషన్‌ను తీసుకువచ్చినట్లు అనిల్ తెలిపారు. ప్రస్తుతం టాలీ సొల్యూషన్స్‌కు తెలంగాణలో 72,000, ఏపీలో 45,000 మంది వినియోగదారులు ఉన్నారు. 2026-27 నాటికి ఈ సంఖ్యను తెలంగాణలో లక్షకు, ఏపీలో 60 వేలకు చేర్చుకోవాలని చూస్తున్నట్లు చెప్పారు.

సహారా డిపాజిటర్లకు ఊరట

రూ.50,000 వరకు రిఫండ్

న్యూఢిల్లీ: సహారా గ్రూప్ కోఆపరేటివ్ సొసైటీస్ డిపాజిటర్లకు పెద్ద ఊరట లభించింది. వీరి రిఫండ్ పరిమితిని ప్రభుత్వం రూ.10,000 నుంచి రూ.50,000కు పెంచింది. సీఆర్‌సీఎస్-సహారా రిఫండ్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 4.29 లక్షల మంది డిపాజిటర్లకు చెల్లించేందుకు ప్రభుత్వం రూ.370 కోట్లు విడుదల చేసింది. రిఫండ్ పరిమితిని రూ.50,000కు పెంచడంతో ఏర్పడే అదనపు చెల్లింపుల కోసం ప్రభుత్వం పది రోజుల్లో రూ.1,000 కోట్లు విడుదల చేయనుంది. ఈ పెంపుతో చిన్న డిపాజిటర్లు అనేక మందికి మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

ఐఎస్‌బీ నుంచి 'పీజీపీ వైఎల్' కోర్సు

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) యంగ్ లీడర్స్ కోసం మరో సరికొత్త కోర్సు ప్రారంభించింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ (పీజీపీ-వైఎల్) పేరుతో 20 నెలల కోర్సు ప్రవేశపెట్టింది. డిగ్రీ పూర్తి చేసి, రెండేళ్ల కనీస ఉద్యోగ అనుభవం ఉన్న నిపుణులు ఈ కోర్సుకు అర్హులు. ఈ 20 నెలల పీజీపీ-వైఎల్ కోర్సులో చేరిన అభ్యర్థులు తప్పనిసరిగా రెండు నెలల సమ్మర్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది నుంచి ఈ కోర్సు ప్రారంభమవుతుంది.

అరబిందో చేతికి జీఎల్ఎస్ ఫార్మా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్యాన్సర్ ఔషధాల మార్కెట్లో అరబిందో ఫార్మా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ రంగంలో మంచి పట్టున్న జీఎల్ఎస్ ఫార్మా ఈక్విటీలో మిగిలిన 49 శాతం వాటాను రూ.22.5 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. ఇందుకోసం అరబిందో ఒక్కో షేరుకు రూ.381.12 చొప్పున చెల్లించనుంది. ఈ ఏడాది చివరికల్లా ఈ కొనుగోలు పూర్తవుతుంది. జీఎల్ఎస్ ఫార్మా ప్రమోటర్ సురేశ్ పారక్, అతని కుటుంబ సభ్యుల నుంచి 51 శాతం వాటాను అరబిందో ఫార్మా 2022 జూన్‌లోనే కొనుగోలు చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,730 ▼	68,500 ▼	96,000 ▼
ముంబై	73,257 ▼	67,103 ▼	87,406 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	545
వరంగల్	512	గోదావరి	540
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	116
కరీంనగర్	105	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	110
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	103	అనంతపురం	110
గోదావరి	113		

స్పోర్ట్స్

భారత్‌కు బంగ్లా స్పిన్ 'పరీక్ష'

నేటి నుంచే తొలి టెస్ట్



రోహిత్

పంత్, రాహుల్‌కు చోటు! | **ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్ 18లో**



బంగ్లా కెప్టెన్ శంటో

చెన్నై: వైట్‌బాల్ క్రికెట్‌లో బిజీబిజీగా గడిపిన భారత్.. సుమారు ఆరు నెలల తర్వాత టెస్టు మ్యాచ్ బరిలోకి దిగనుంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి జరిగే తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో రోహిత్ సేన తలపడనుంది. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్న టీమిండియాకు బంగ్లా స్పిన్నర్ల నుంచి గట్టి సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. ఇటీవలే పాకిస్థాన్‌ను వారి సొంతగడ్డపై 2-0తో చిత్తు చేసిన ఆత్మవిశ్వాసంతో ఉన్న బంగ్లా మరో సంచలనం సృష్టించాలనుకొంటోంది. అయితే, స్వదేశంలో భారత్‌ను ఓడించడం పాక్‌ను చిత్తు చేసినంత సులువు కాదన్న విషయం వారికీ తెలుసు. పైగా రోహిత్, కోహ్లీతోపాటు రిషబ్ పంత్ మళ్లీ జట్టులోకి రావడంతో భారత్ బలంగా కనిపిస్తోంది. 2015 నుంచి సొంతగడ్డపై టీమిండియా బ్యాటింగ్‌కు విరాట్ వెన్నెముకగా నిలుస్తున్నాడు. అయితే, 2021 నుంచి మాత్రం స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఆడలేక పోతున్నాడు. టీ20లకు గుడ్‌బై చెప్పిన కోహ్లీ.. ఈసారి మాత్రం అద్భుత ప్రదర్శనతో పరుగుల వరద పారించాలన్న పట్టుదలతో ఉన్నాడు. ఒకప్పుడు స్పిన్నర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించే రోహిత్ నుంచి ఆస్థాయి ప్రదర్శన కరువైంది. ఇక, మిడిలార్డర్‌లో రాహుల్‌కు చోటు ఖాయంగా కనిపిస్తోంది. ఎటువంటి బౌలింగ్‌నైనా రాహుల్ సమర్థవంతంగా ఎదుర్కోగలడు. కానీ, ఇటీవలి కాలంలో పెద్దగా ఫామ్‌లో లేకపోవడంతో అతడు క్రీజులో ఎక్కువ సమయం గడిపేలా ఆడడం ఎంతో అవసరం. పంత్ ఎదురుదాడి గురించి పెద్దగా చెప్పనక్కర్లేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్, గిల్ కూడా మెలికలు తిరిగే బంతులను ఎదుర్కోవడంలో బోల్తా పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నెట్స్‌లో వీరు తన నైపుణ్యాలను మెరుగుపరచుకొనేందుకు శ్రమించారు. బౌలింగ్ విభాగానికొస్తే చెన్నై పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని ముగ్గురు స్పిన్నర్లు అశ్విన్, జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు తుది జట్టులో చోటు దక్కే చాన్సులున్నాయి. పేస్ భారాన్ని బుమ్రా, సిరాజ్ మోయనున్నారు. కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ హయంలో ఇదే తొలి టెస్ట్ కావడంతో అతడికి ఈ మ్యాచ్ కీలకంగా మారింది.

అవకాశం కోసం బంగ్లా

మరోవైపు బంగ్లా కూడా అవకాశం చిక్కితే ఆతిథ్య జట్టుకు షాకివ్వాలనే కసితో ఉంది. పాక్‌పై సంచలన విజయంలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్లు మెహిదీహసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం మరోసారి అదే తరహా ప్రదర్శన కనబరచాలని జట్టు భావిస్తోంది. ఆల్‌రౌండర్ షకీబల్ హసన్‌కు భారత పిచ్‌లపై ఆడిన అనుభవం ఎంతో ఉంది. బ్యాటింగ్‌లో లిట్టన్ దాస్, కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షంటో, మోమినుల్ ఇస్లాం అండగా నిలుస్తున్నారు. మొత్తంగా చూస్తే భారత బ్యాటింగ్.. బంగ్లా స్పిన్నర్లకు మధ్య ప్రధానంగా పోటీ జరిగే అవకాశం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, జైస్వాల్, గిల్, కోహ్లీ, రాహుల్, పంత్, జడేజా, అశ్విన్, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.

బంగ్లాదేశ్: షద్మన్ ఇస్లాం, జాకిర్ హసన్, నజ్ముల్ హొస్సేన్ షంటో (కెప్టెన్), మోమినుల్ ఇస్లాం, ముష్ఫికర్, లిట్టన్ దాస్ (వికెట్ కీపర్), షకీబల్, మెహిదీహసన్ మిరాజ్, టస్కిన్, హసన్ మెహమూద్, నహీద్ రాణా/తైజుల్.

పిచ్/వాతావరణం

ఎర్రమట్టి పిచ్ కావడంతో తొలిరోజు బౌన్స్ లభించినా.. పేసర్లు, స్పిన్నర్లకు సమంగా సహకరించొచ్చు. మ్యాచ్ సాగే కొద్దీ బంతి టర్న్ కావచ్చు. తొలిరోజు వర్షం ఆటంకం కలిగించొచ్చు. ఉదయం వాన కురిసే చాన్స్ 25 శాతం ఉండగా.. మధ్యాహ్నం 46 శాతంగా ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.



632 రోజుల తర్వాత

వికెట్ కీపర్ రిషభ్ పంత్ 632 రోజుల తర్వాత టెస్టుల్లోకి పునరాగమనం చేయనున్నాడు. 2022లో బంగ్లాతో అతడి చివరి టెస్ట్ ఆడాడు. ఆ తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పంత్ వేగంగా కోలుకొన్నాడు. రీఎంట్రీలో ఇప్పటి వరకు పరిమిత ఓవర్ల క్రికెట్ మాత్రమే ఆడాడు. యాదృచ్ఛికంగా మళ్లీ బంగ్లాపైనే ఆడనున్నాడు.

0 భారత్‌తో బంగ్లా ఇప్పటి వరకు 13 టెస్టులు ఆడినా ఒక్కసారి కూడా నెగ్గలేదు. టీమిండియా 11 మ్యాచ్‌లు గెలవగా.. రెండు డ్రాగా ముగిశాయి.

17 2012 నుంచి స్వదేశంలో ఆడిన 17 సిరీస్‌ల్లో టీమిండియాకు ఓటమన్నదే లేదు. గత 11 ఏళ్లలో సొంతగడ్డపై 40 మ్యాచ్‌లు నెగ్గిన భారత్.. నాలుగు మాత్రమే ఓడింది.



విజయకృష్ణ (మధ్య)

సైక్లిస్ట్ విజయ్ అరుదైన ఘనత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): లద్దాఖ్ రాండనీర్స్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించిన 200 కిలోమీటర్ల సైక్లింగ్ ఈవెంట్‌ను హైదరాబాద్ సైక్లిస్ట్ ఎస్.టి.పి విజయవంతంగా పూర్తి చేశాడు. సముద్ర మట్టానికి 11,800 అడుగుల ఎత్తులో జరిగిన ఈ ప్రపంచ ఎత్తయిన బీఆర్ఎం సైక్లింగ్ ఈవెంట్‌లో ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించి విజయకృష్ణ లక్ష్యాన్ని చేరాడు. ఇక, ఇదే ఈవెంట్‌లోని 400 కి.మీ. విభాగంలో పాల్గొన్న హైదరాబాదీలు శశికాంత్, ఈఏఎస్ రెడ్డి లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు.

'కామన్వెల్త్' లిఫ్టింగ్‌లో అక్కాచెల్లెళ్ల సత్తా



భార్గవి, హారిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు బెల్లన హారిక (17), భార్గవి (15) మూడు పతకాలు కొల్లగొట్టారు. ఫిజీలో బుధవారం జరిగిన ఈ పోటీల్లో భారత వెయిట్‌లిఫ్టర్లు ఓవరాల్‌గా 11 స్వర్ణాలు, 3 రజతాలు గెలిచారు. విజయనగరం జిల్లా కొండవెలగడకు చెందిన హారిక 64 కిలోల యూత్, జూనియర్ విభాగాల్లో 2 రజతాలు సాధించింది. భార్గవి యూత్ 49 కిలోల విభాగంలో రజతం నెగ్గింది.

చైనా ఓపెన్‌లో మాళవిక సంచలనం

చాంగ్జౌ (చైనా): పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, వరల్డ్ నెంబర్ 7 గ్రెగోరియా (ఇండోనేసియా)కు భారత షట్లర్ మాళవిక బన్సోడ్ చైనా ఓపెన్‌లో షాకిచ్చింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో మాళవిక 26-24, 21-19తో గ్రెగోరియాను చిత్తు చేసింది. మాళవిక కెరీర్‌లో ఇదే అతిపెద్ద విజయం. మిగతా భారత షట్లర్లలో ఆకర్షి, సావియా, కిరణ్ జార్జ్, డబుల్స్‌లో గాయత్రి-ట్రీసా జోడీ, మిక్స్‌డ్‌లో సిక్కి-సుమీత్ జంట తొలిరౌండ్లోనే నిష్క్రమించారు.

సౌతాఫ్రికాకు అఫ్ఘానిస్థాన్ ఝలక్

షార్జా: తొలి వన్డేలో దక్షిణాఫ్రికాకు అఫ్ఘానిస్థాన్ షాకిచ్చింది. మూడు వన్డేల్లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ ఆరు వికెట్లతో విజయం సాధించింది. తొలుత సౌతాఫ్రికా 33.3 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. వియాన్ ముల్డెర్ (52) హాఫ్ సెంచరీతో ఆదుకున్నాడు. ఫజల్‌హక్ ఫారూఖీ (4/35) నాలుగు, ఘజన్‌ఫర్ (3/20) మూడు వికెట్లు పడగొట్టారు. స్వల్ప లక్ష్యాన్ని అఫ్ఘానిస్థాన్ 26 ఓవర్లలో 107/4 స్కోరుతో ఛేదించింది. గుల్బదిన్ (34 నాటౌట్), అజ్మతుల్లా (25 నాటౌట్) రాణించారు. అంతర్జాతీయ క్రికెట్ అన్ని ఫార్మాట్లలో సఫారీలపై అఫ్ఘానిస్థాన్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం.

గౌతీ 'చాలీసా'.. కోహ్లీ 'శివనామ' స్మరణ

న్యూఢిల్లీ: ఢిల్లీవాలాలు కోహ్లీ, గంభీర్ ఇద్దరూ దూకుడైన స్వభావం కలిగిన వ్యక్తులు. మైదానంలో కోహ్లీ దుందుడుకుగా వ్యవహరించినా.. బయట సరదాగా ఉంటాడు. గౌతీ మాత్రం ఎక్కడైనా ఆవేశంగానే కనిపిస్తాడు. అయితే, దేవుడిని నమ్మే విషయంలో ఇద్దరిదీ ఒకే పంథా. బీసీసీఐ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ, గౌతీ కొన్ని జ్ఞాపకాలను పంచుకొన్నారు. అలా విషయం క్రికెట్ నుంచి ఆధ్యాత్మికత వైపు మళ్లింది. 2009లో నేపియర్‌లో న్యూజిలాండ్‌తో టెస్ట్‌లో భారత్ క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు గంభీర్ రెండు రోజులకు పైగా బ్యాటింగ్ చేసి జట్టును ఘోర ఓటమి నుంచి తప్పించాడు. అప్పుడు మానసిక బలం కోసం తాను 'హనుమాన్ చాలీసా'ను చదువుకొనేవాడినని.. డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా అదే పెట్టుకొని వినేవాడినని చెప్పాడు. ఇక 2014లో ఆస్ట్రేలియాతో సిరీస్‌లో కోహ్లీ పరుగుల వరద పారించాడు. అప్పుడు తాను కూడా ప్రతి బంతికి 'ఓం నమః శివాయ' అని మనసులో అనుకొనే వాడినని కోహ్లీ అప్పట్లో తనకు చెప్పిన విషయాన్ని గంభీర్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. అవును నిజమేనన్నట్టుగా విరాట్ తలాడించాడు.

'పంజాబ్' చీఫ్ కోచ్ పాటింగ్

న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాటింగ్ నియమితుడయ్యాడు. ట్రెవర్ బేలిస్ స్థానంలో నాలుగేళ్లపాటు అతడు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడని పంజాబ్ యాజమాన్యం బుధవారం ప్రకటించింది. కాగా, ఏడేళ్లుగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు పాంటింగ్ సేవలందించాడు. పంజాబ్ ఇప్పటిదాకా ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ నెగ్గలేదు. 2014లో ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది.

దులీప్ ట్రోఫీ ఫైనల్ రౌండ్ నేటినుంచి

అనంతపురంలో పోటీలు

అనంతపురం క్లాక్ టవర్ (ఆంధ్రజ్యోతి): దులీప్ ట్రోఫీ ఆఖరి రౌండ్ గురువారం మొదలవనుంది. దీంతో రెడ్‌బాల్ క్రికెట్‌లో సత్తా నిరూపించుకునేందుకు శ్రేయాస్ అయ్యర్, సంజూ శాంసన్, రియాన్ పరాగ్, రింకూ సింగ్‌లకు ఇది మరో అవకాశం. ముఖ్యంగా.. బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు ఎంపిక కాలేకపోయిన ఇండియా-డి కెప్టెన్ శ్రేయాస్‌కు కీలకం. ఫైనల్ రౌండ్‌లో భాగంగా ఇండియా-ఎతో 'సి', ఇండియా-డితో 'బి' జట్లు తలపడతాయి.

కమిందు శతకం

శ్రీలంక 302/7

కివీస్‌తో తొలి టెస్టు

గాలె: యువ బ్యాటర్ కమిందు మెండిస్ (114) అద్భుత ఫామ్ కొనసాగిస్తూ శతకం బాదాడు. దాంతో న్యూజిలాండ్‌తో బుధవారం ప్రారంభమైన తొలి టెస్ట్‌లో మొదటి రోజు ఆఖరికి శ్రీలంక 302/7 స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న 106 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయిన దశలో కమిందు.. మాథ్యూస్ (36)తో కలిసి ఐదో వికెట్‌కు 72, కుశాల్ మెండిస్ (50) జతగా ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించాడు. రమేష్ మెండిస్ (14), ప్రభాత్ జయసూర్య (0) క్రీజులో ఉన్నారు. రూర్క్ 3, గ్లెన్ 2 వికెట్లు పడగొట్టారు.

లెబనాన్‌లో మళ్లీ పేలుళ్లు

- కార్లలో ఎఫ్ఎం రేడియోలు.. ఇళ్లలో గృహోపకరణాల విస్ఫోటం
- 9 మంది దుర్మరణం.. 300 మందికి గాయాలు
- అన్ని వేళ్లూ ఇజ్రాయెల్ వైపు..


లెబనాన్ ప్రయోగించిన రాకెట్లను గాల్లోనే ధ్వంసం చేస్తున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ

బీరుట్, సెప్టెంబరు 18: పేజర్ల విస్ఫోటాలతో కల్లోలంగా మారిన లెబనాన్‌లో.. మరోమారు ఏకకాలంలో మూకుమ్మడి పేలుళ్లు సంభవించాయి. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో.. వాకీటాకీలు, కార్లలోని ఎఫ్ఎం రేడియోలు.. ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు.. ముఖ్యంగా సౌరశక్తితో పని చేసే పరికరాలు పేలిపోయాయి. ఈ పరికరాలన్నీ అయిదారు నెలలకు ముందు కొనుగోలు చేసినవే.! మంగళవారం నాటి ఘటనల్లో మృతిచెందిన హిజ్బుల్లా నేతల అంత్యక్రియల్లో కూడా పేలుళ్లు సంభవించాయి. లెబనాన్ వ్యాప్తంగా జరిగిన వేర్వేరు విస్ఫోటాల్లో.. 9 మంది మృతిచెందగా.. 300 మంది తీవ్రంగా గాయపడ్డారు. లెబనాన్ కాలమానం ప్రకారం.. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఏకకాలంలో బీరుట్ సహా.. దక్షిణ లెబనాన్ వరకు పేలుళ్లు సంభవించాయి. దక్షిణ లెబనాన్‌లోని దహియా, మౌంట్ లెబనాన్, సిడాన్, మార్జ్ అయున్, అల్-అజియా, అల్-సర్ఫాండ్, బెకా లోయలోని బాల్‌బెక్‌లో వీటి తీవ్రత ఎక్కువగా ఉందని లెబనాన్, ఇరాన్ మీడియా సంస్థలు వెల్లడించాయి. కొన్ని చోట్ల.. వాకీటాకీలు నడుముకు పెట్టుకుని, ద్విచక్రవాహనాలపై వెళ్తున్నవారు.. పేలుళ్ల ధాటికి చూస్తుండగానే అగ్నికి ఆహుతయ్యారని.. మరికొందరి మృతదేహాలు గుర్తించడానికి కూడా వీల్లేని విధంగా కాలిపోయాయని పేర్కొన్నాయి. దక్షిణ లెబనాన్‌లో పలు ఇళ్లకు ఐదారు నెలల క్రితం సౌరశక్తి సేవలను అందించారని, వాటి బ్యాటరీలు, స్టెబిలైజర్లు సైతం పేలిపోయినట్లు లెబనాన్ నేషనల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.


పేలుడులో కాలిపోయిన స్కూటర్

ట్రాకింగ్‌కు దొరకొద్దనే..

ఇజ్రాయెల్ నిఘావర్గాలు మొబైల్ ఫోన్ సెల్‌టవర్ సిగ్నల్ ట్రాకింగ్, ట్యాపింగ్‌లతో పలువురు హిజ్బుల్లా నేతలను మట్టుబెట్టారు. దీంతో హిజ్బుల్లా సెల్‌ఫోన్లను కాకుండా.. పేజర్లు, వాకీటాకీలపై ఆధారపడింది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత.. పేజర్ల వినియోగాన్ని మరింతగా పెంచాయి. ఈ ఏడాది ఆరంభంలో తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో అనే కంపెనీ నుంచి 5వేల వరకు పేజర్లను ఆర్డర్ చేశాయి. వాటిని ఇటీవలే హిజ్బుల్లా తమ ఫైటర్లకు అందజేసింది. కొత్తగా వాకీటాకీలను కొనుగోలు చేసింది. ఎఫ్ఎం సిగ్నల్ ట్యాంపరింగ్ పరికరాలతో కార్లలో, ఇళ్లలో వాడే ఎఫ్ఎం పరికరాల్లోకి చొరబడి, తమ సందేశాలను పౌరులకు చేరవేస్తోందనే వాదనలున్నాయి. ఇప్పుడా ప్రత్యామ్నాయాలే హిజ్బుల్లా పాలిట మృత్యువుగా మారుతున్నాయి. పేజర్లు, వాకీటాకీలు పేలి.. మరణాలు సంభవించాయి.

పేజర్లలో పేలుడు చిప్

మంగళవారం జరిగిన దాడిలో 3 వేల వరకు పేజర్లు పేలిపోయినట్లు హిజ్బుల్లా వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. మిగతా వాటిని పరిశీలిస్తే.. అన్నింటిలో లిథియం అయాన్ బ్యాటరీలతోపాటు.. పేజర్ సర్క్యూట్‌తో సంబంధం లేని ఓ మైక్రోచిప్ కనిపించిందని, అందులో పీఈటీఎన్ పేలుడు పదార్థం ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నాయి. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌పై ఆరోపణ చేస్తూ.. ఆ దేశంపై ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించాయి. మరోవైపు ఈ ఆల్ఫా-న్యూమరిక్ పేజర్లను తయారు చేసిన తైవాన్ కంపెనీ గోల్డ్ అపోలో మాత్రం తమకేపాపం తెలియదని ప్రకటన చేసింది. బీఏసీ అనే హంగరీ దేశ కంపెనీ ఏఆర్ 924 మోడల్ పేజర్లను తయారు చేస్తుందని, తాము బ్రాండింగ్ మాత్రమే ఇస్తామని పేర్కొంది. హిజ్బుల్లా వర్గాలు, లెబనాన్ సర్కారు మాత్రం.. పీఈటీఎన్ పేలుడు పదార్థాన్ని విరివిగా వినియోగించే చరిత్ర మొస్సాద్‌కు ఉందని గుర్తు చేస్తున్నాయి. కాగా.. మంగళవారం నాటి పేలుళ్ల ఘటనల్లో మృతుల సంఖ్య 12కు చేరుకుందని, 3 వేలకు పైగా క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫెరాస్ అల్ అబిద్ వెల్లడించారు.

తీవ్రత ఎక్కువే..!

పీఈటీఎన్ పేలుడు పదార్థం తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని బాంబు నిపుణులు చెబుతున్నారు. 10 గ్రాముల పీఈటీఎన్ ప్రభావం.. పేలుడు జరిగిన ప్రదేశం నుంచి 'వీ' ఆకారంలో.. పైకి 10 మీటర్ల ఎత్తు వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.45 సమయంలో(లెబనాన్ కాలమానం ప్రకారం) మూకుమ్మడిగా పేలుళ్లు జరిగాయి. అంతకు 10 సెకన్ల ముందు అన్ని పేజర్లకు ఒకేసారి సందేశాలు వచ్చాయి. వాటిని చదివేందుకు పేజర్లను ముఖానికి దగ్గరగా తీసుకున్న వారికి తీవ్ర గాయాలైనట్లు లెబనాన్ వైద్య వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంతోనే.. లెబనాన్‌లో ఇరాన్ రాయబారి ముజ్తబా అమానీ ఒక కంటిని పోగొట్టుకున్నారని, రెండో కన్ను తీవ్రంగా దెబ్బతిన్నదని పేర్కొన్నాయి. 12 మంది మృతుల్లో ఇద్దరు చిన్నారులను మినహాయిస్తే.. మిగతా వారంతా హిజ్బుల్లా నాయకులే.! వారి ఫొటోలను హిజ్బుల్లా బుధవారం విడుదల చేసింది. బుధవారం నాటి మరణాల్లోనూ నలుగురైదుగురు హిజ్బుల్లా నేతలున్నాయి. 3,300 మందికి పైగా క్షతగాత్రుల్లోనూ హిజ్బుల్లా ఫైటర్లు, సానుభూతిపరులు, నాయకులు ఉన్నారు.

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తత!

పేజర్ బాంబుల ఘటనతో పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంటోంది. ప్రతీకారం తీర్చుకుంటామని హిజ్బుల్లా ఇప్పటికే ప్రకటించగా.. ఇరాన్ కూడా ప్రతిస్పందనకు సిద్ధమని హెచ్చరించింది. ఈజిప్టు అధ్యక్షుడు ఫతాహ్ ఎల్‌సిసీ కూడా బుధవారం కైరోలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్‌తో చర్చలు జరిపిన సందర్భంలో లెబనాన్‌కు అండగా ఉంటామన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) అప్రమత్తమైంది. కమాండో బ్రిగేడ్, పారాట్రూపర్స్‌లను లెబనాన్ సరిహద్దుల్లో మోహరించింది. హిజ్బుల్లాతో యుద్ధాన్ని తీవ్రతరం చేసే సూచనలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.



కొత్త మోడల్ వాకీటాకీలే

కొత్తగా తెప్పించిన పేజర్లు మంగళవారం పేలిపోయినట్లుగానే.. ఐదారు నెలల క్రితం హిజ్బుల్లా వర్గాలు తెప్పించిన ఐకామ్ కంపెనీకి చెందిన వీ82ఎస్ మోడల్ వాకీటాకీలు బుధవారం విస్ఫోటం చెందాయని అల్-జజీరా కథనాలను ప్రసారం చేసింది. బీరుట్‌లో.. ఒక్క దహియా ప్రాంతంలోనే 15-20 పేలుళ్లు సంభవించి, పలు అపార్ట్‌మెంట్లు, ఇళ్లు దెబ్బతిన్నట్లు పేర్కొంది. దహియాలో.. హిజ్బుల్లా ఎంపీ అలీఅమర్ కుమారుడి అంత్యక్రియల్లోనూ పేలుళ్లు సంభవించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.


రష్యా అణ్వాయుధ కేంద్రం దాడికి ముందు, దాడి తర్వాత ఎగిసిన దట్టమైన పొగ (మాక్సర్ ఉపగ్రహ చిత్రాలు)

భూమి కంపించేలా దాడి

రష్యా అణ్వాయుధ డిపోపై ఉక్రెయిన్ డ్రోన్ల పిడుగు

- పేలిన 240 టన్నుల ఆయుధాలు
- తీవ్రతకు 6 కి.మీ. మేర భూకంపం
- 14 కిలోమీటర్ల దాకా రేడియేషన్

కీవ్, సెప్టెంబరు 18: రష్యా అణ్వాయుధ డిపోపై ఉక్రెయిన్ విరుచుకుపడింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి జరిపిన డ్రోన్ దాడులతో.. ఆయుధ డిపోను నేలమట్టం చేసింది. ఈ డిపోలో అణ్వాయుధాలను మోసుకెళ్లే క్షిపణులు, స్వల్ప శ్రేణి ఇస్కందర్ మిసైల్స్, టోచ్కా-యూ బాలిస్టిక్ క్షిపణులు, గైడెడ్ ఏరియల్ బాంబులు, ఆర్టిలరీ షెల్స్ ఉన్నట్లు ఉక్రెయిన్ వర్గాలు వెల్లడించాయి. రష్యా మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉక్రెయిన్ సరిహద్దులకు 470 కిలోమీటర్లు.. మాస్కోకు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న ట్వెర్ ప్రావిన్స్‌లోని తురుపెట్ గ్రామంలో రష్యా భారీ అణ్వాయుధ డిపో కొనసాగుతోంది. ఈ కేంద్రం వైమానిక దాడులు.. బాలిస్టిక్ క్షిపణి దాడుల నుంచి తట్టుకుంటుంది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ మొదలైన తొలి నాళ్లలో మాస్కో నుంచి పలు అణ్వాయుధాలను ఇక్కడికి తరలించినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉక్రెయిన్ తన సరిహద్దుల్లోని ఐదు వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ ఆయుధాగారాన్ని లక్ష్యంగా చేసుకుని, 52 గైడెడ్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. రష్యాకూడా 46 క్షిపణులను గాల్లోనే పేల్చేసినట్లు ఆ దేశ అధికారిక వార్తాసంస్థ ఆర్ఐఏ పేర్కొంది. అయితే.. మూడు గైడెడ్ క్షిపణులు లక్ష్యాన్ని తాకినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఫలితంగా ఆయుధాగారం అగ్నికి ఆహుతైంది. సుమారు ఆరు కిలోమీటర్ల మేర భూకంపం వచ్చిందా? అన్నట్లుగా భూమి కంపించినట్లు రాయిటర్స్ పేర్కొంది. ఈ ప్రావిన్స్‌లో 11 వేల జనాభా ఉంటుందని, అయితే.. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్పష్టం చేసింది. రష్యా నెటిజన్లు మాత్రం.. పేలుడు ధాటికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల్లోని ఇళ్లు కూలిపోవడం.. పైకప్పులు ఎగిరిపోవడం వంటి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆయుధ డిపోతోపాటు.. ఆర్టిలరీ సిబ్బంది క్వార్టర్స్ కూడా అగ్నికి ఆహుతైనట్లు ఉక్రెయిన్ సైనికవర్గాలు తెలిపాయి. "200 నుంచి 240 టన్నుల మేర శక్తిమంతమైన పేలుళ్లు జరిగాయని భావిస్తున్నాం" అని వివరించాయి. రష్యా ఇటీవల ఉత్తరకొరియా నుంచి తెప్పించిన క్షిపణులనూ ఇక్కడే నిల్వ చేసినట్లు పేర్కొన్నాయి.

రేడియేషన్‌పై ఆందోళన?

నాసా వర్గాలు బుధవారం విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఉక్రెయిన్ మీడియా పేర్కొంది. ఇజ్రాయెల్ మీడియా వైనెట్ కూడా దీనిపై కథనాలు ప్రసారం చేసింది. పేలుడు జరిగిన ప్రాంతం చుట్టూ 14 చదరపు కిలోమీటర్ల మేర రేడియేషన్‌ను గుర్తించినట్లు పేర్కొంది. అయితే.. నాసా అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రం ఈ వివరాలు అందుబాటులో లేవని పలు వార్తాసంస్థలు తెలిపాయి.

'తేజస్'ను నడిపిన మోహన సింగ్!

- మేక్ ఇన్ ఇండియా యుద్ధ విమానానికి తొలి మహిళా పైలట్‌గా ఖ్యాతి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: స్వదేశంలో తయారైన ఎల్‌సీఏ తేజస్ యుద్ధ విమానాన్ని నడిపిన తొలి మహిళా పైలట్‌గా మోహన సింగ్ ఖ్యాతి గడించారు. భారత వైమానిక దళం(ఐఏఎఫ్)కు చెందిన ఎలైట్ 18 ఫ్లయింగ్ బుల్లెట్స్ స్క్వాడ్రన్‌లో చేరిన తొలి మహిళా యుద్ధ విమాన పైలట్‌గానూ ఆమె నిలిచారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఇటీవల నిర్వహించిన యుద్ధ విన్యాసాలు 'తరంగ్ శక్తి'లో ఆమె త్రివిధ దళాల వైస్ చీఫ్‌లతో కలిసి పాల్గొన్నారు. యుద్ధ విమానాల కాక్‌పిట్‌లోకి కూడా మహిళలను అనుమతించాలని 2016లో ప్రభుత్వం నిర్ణయించగా, అదే ఏడాది మోహనసింగ్‌తోపాటు భావనా కాంత్, అవని చతుర్వేది తొలి మహిళా యుద్ధవిమానాల పైలట్లుగా ఐఏఎఫ్‌లో చేరారు. ప్రస్తుతం సు-30 ఎంకేఐ యుద్ధ విమానాలు నడుపుతున్నారు. అదే సమయంలో మిగ్-21 యుద్ధ విమానాలను నడిపిన మోహన సింగ్ ఇటీవలే గుజరాత్ సెక్టార్‌లో పాకిస్థాన్ సరిహద్దున ఉన్న నలియా వైమానిక స్థావరం వద్ద ఎల్‌సీఏ స్క్వాడ్రన్‌గా నియమితులయ్యారు. ఆమె స్వస్థలం రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లా. ఆమె తండ్రి ఐఏఎఫ్‌లో వారెంట్ ఆఫీసర్‌గా పనిచేయగా, ఆమె తాత ఏవియేషన్ రిసెర్చ్ సెంటర్‌లో ఫ్లైట్ గన్నర్‌గా పనిచేశారు.

జెత్వానీ మొబైల్‌ను భద్రపరచండి



- డేటాను యథాతథంగా ఉంచండి
- ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా..
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- విచారణ అక్టోబరు 1 కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను, అందులో ఉన్న డేటాను యథాతథంగా భద్రపరచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. ఉపకరణాలను భద్రపరచాలని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని జెత్వానీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని పిటిషనర్ విద్యాసాగర్‌ను ఆదేశించింది. అదనపు కౌంటర్ దాఖలు చేసేందుకు జెత్వానీకి వెసులుబాటు కల్పించింది. సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలను తదుపరి విచారణ వరకు జెత్వానీకి వెనక్కి ఇవ్వబోమని పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్ చెబుతున్నారని గుర్తు చేసింది. కౌంటర్ వేసేందుకు పోలీసులకు సమయం ఇస్తూ విచారణను అక్టోబరు 1కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీపై ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసు (క్రైమ్‌నం. 90/2024) విషయంలో పోలీసులు ఆధారాలుగా సేకరించి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఆమెకు వెనక్కి ఇవ్వకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ విద్యాసాగర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు వివరాలను ప్రచురించకుండా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలను నిరోధించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం కాదంబరి నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున మీడియా చర్చల్లో పాల్గొనవద్దని, ఇరుపక్షాలు నియంత్రణ పాటించాలని సూచించింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రస్తుతం పోలీసుల వద్దే ఉన్నాయన్నారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి వెనక్కి తెప్పించారని తెలిపారు. సీజ్ చేసిన వస్తువులను సంబంధిత వ్యక్తులకు తిరిగి అప్పగించేందుకు సీఆర్‌పీసీలో వెసులుబాటు ఉందన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. దర్యాప్తులో భాగంగా జప్తు చేసిన వాటిని వెనక్కి ఇచ్చేందుకు సంబంధిత కోర్టు జోక్యం అవసరమన్నారు. చట్టనిబంధనలను మరోసారి పరిశీలించాలని ఏజీని కోరారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పోలీసులు సీజ్ చేసిన మొబైల్ ఫోను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలలో ఉన్న డేటాను పరిశీలించేందుకు తిరిగి వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాలని కోరారు. డేటాను పరిశీలించిన అనంతరం నివేదికను సీల్డ్ కవర్‌లో ట్రయల్ కోర్టు లేదా హైకోర్టుకు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఫోను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలలో ఉన్న డేటాను యథాతథంగా భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. సీజ్ చేసిన పరికరాలను తిరిగి జెత్వానీకి అప్పగించేందుకే ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి తెప్పించారన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించవద్దని కోర్టు ఆదేశించినప్పటికీ జెత్వానీ ఓ ఆంగ్ల చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారన్నారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందుంచారు. ఏజీ స్పందిస్తూ.. సీనియర్ న్యాయవాది వ్యాజ్యంలో పేర్కొనని అంశాలను కోర్టు ముందు ప్రస్తావిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. తదుపరి విచారణ వరకు జప్తు చేసిన వస్తువులను జెత్వానీకి అప్పగించబోమన్నారు. జెత్వానీ తరఫు న్యాయవాదులు వాసిరెడ్డి ప్రభునాథ్, నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపిస్తూ.. పోలీసులు సీజ్ చేసిన వస్తువులను తిరిగి తీసుకొనే అధికారం తమకు ఉందన్నారు. పిటిషనర్ ఆరోపణల్లో అర్థం లేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

నేహారెడ్డి అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేయండి



- రాజకీయ జోక్యంతో చర్యలు ఆపొద్దు: హైకోర్టు
- కూల్చివేతలపై స్టే ఇవ్వడం కుదరదని స్పష్టీకరణ
- కూల్చివేతలను ఆపుతూ ఉత్తర్వుల్లేనందున చర్యలను ఆపాల్సిన అవసరం లేదు
- జీవీఎంసీ అధికారులకు ధర్మాసనం స్పష్టీకరణ
- స్థాయీ నివేదిక సమర్పించాలని ఆదేశం
- విచారణ ఈ నెల 25కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం (భీమిలి) పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి బీచ్‌లో చేపట్టిన నిర్మాణాలన్నిటినీ కూల్చివేయాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. నిర్మాణాలు కూల్చివేయకుండా ఎలాంటి ఉత్తర్వులూ చర్యలేవీ ఆపాల్సిన అవసరం లేదని.. ఏ రాజకీయ జోక్యంతోనూ చర్యలను ఆపవద్దని తేల్చిచెప్పింది. కోర్టు ముందుంచిన ఫొటోలను పరిశీలిస్తే బీచ్‌లోనే నిర్మాణాలు జరిపినట్లు అర్థమవుతోందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో అన్ని అనుమతులతోనే సీఆర్‌జెడ్-2 ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టామన్న పిటిషనర్ వాదనను ఆమోదించలేమని పేర్కొంది. కూల్చివేతలపై స్టే విధించాలన్న వినతిని తిరస్కరించింది. అక్రమ నిర్మాణాల కూల్చివేతపై స్థాయీ నివేదిక (స్టేటస్ రిపోర్ట్) సమర్పించాలని జీవీఎంసీని ఆదేశించింది. విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. భీమిలి పరిధిలోని సీఆర్‌జెడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం.. సముద్రానికి అతిసమీపంలో జరుపుతున్న శాశ్వత నిర్మాణాలను తక్షణం నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. నిర్మాణానికి వినియోగిస్తున్న భారీ యంత్రాలను అక్కడికక్కడే తక్షణం సీజ్ చేయాలని స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు జీవీఎంసీ అధికారులకు వెసులుబాటు ఇచ్చింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత విషయంలో నేహారెడ్డికి వారు నోటీసులు జారీ చేశారు. వీటిని సవాల్ చేస్తూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించారు. దీంతో జీవీఎంసీ అధికారులు సీఆర్‌జెడ్ ప్రాంతంలో ఉన్న కాంక్రీట్ నిర్మాణాలను కూల్చివేయడం ప్రారంభించారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. నేహారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అన్ని అనుమతులతో సీఆర్‌జెడ్-2 ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టామని, సీఆర్‌జెడ్-1 ప్రాంతంలో నిర్మాణాలు చేశామని పిటిషనర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రజాహిత వ్యాజ్యంలో తమను ప్రతివాదిగా చేర్చకుండా కూల్చివేత ఉత్తర్వులు పొందారని తెలిపారు. ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలతో తమ నిర్మాణాలను అధికారులు కూల్చివేస్తున్నారన్నారు. అందుకైన ఖర్చును కూడా చెల్లించాలని అధికారులు కోరుతున్నారని పేర్కొన్నారు. నేహారెడ్డి తండ్రి వైసీపీ రాజ్యసభ ఎంపీగా ఉన్నారని.. రాజకీయ కక్షతో జనసేన కార్పొరేటర్ ప్రజాహిత వ్యాజ్యం వేశారని తెలిపారు. నిర్మాణాల కూల్చివేతకు అధికారులు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ సింగిల్ జడ్జి వద్ద రిట్ దాఖలు చేశామన్నారు. నిర్మాణాలు కూల్చివేయకుండా ఉత్తర్వులివ్వాలని కోరారు.

మీ వాదనలో అర్థం లేదు..

ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. నేహారెడ్డి వేసిన పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారణ జరిపి కూల్చివేతలపై స్టే విధిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వని కారణంగానే అధికారులు కూల్చివేతను ప్రారంభించారని గుర్తుచేసింది. కోర్టు ముందున్న ఫొటోలను పరిశీలిస్తే.. హై టైడ్ ప్రాంతం, బీచ్‌లోనే నిర్మాణాలు చేసినట్లు స్పష్టంగా కనపడుతోందని పేర్కొంది. కూల్చివేతలపై స్టే విధిస్తూ ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమని స్పష్టంచేసింది. నిర్మాణాల అనుమతులు, ఇతర ఫైళ్లను సింగిల్ జడ్జి ముందు ఉంచి.. కూల్చివేతల వ్యవహారాన్ని అక్కడే తేల్చుకోవాలని నేహారెడ్డికి సూచించింది. నిర్మాణాలు కూల్చివేయకుండా ఎలాంటి ఉత్తర్వులూ లేనందున అక్రమ నిర్మాణాలపై తీసుకుంటున్న చర్యలను ఆపాల్సిన అవసరం లేదని జీవీఎంసీ అధికారులకు తేల్చిచెప్పింది. ఏ రాజకీయ జోక్యంతోనూ చర్యలను ఆపవద్దని స్పష్టం చేసింది. కూల్చివేతలపై స్థాయీ నివేదిక సమర్పించాలని తాము ఆదేశించిన విషయాన్ని గుర్తుచేసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. నిర్మాణాలు చేపట్టిన ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించాలని నేహారెడ్డికి జీవీఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చారని.. ఆమె స్పందించలేదని.. ఈ నేపథ్యంలోనే నివేదిక సమర్పించలేకపోయామన్నారు. తదుపరి విచారణ కల్లా కోర్టు ముందుంచుతామని విన్నవించారు.

రోజూ నేతల దర్శనం ప్రజలకు అవసరం లేదు

- రోడ్ల పక్కన ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు
- తొలగింపునకు ఏ చర్యలు తీసుకోవాలో చెప్పండి
- రోడ్ మ్యాప్ మా ముందు ఉంచండి
- అమికస్ క్యూరీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విచ్చలవిడిగా వెలుస్తున్న హోర్డింగ్‌లు/ఫ్లెక్సీలను తొలగించేందుకు ఏ చర్యలు తీసుకుంటే బాగుంటుందో చెప్పాలని కోర్టు సహాయకారి(అమికస్ క్యూరీ) న్యాయవాది వివేక్ చంద్రశేఖర్‌ను బుధవారం హైకోర్టు ఆదేశించింది. కేసు వివరాలు పరిశీలించి రోడ్ మ్యాప్‌ను తమ ముందు ఉంచాలని సూచించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. ప్రతిరోజు పట్టణంలో ఉన్న రాజకీయ నాయకులందరి దర్శనం ప్రజలకు అవసరంలేదని వ్యాఖ్యానించింది. రాజకీయ నాయకులు, సెలబ్రిటీలే కాకుండా సాధారణ ప్రజలు సైతం రోడ్ల పక్కన ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని గుర్తు చేసింది. అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం వల్ల కార్పొరేషన్లు/ మున్సిపాలిటీలు ఆదాయం కోల్పోతున్నాయని ధర్మాసనం పేర్కొంది. అమికస్ క్యూరీ వాదనలు వినిపిస్తూ.... అనధికార హోర్డింగ్‌లు/ఫ్లెక్సీ బ్యానర్ల తొలగింపు విషయంలో హైకోర్టు ధర్మాసనం 2018లో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వివరాలను కోర్టు ముందు ఉంచారు. ధర్మాసనం విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లు, బ్యానర్లను అధికారులు తొలగించకపోవడాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ అగరాల ఈశ్వర్‌రెడ్డి 2018లో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. కోర్టు సహాయకారిగా(అమికస్ క్యూరీ)గా న్యాయవాది వివేక్ చంద్రశేఖర్‌ను నియమించింది.

పోలవరం పరిహారంలో 19.52 కోట్లు పక్కదారి

- ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లపై అభియోగాలు నమోదు

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు పక్కదారి పట్టించారు. ఇప్పటికే ఈ ఘటనలో పలువురు రెవెన్యూ అధికారులపై కేసులు కూడా నమోదు చేశారు. పోలవరం భూ సేకరణ, పరిహారం విభాగంలో పనిచేసిన ఇద్దరు డిప్యూటీ కలెక్టర్‌లపై నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అభియోగాలు నమోదు చేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పది రోజుల్లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ.సిసోడియా ఆదేశించారు. ప్రభుత్వ ఆమోదం, అనుమతి లేకుండా ఇద్దరు డిప్యూటీ కలెక్టర్‌లు బి.శివనారాయణరెడ్డి, మురళి... అనర్హులు, సంబంధం లేని వ్యక్తుల ఖాతాల్లో రూ.19.52 కోట్ల నిధులు జమ అయ్యేలా చేశారని అభియోగాల్లో పేర్కొన్నారు.

వైసీపీ మాజీ ఎంపీ నందిగంపై హత్య కేసు

- తుళ్లూరు పీఎస్‌లో 2020లో సురేశ్‌పై ఫిర్యాదు

తుళ్లూరు, సెప్టెంబరు 18: తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో పరిధిలో 2020లో జరిగిన ఓ హత్య కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ నిందితుడు. 2020 డిసెంబరు 27న మండల పరిధిలోని వెలగపూడిలో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. సురేశ్ అనుచరులు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేయడంతో మొండెం మరియమ్మ మరణించింది. ఈ ఘటనపై అప్పట్లో ఆమె కుమారుడు బాబు.. సురేశ్ సహా ఆయన అనుచరులు 36 మందిపై ఫిర్యాదు చేశారు. అప్పట్లో అధికారం ఉండటంతో అరెస్టు కాకుండా సురేశ్ మేనేజ్ చేశాడన్న ఆరోపణలున్నాయి.


నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇసుక బుకింగ్ కష్టాలు తీరనున్నాయి. ప్రయోగాత్మకంగా కొనసాగుతున్న ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ విధానాన్ని గురువారం నుంచి రెగ్యులరైజ్ చేయనున్నారు. ప్రజలు ఎప్పుడంటే అప్పుడు ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకునేలా ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ వెబ్‌సైట్ ఆధారంగానే ఎనిమిది రోజులుగా టెస్ట్ రన్ కింద ఆన్‌లైన్ బుకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తలెత్తిన సాంతికేతిక, ఇతర సమస్యలను అధికారులు పరిష్కరించారు.

వార్డ్ వెల్ఫేర్ ఉద్యోగాల్లో 269 మంది నియామకం

- గతంలో పక్కన పెట్టిన బీకాం గ్రాడ్యుయేట్లకు ఊరట

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఉద్యోగాల నియామకంలో పక్కనబెట్టిన బీకాం అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకుంటూ మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. వైసీపీ ప్రభుత్వంలో వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఉద్యోగాలకు 269 మంది బీకాం అభ్యర్థులు ఎంపికయ్యారు. నియామకం సమయంలో వారిని అనర్హులుగా ప్రకటించారు. దీనిపై బాధిత అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా, వారిని తిరిగి ఆయా పోస్టుల్లో నియమించాలని ఆదేశాలిచ్చింది.



ఒక రాష్ట్ర చరిత్రలో వందరోజులు స్వల్ప కాలమే! అయితే, సంకల్పం ఉంటే ఈ కొద్దిరోజుల్లోనే ఎంత మంచి రాష్ట్రానికి చేయవచ్చో, ఎంత మంది చింతలు తీర్చవచ్చో...చంద్రబాబు ప్రభుత్వం చేసి చూపించింది. ప్రతికూలతల్లో అనుకూలతలను వెతికే నాయకత్వం ఉంటే, సంక్షోభాల్లో రెట్టింపు శక్తితో పనిచేసే నేతృత్వం లభిస్తే ఎలాంటి ఆపత్కాలాలనైనా దాటొచ్చని చాటింది. విజయవాడ వరదలను చంద్రబాబు ప్రభుత్వం ఎదుర్కొన్న తీరు, భారీ ప్యాకేజీతో బాధితులను ఆదుకున్న విధానమే దీనిని నిదర్శనం. ఐదేళ్ల అరాచకం నుంచి రూ.ఐదుకు కడుపు నింపే స్థితికి ఏపీని కూటమి ప్రభుత్వం తెచ్చి నిలిపింది. కూనరిల్లుతున్న ఖజానా పెడుతున్న కలవరాన్ని కఠినమైన ఆర్థిక క్రమశిక్షణతో అధిగమించే ప్రయత్నం చేస్తోంది. అయినా, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే వృద్ధుల పింఛన్లను ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ.నాలుగు వేలు చేశారు. ఫస్టునే ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు పడుతున్నాయి. ఆగిపోయిన అన్న క్యాంటీన్లు తొలి వంద రోజుల్లోనే రాష్ట్రమంతా తెరుచుకున్నాయి. అమరావతి, పోలవరం పూర్తి కాగలవన్న నమ్మకాన్ని ప్రజలకు కూటమి ప్రభుత్వం కలగించగలిగింది



కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

వంద రోజుల్లో..

వెయ్యి అడుగులు!!

ప్రజా పాలనకు 100 రోజులు

(మొదటి పేజీ తరువాయి)

శాంతిని ఆస్వాదించే వాతావరణాన్ని కలిగించడంలో కూడా ప్రభుత్వం విజయం సాధించింది. టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి కూటమికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం గురువారానికి వందరోజుల పాలనను పూర్తి చేసుకొంటోంది. వంద రోజుల కాలం స్వల్ప వ్యవధే అయినా కొన్ని ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను ఈ కొద్దిరోజుల్లోనే ఈ ప్రభుత్వం చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం పేదల పింఛన్లు రూ. వెయ్యి పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకొంది. మొత్తం ప్రభుత్వ ఆదాయాన్ని, వనరులను ఈ పథకాలకే వినియోగిస్తున్నట్లు ప్రచారం చేసుకొంది. కానీ, పేదల పింఛన్లను ఏడాదికి కేవలం రూ. 250 మాత్రమే పెంచగలిగింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పాతాళంలో ఉంది. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. అయినా సాహసం చేసి మొదటి నెలలోనే ఆ పింఛన్లను ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ. నాలుగు వేలు చేశారు. పైగా మూడు నెలల బకాయి కలిపి పేదలకు రూ. ఏడు వేలు ఒకేసారి ఇచ్చారు. ఆ వర్గాల వారికి ఇంత డబ్బు చేతికి అందడం ఇదే ప్రథమం. మరీ తీవ్రమైన వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు పింఛను ఏకంగా రూ. పది వేలు చేశారు. ఇతర దివ్యాంగులకు కూడా పెంచారు. ఈ పింఛన్లను కూడా ప్రతి నెలా మొదటి తేదీనే పేదల చేతికి ఇస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా చాలాకాలం తర్వాత మొదటి తేదీనే జీతాలు అందడం మొదలైంది. వైసీపీ హయాంలో మొదటి రెండు వారాల్లో ఏ రోజున జీతం చేతికి వస్తుందో తెలియని పరిస్థితి ఉండేది. అధికారంలోకి వచ్చిన రెండో నెలలో కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునర్ ప్రారంభించడం సామాన్య ప్రజల్లో హర్షాతిరేకాలు నింపింది.

అమరావతి, పోలవరాలకు ఊపిరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే ప్రతిష్ఠాత్మక అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు ఊపిరి పోయగలిగింది. కేంద్రంలో ఎన్డీయే కూటమి అధికారంలో కొనసాగడానికి ఈసారి టీడీపీ ఎంపీల సంఖ్యాబలం ఉపయోగపడటంతో దానిని సద్వినియోగం చేసుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా కేంద్రం తన కోటాలో అంతర్జాతీయ సంస్థల నుంచి రుణం తీసుకొని రూ.పదిహేను వేల కోట్లు అమరావతి రాజధాని నిర్మాణానికి అందివ్వడానికి ముందుకు వచ్చింది. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ పూర్తి కావడానికి రూ. పన్నెండు వేల కోట్లు ఇవ్వడానికి కూడా కేంద్రం అంగీకరించింది. ఇది పూర్తయితే రెండో దశకు కేంద్రం ఏ మేరకు సాయం ఇస్తుందన్నది స్పష్టత వస్తుంది.

వరదల్లో బాధితులకు భరోసా

విజయవాడ వరదల్లో చంద్రబాబు ప్రభుత్వం బాధితులకు గట్టి ఆసరాగా నిలిచింది. సంక్షోభాల్లో రెట్టింపు శక్తితో పనిచేసే చంద్రబాబు ఈ వరదల్లో సర్వం తానై పనిచేశారు. రాష్ట్ర సచివాలయాన్ని విజయవాడ నగరానికి మార్చేశారు. మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారులను కూడా కింది స్థాయికి పంపి పనిచేయించారు. తాను పది రోజులు బస్సులోనే పడుకొని పనిచేసి ఆదర్శంగా నిలిచారు. ఆయన శ్రమ రాష్ట్రం లోపలా... బయటా అన్ని వర్గాల ప్రజల ప్రశంసలు పొందింది.

- ▸ రేపటి నుంచి ప్రజల్లోకి ఎమ్మెల్యేలు
- ▸ వంద రోజుల పాలనలో ప్రగతిపై 10 రోజుల పాటు వివరించాలి
- ▸ కూటమి పార్టీల భేటీలో సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): "వంద రోజుల కూటమి ప్రభుత్వంలో వెయ్యి అడుగులు వేశాం. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిపోయింది. ఐదేళ్లలో 3 శాతం గ్రోత్ రేట్ తగ్గింది. దీంతో బాగా వెనకబడ్డాం" అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంత భయకరమైన పరిస్థితులు ఉన్నాయో తెలిసిందే. నన్ను అరెస్టుచేసిన రోజున పవన్ కల్యాణ్ హైదరాబాద్ నుంచి ఇక్కడికి రావడానికి ప్రయత్నించారు. కానీ, ఆ ఫ్లైట్‌ను రద్దు చేశారు. అయినా సరే ఆయన రోడ్డు మార్గంలో వచ్చారు. నందిగామ వద్ద రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో రోడ్డు మీద ధర్నా చేశారు. సినిమావాళ్లు షూటింగ్‌లో తప్ప బయట ఇవన్నీ చేయరు. కానీ, పవన్ నిజ జీవితంలో కూడా పోరాట యోధుడుగా నిలబడ్డారు. ఆయన రాజకీయాల్లో ఒక ఆశయం కోసం వచ్చారు. 2014లో టీడీపీ, బీజేపీ పొత్తు పెట్టుకున్నాం. ఆనాడు ఆయన పోటీ చేయకుండా ఎన్డీయే గెలవాలని కోరుకున్నారు. నేను జైలులో ఉన్నప్పుడు అక్కడకు వచ్చి మాట్లాడారు. తర్వాత బయటకు వెళ్లి జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయని చెప్పారు. బీజేపీతో ఆయన పొత్తులో ఉన్నా కానీ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడానికి వీల్లేదని బీజేపీని ఒప్పించి కూటమిలోకి తీసుకువస్తామని చెప్పారు. సీట్ల పంపకాల్లో ఎక్కడా అభిప్రాయ బేధాలకు తావులేకుండా పని చేశాం. కూటమి రావడానికి ప్రధానంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా కృషి చేశారు. ఆమె స్థానంలో వేరేవాళ్లు ఉంటే ఏమయ్యేదో తెలీదు. నేను, పవన్ ఒక ఒప్పందానికి వచ్చాం. ఒక ప్రెస్‌మీట్ పెట్టాం. ఎవరెవరు ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నదీ చెప్పాం. బీజేపీ పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్లాం. అమిత్‌షా, జేపీ నడ్డా కూడా మూడుపార్టీల కలయికకు ఓకే చెప్పారు. కానీ, ఇలా చేస్తే నష్టం జరుగుతుందని చాలా మంది అన్నారు. కాదు లాభం వస్తుందని చెప్పాం. అదే ఈ రోజు జరిగింది. వంద రోజులు పూర్తి చేశాం. మోదీ మూడోసారి ప్రధానిగా వంద రోజులు పూర్తి చేసుకున్నారు. కేంద్రంలో అనుకున్న ప్రభుత్వం లేకపోతే వెంటిలేటర్‌పై ఉన్న ఏపీని కాపాడుకోవడం చాలా కష్టమై పోయేది" అని అన్నారు.

వైసీపీ తప్పుడు లెక్కలు

వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు చేశారు. విపత్తు నిధులు రూ.2వేల కోట్లు ఉన్నాయన్నారు. రూ.7వేల కోట్లు ఖర్చుచేసి లెక్క చూపించలేదు. కేంద్రం ఇచ్చిన డబ్బులు మళ్లించారు. నేను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత తొలిసారి 93శాతం స్ట్రైక్ రేట్, 58 శాతం ఓటు వేసిన సందర్భం ఎప్పుడూ లేదు. 1994లో ఉధృతమైన వేవ్ వచ్చింది. అప్పుడు కూడా ఇంత అద్భుతమైన మెజార్టీ రాలేదు. ఎన్నికల సమయంలో మూడు పార్టీలు అనుసరించిన విధానాలే ఈ విజయానికి కారణం. ఇప్పుడు మనందరి ప్రవర్తన కూడా అంతే ముఖ్యం. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలు మెచ్చుకునే విధంగా మన నడవడిక ఉండాలి. ప్రజల్లోకి వెళ్లాలి. 100 రోజుల్లో ఏం చేశామో చెప్పాలి. ఏం చేయబోతున్నామో చెప్పాలి. ప్రధాని మోదీ దృఢమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తున్నారు. కేంద్ర కార్యక్రమాలన్నింటినీ రాష్ట్రంలోనూ అనుసంధానం చేసుకుంటున్నాం.

విజన్ 2047

కేంద్రం వికసిత భారత్‌కు నాందిపలికింది. స్వర్ణాంధ్రప్రదేశ్-2047కు విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. 2047 నాటికి మీ నియోజకవర్గం ఏ విధంగా ఉండాలో ఎమ్మెల్యేలు ఒక విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. ఐదేళ్లు ఏం చేయాలో ఆలోచించండి. మీకు అవగాహన వస్తుంది. అప్పుడు చరిత్రలో శాశ్వతంగా మిగిలిపోతాం. అందరం కలిసి రాష్ట్రంలో 2047 నాటికి పేదరికం, ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు శ్రీకారం చుడదాం.

10 లక్షల కోట్ల అప్పులు..

రాష్ట్రంలో రూ.10 లక్షల కోట్ల అప్పు ఉంది. రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఈ సమయంలో అధికారంలోకి వచ్చాం. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి. పవన్‌కల్యాణ్, మంత్రులు, కేంద్ర సహకారంతో ముందుకు వెళ్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు ఇస్తున్నాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. మనం వచ్చాక ప్రతినెల 1న జీతాలు ఇవ్వడంతో పాటు అందరికీ అన్నీ అందుబాటులోకి తీసుకుచ్చాం. పరిశ్రమల్లో అవకాశాలు పెరిగాయి. అందుకే యువతలో నైపుణ్యం పెంచేందుకు సిద్ధం అయ్యాం. దీనికోసమే స్కిల్ సెన్సెస్ చేశాం.

ఇసుకలో వేలు పెట్టొద్దు

ఉచిత ఇసుక చాలా సవాల్‌గా మారింది. అందరినీ ఒకటే కోరుతున్నాం. ఎవరూ ఈ విషయంలో వేలు పెట్టొద్దు. మీ నియోజకవర్గంలో కూడా జోక్యం చేసుకోవద్దు. ఇదే రాబోయే రోజుల్లో మన గెలుపునకు దోహదం చేస్తుంది. వచ్చే నెల 4 లేదా 5 నుంచి కొత్త మద్యం పాలసీ వస్తుంది. నాణ్యమైన మద్యం రూ.99కే ఇవ్వాలని నిర్ణయించాం. అవతలివాళ్లు చేసిన తప్పులు మనం చెప్పాం. మనం చేసే మంచి గురించి అందరికీ చెప్పాలి. రూ.12,500 కోట్లు పోలవరం కోసం కేంద్రం ఇచ్చింది. రెండేళ్లలో పోలవరం ఫేజ్-1 పూర్తి చేయాలని కేంద్రం ముందుకు వచ్చింది. పోలవరాన్ని పూర్తిచేసి జాతికి, రైతులకు అంకితమిచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చింది. వంద రోజుల్లో శ్రీసిటిలో 15 సంస్థలు ప్రారంభించాం.

17 వేల కిలోమీటర్ల రోడ్లు వేస్తాం

గ్రామాల్లో ఆ రోజు 25వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్డు వేశాం. ఇప్పుడు మిగిలిన సిమెంట్ రోడ్లు వేయవచ్చు. ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున పనులు చేసుకునేందుకు ఉపాధి హామీ పథకంలో అవకాశం ఉంది. 17 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేస్తాం. రాబోయే రోజుల్లో ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు డబ్బులు ఇచ్చే బాధ్యత తీసుకున్నాం. విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడుకోవడం మన బాధ్యత. పోలీసు వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నాం. నిర్మాణంలో ఇళ్లను పూర్తిచేసే బాధ్యత తీసుకుంటున్నాం. పట్టాదార్ పుస్తకాలను రాజముద్రతో రైతులకు అందిస్తాం. ఏడాదిన్నరలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తవుతుంది. కుప్పం, దగదర్తి ఎయిర్‌పోర్టు నిర్మిస్తాం.

ఒక నెల జీతం విరాళం

ఇటీవల వచ్చిన వరదలను కూడా సవాల్‌గా తీసుకుని పనిచేశాం. పవన్ రూ.6కోట్లు ఇచ్చారు. దేశంలో ఉండే ప్రతి ఒక్కరూ స్పందించారు. నా జీవితంలో చాలా చాలెంజ్‌లు చూశాను. ఇప్పటికే రూ.350 కోట్లు సీఎంఆర్ఎఫ్‌కు వచ్చింది. అందరం కలిసి నెల జీతం విరాళంగా ఇద్దాం. బుడమేరు కబ్జా చేసేశారు. బాధితులు అందరికీ ఆర్థిక సాయం ప్రకటించాం. 45 ఏళ్లలో ఇంత పెద్ద ప్యాకేజీ ఎప్పుడూ ఇవ్వలేదు. కానీ, ప్యాకేజీ ఇచ్చినప్పుడు ఒక తృప్తి కలిగింది. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నామినేటెడ్ పోస్టుల్లో అందరికి అవకాశం కల్పిస్తాం. రాబోయే 20వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు కేంద్రం, రాష్ట్రం చేసిన పనుల వల్ల ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతున్నదన్న విషయాన్ని చెప్పాలి. భవిష్యత్తులో మనం చేయబోయే కార్యక్రమాలు గురించి వివరించాలి. గుజరాత్‌లో 30 ఏళ్ల నుంచి ఒకే పార్టీ బీజేపీ అధికారంలో ఉంది. కాబట్టి గుజరాత్ అభివృద్ధి చెందుతోంది. జిల్లాల్లో ప్లానింగ్ బోర్డు మంత్రులను నియమిస్తున్నాం. మూడు పార్టీలను సమన్వయం చేసే బాధ్యత వాళ్లకి అప్పగిస్తాం. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



వైసీపీ తప్పులు మనం చేయొద్దు

ప్రజలకు ఏం చేశామో చెబుదాం

కూటమి నేతల భేటీలో పురందేశ్వరి

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): "ప్రజలకు మనకు అనూహ్యమైన విజయాన్ని అందించారు. 93 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. ప్రజల ఆకాంక్ష ఈ విజయంలో మిళితమై ఉంది. ఈ విషయం మనం గమనించాలి. వైసీపీ చేసిన తప్పులు మనం చేయొద్దు" అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వంద రోజులు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాప్రతినిధుల ఉమ్మడి సమావేశంలో బుధవారం ఆమె మాట్లాడారు. "అభివృద్ధి అనే మాటకు అర్థంలేకుండా.. పెట్టుబడులు రాకుండా.. మన బిడ్డలకు ఉపాధి అవకాశాల్లేని, విద్వేష పూరిత, అరాచక పాలన రాష్ట్రంలో ఐదేళ్ల పాటు ప్రజలు చూశారు. అట్రాసిటీ కేసులు, మహిళలపై అత్యాచారాలు, నాసిరకం మద్యంతో మహిళల పుస్తెలు తెంపడం.. లాంటి చర్యలతో విసిగి పోయారు. ఒక మంచి ప్రభుత్వాన్ని తీసుకురావాలని ప్రజలు ఎన్డీఏ కూటమిని ఆశీర్వదించారు. పాలనా దక్షత ఉన్న చంద్రబాబు, ధైర్యంతో ముందుకెళ్లే పవన్ కల్యాణ్, అవినీతికి తావులేని నిస్వార్థ సేవ మోదీ సొంతం. అందుకే మూడు పార్టీలను ప్రజలు దీవించారు. గత ప్రభుత్వం ప్రజల్ని ఇబ్బంది పెట్టడం, రాష్ట్రాన్ని ధ్వంసం చేయడాన్ని గుర్తుంచుకుని మనం ఏమి చేయకూడదో జాగ్రత్త పడాలి. కేంద్రం విపత్తులకు ఇచ్చిన నిధులు కూడా దారి మళ్లించిన ఘనత గత వైసీపీ ప్రభుత్వ సొంతం. రాష్ట్రానికి సహకరించేందుకు కేంద్రం ముందుకొస్తోంది. పోలవరం, అమరావతి ఇతరత్రా అభివృద్ధికి నిధులు ఇస్తోంది. ఇవన్నీ సోషల్ మీడియా ద్వారా, మూడు పార్టీల కార్యకర్తల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వంద రోజుల్లో ఏమి చేశామన్నది ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉంది" అని పురందేశ్వరి వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో శాంతి

వైసీపీ హయాంలో తాండవించిన అరాచక పరిస్థితుల స్థానంలో కూటమి ప్రభుత్వం శాంతియుత వాతావరణం నెలకొల్పగలిగింది. ఏసీబీ.. జేసీబీ.. పీసీబీల నుంచి శుక్రవారాల రాత్రులు ప్రతిపక్షాలపై జరిగే దాడులు నిలిచిపోయాయి. తమను ఎవరో నిరంతరం గమనిస్తూ వేధిస్తున్నారన్న భావన నుంచి ప్రజలు బయటకు వచ్చారు. తాము ఇప్పుడు స్వేచ్ఛగా ఉంటున్నామని, భయం భయంగా బతకాల్సిన వాతావరణం పోయిందన్న వ్యాఖ్యలు సాధారణ ప్రజల నుంచి కూడా వినవస్తున్నాయి. శాంతియుత వాతావరణం రాష్ట్రంలో వ్యాపారాల పెరుగుదలకు దారి ఇచ్చింది. పలుచోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకొంది. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి వెళ్లేవారు పెరిగారు. పెట్టుబడులు, పరిశ్రమలకు సంబంధించి ఆశావహ వాతావరణం కనిపిస్తోంది.

కూటమిలో సఖ్యత...

కూటమి ప్రభుత్వం ఈ వంద రోజుల్లో మంచి సఖ్యతను ప్రదర్శించింది. పై స్థాయిలో టిడిపి, జనసేన, బిజెపి నాయకత్వాలు మంచి సత్సంబంధాలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరచూ సమావేశమై అనేక అంశాలపై చర్చించుకొంటున్నారు. బిజెపి రాష్ట్ర నాయకత్వం కూడా ముఖ్యమంత్రిని కలిసి అభిప్రాయాలు పంచుకొంటోంది. దీనితో కూటమి ప్రభుత్వం కలిసికట్టుగా ఉందన్న అభిప్రాయం ప్రజల్లోకి వెళ్లింది.

రెక్కలు విచ్చుకున్నాయి..

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటంతో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గణనీయంగా విమాన సర్వీసులు తగ్గిపోయాయి. అధికారంలోకి రాగానే పూర్వవైభవం తీసుకువస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. చెప్పిన మాట ఆయన నిలుపుకొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో విమానయాన శాఖను టీడీపీకి కేటాయించడం రాష్ట్రానికి బాగా కలిసివచ్చింది. దీంతో ఢిల్లీకి అదనంగా రెండు విమాన సర్వీసులు మొదలయ్యాయి. ముంబై, బెంగళూరుకు ఒక్కో విమాన సర్వీసు, హైదరాబాద్‌కు అదనంగా మరో విమాన సర్వీసును విస్తరించారు. వచ్చే నెల నుంచి విజయవాడ-విశాఖపట్నం మధ్య మరో సర్వీసు అందుబాటులోకి రానుంది. ఇలా అరడజనుకు పైగా విమాన సర్వీసులు పెరగటంతో ఒక్కసారిగా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. నెలకు 75 వేలమంది ప్రయాణించేస్థాయి నుంచి గత రెండు నెలలుగా నెలకు లక్షమందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. విమానాశ్రయంలో ఎప్పటినుంచో పురోగతిలో లేని గ్రాండ్ ఎంట్రన్స్ వే ఇన్నాళ్లకు అందుబాటులోకి వచ్చింది.

కీలక హామీల అమలు

- సామాజిక పెన్షన్‌ను ఒకేసారి రూ.1000 పెంచి మొత్తం రూ.4000 చేశారు. బకాయిలు రూ.3,000 కూడా కలిపి జూలై నెల 1వ తేదీన రూ.7,000 పెన్షన్‌ను 64 లక్షల మందికి పైగా ఇవ్వడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి.
- నిరుద్యోగ యువతకు 16,437 ఉపాధ్యాయ నియామకాలకు మెగా డీఎస్సీకి చర్యలు తీసుకున్నారు.
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ
- డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంపు
- నిర్మాణ రంగాన్ని నిలబెట్టేందుకు ఉచిత ఇసుక విధానం

ఆర్థిక సాయం

- పంచాయతీలకు రూ.1452 కోట్లు విడుదల
- రైతులకు రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలు విడుదల
- జలాశయాల నిర్వహణకు రూ.340 కోట్లు
- నీరు-చెట్టు బకాయిలు 256 కోట్లు చెల్లింపులు మొదలు
- రాజధాని కౌలు రైతుల బకాయిలు 400 కోట్లు చెల్లింపు

బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా చిత్తూరు జిల్లాలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. పాదయాత్రలో ఎనిమిదో రోజు 2023 ఫిబ్రవరి 3వ తేదీ రాత్రి బంగారుపాళ్యం శివార్లలో వంద కిలోమీటర్ల మైలురాయి అధిగమించారు. ఈ సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరించి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి వంద రోజుల్లో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి డయాలసిస్ పరికరాలు అందజేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే లోకేశ్ డయాలసిస్ పరికరాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా అభ్యర్థించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జాతీయ డయాలసిస్ కార్యక్రమం కింద ఐదు పరికరాలను బంగారుపాళ్యం ఆస్పత్రికి కేటాయించింది. ఒక్కోదాని విలువ రూ.50 లక్షలు. ఈ పరికరాలు పదిహేను రోజుల కిందటే ఆస్పత్రికి చేరుకున్నాయి. వీటిని కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనంలో అమర్చుతున్నారు. నూతన ఆస్పత్రి భవనంతో పాటు డయాలసిస్ పరికరాలను త్వరలోనే మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు.

నిధులు, నిర్ణయాలు ఘనతలు

- గత పాలకుల పాపాలపై 7 శ్వేతపత్రాల ద్వారా ప్రజల ముందుకు నిజాలు
- 5 వేల కోట్లతో కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్లు.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ప్రకాశం సహా 8 వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు
- శ్రీ సిటీలో 15 సంస్థల ప్రారంభం.. మరో 6 సంస్థలకు శ్రీకారం
- రాష్ట్రానికి రూ.75 వేల కోట్లతో బీపీసీఎల్ పెట్రో క్యారిడార్ ఏర్పాటుకు అంగీకారం
- ఫాక్స్‌కాన్, హెచ్‌సీఎల్ సహా అనేక కంపెనీలతో చర్చలు.. మళ్లీ పెట్టుబడులు
- 100 పారిశ్రామిక పార్కులకు ప్రణాళికలు.. విశాఖ, విజయవాడ మెట్రోలకు జీవం
- ఏపీని గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేందుకు క్లీన్ ఎనర్జీ పాలసీతో అడుగులు
- 17 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 10 వేల కి.మీ. డ్రైన్ల నిర్మాణం
- రైతన్నలకు మళ్లీ సబ్సిడీతో డ్రిప్ పరికరాలు.. పాడి రైతులకు 90 శాతం రాయితీతో షెడ్లు
- ప్రజల వద్దకే ప్రభుత్వం.. స్వయంగా సీఎం, మంత్రులు అర్జీల స్వీకరణ
- పోలీస్ శాఖ ప్రక్షాళన.. సీసీ కెమెరాలకు మళ్లీ ప్రాణం.. లా అండ్ ఆర్డర్‌పై కఠినంగా ప్రభుత్వం
- విషపూరిత జె బ్రాండ్ల మద్యానికి చెల్లుచీటి.. కొత్త లిక్కర్ పాలసీ
- చేనేతలకు జీఎస్టీ రద్దు.. గృహ నిర్మాణానికి అదనంగా 50 వేలు సాయం
- దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణుల వేతనాలు 15 వేల నుంచి 25 వేలకు పెంపు
- ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలపై ఉత్తర్వులు
- అర్చకుల వేతనాలు 10 వేల నుంచి 15 వేలకు పెంపు
- గృహ నిర్మాణానికి రూ.4 లక్షలకు పెంపు.. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం
- రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు.. ఒరిజినల్ డాక్యుమెంట్లు ప్రజలకే
- ఆర్టీసీలో 1400 బస్సుల కొనుగోలు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రక్షాళన
- ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ గ్యారెంటీతో 1000 కోట్ల రుణాలు
- ఉపాధి పథకం ద్వారా 6.50 కోట్ల పనిదినాలు పెంచడం వల్ల 54 లక్షల మందికి అదనంగా లబ్ధి
- దూపదీప నైవేద్యాలకు రూ.50,000 లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆలయాలకు సాయం రూ.10,000కు పెంపు, రూ.50,000 పైగా ఆదాయం ఉన్న ఆలయాలకు రూ.15,000 పెంపు

చంద్రబాబు విజన్ సూపర్!

- ▸ ఆలోచనలో దశాబ్దం ముందు
- ▸ బాబు ఆశయాలకు అనుగుణంగా పని చేస్తా
- ▸ డిప్యూటీ సీఎం పవన్



అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): "సీఎం చంద్రబాబు విజన్ సూపర్. ఆయన ఆలోచనలు దశాబ్దం ముందుంటాయి. 2047 నాటికి ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలన్న సంకల్పంతో పని చేస్తున్నారు. ఆయన ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం" అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకోనున్న సందర్భంగా మంగళగిరిలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కూటమి పార్టీల సమావేశంలో పవన్ ప్రసంగించారు. "సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలి. ఒక తల్లికిపుట్టిన ఇద్దరు పిల్లలే ఒకలా ఉండరు. అలాంటిది మూడు విభిన్నమైన పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పార్టీలు వేరైనా ఆత్మ ఒక్కటే. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు మూడుగా కనిపించినా గుండె చప్పుడు మాత్రం ఒక్కటే. విపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబును రాజమండ్రి జైల్లో పెట్టారు. విజయవాడ వస్తున్న నన్ను కూడా ఆపారు. నేను ఆ రోజే ప్రభుత్వం మారబోతోందని చెప్పాను. అదే జరిగింది. ఇప్పటం గ్రామంలో నిర్వహించిన సభలో వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వమోమని ప్రతిపాదన చేశా. ఆ సమయంలో రాష్ట్రం బాగుండాలనే బలీయమైన కోరిక తప్ప మరొకటి లేదు. అది సాధించడానికి ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్నాం' అని అన్నారు.

గెలవలేమని గేలి చేశారు

"నేను రోడ్డు మీకు వెళ్లిన ప్రతిసారీ మీరు గెలవరు. ఇప్పుడున్న వైసీపీనే గెలుస్తుందని అనేవారు. మనం గెలుస్తున్నామన్న నమ్మకం, ధైర్యం ఉన్నది చంద్రబాబుకు మాత్రమే. ఆయన నుంచి నేను నేర్చుకున్నది ఆ ధైర్యమే. అపార అనుభవం ప్రత్యక్షంగాచూశా. ఏం జరిగినా భయం అనేది ఆయనలో కనిపించలేదు. ఒక వ్యక్తి ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా.. కుటుంబ సభ్యుల్ని అవమానించినా, క్యాబినెట్ నిర్ణయాలకు బలి చేసినా జంకలేదు. రాజకీయం అంటే ఇలానే ఉంటుంది. మనం భరిస్తా ముందుకు వెళ్తాం అని చెప్పారు" అని పవన్ గుర్తుచేసుకున్నారు. అలాంటి నాయకుడి పక్కన ఉండి పాలనా తీరును, కష్టసమయంలో ఎలా వ్యవహరించాలో నేర్చుకోవాలని అన్నారు. "53 రోజులు జైల్లో పెడితే ఎలా భరించారో చూశాం. నేను షూటింగ్‌లు కూడా చేయలేక పోయాను. ప్రొడ్యూసర్లకు క్షమించమని చెప్పాను. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రభుత్వం మారాలని కష్టపడుతన్నామని చెప్పాను. ఆయన ధైర్యం చేయూతనిచ్చింది. నా స్వార్థం అంతా రాష్ట్రం కోసమే. అందరినీ దారిలో పెట్టి, మెత్తగా మందలిస్తూ, గట్టిగా చెప్పే నాయకుడు నేతృత్వంలో పని చేయడం ఆనందంగా ఉంది. మన దగ్గర డబ్బులు లేకపోయినా వంద రోజుల్లో అద్భుతమైన పాలన చేశాం" అని పవన్ వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16,437 టీచర్ల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. "సామాజిక పెన్షన్‌ను పెంచుదామంటే ఎలా అని అడగా. కష్టమే కానీ పెంచాలని చంద్రబాబు నిర్ణయించారు. మొదటి నెల రూ.7 వేల చొప్పున 65.18లక్షల మందికి రూ.4,800 కోట్లు ఇచ్చాం. సంక్షేమంలో తిరుగులేని చరిత్ర ఇది. దీనికి సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నా. ఆయన పరిపాలన అనునిత్యం ఆశ్చర్యపరుస్తూనే ఉంది. ఆయన నుంచి ఏం చేర్చుకోగలగం? ఎంత సపోర్టుగా ఉండగలం? అన్న ఆలోచనలో ఉంటాను. ఉద్యోగులకు 1నే జీతాలు అందిస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేశాం. పిఠాపురంలో భూమి కొంటే ఆయన (జగన్) ఫొటో నవ్వుతూ కనిపించింది. ఏపీ రాజముద్రని తీసేసి వ్యక్తి ఫొటో పెట్టుకున్నారంటే విచిత్ర ఆలోచన. అలాంటి చట్టాన్ని రద్దు చేసిన చంద్రబాబు ప్రజల్లో చిరునవ్వులు తీసుకొచ్చారు" అని అన్నారు.

ఇదీ వంద రోజుల ప్రోగ్రెస్

వంద రోజుల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పురోగతి సాధించామని పవన్ కల్యాణ్ తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల ద్వారా రూ.998.62 కోట్లు విడుదల అయ్యాయని చెప్పారు. "70 శాతం పంచాయతీల్లో వైసీపీ సానుభూతి పరులే ఉన్నారు. ఆ పంచాయతీల్లో కూడా కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించాం. 13,326 గ్రామ సభలు నిర్వహించడం ద్వారా రికార్డు సాధించాం. ఉపాధి హామీ కూలీలకు రూ.2,081 కోట్లు చెల్లించాం. 4500 కోట్ల పనులకు గ్రామ సభల ఆమోదం తీసుకున్నాం" అని చెప్పారు

బాబు ఓపిక ఆశ్చర్యం కలిగిస్తుంది!

సీఎం చంద్రబాబు ఓపిక చూసి ఆశ్చర్యమేస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన మనసు, మైండ్ నిరంతరం పని చేస్తూనే ఉంటుందన్నారు. "గత ప్రభుత్వ హయాంలో అధికారుల్లో మందకొడితనం వచ్చింది. వారిలో చలనం తీసుకురావడానికే చంద్రబాబు వరద నీటిలో నడిచారు. అన్ని స్థానిక సంస్థల్లో మొత్తం వైసీపీ వాళ్లే ఉన్నారు. విజయవాడ మేయర్ ఆ సమయంలో ఏమైపోయారు. వైసీపీకి బాధ్యత లేదు. ఎంతసేపటికీ విమర్శించడమే. వరదల సమయంలో అధినేత ఎలా ఉండాలో చంద్రబాబు చూపించారు. దానిద్వారా మేం స్ఫూర్తి పొందాం" అని వ్యాఖ్యానించారు.

జీవో 85 సవరణకు ప్రభుత్వం అంగీకారం

▸ డాక్టర్ల డిమాండ్లలో మెజార్టీ పరిష్కారానికి కృషి: మంత్రి సత్యకుమార్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం పీహెచ్‌సీ డాక్టర్ల డిమాండ్‌పై సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వం, పీహెచ్‌సీ వైద్యుల సంఘం ప్రతినిధుల మధ్య బుధవారం సచివాలయంలో దాదాపు రెండు గంటల పాటు చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా పాల్గొన్నారు. తొలుత పీహెచ్‌సీ వైద్యులు... 'జీవో 85ను వెంటనే ఉపసంహరించాలి. టైం బౌండ్ పదోన్నతులు, ఇంక్రిమెంట్ల విషయంలో తమకు న్యాయం చేయాలి. బోధనాసుపత్రుల్లో పని చేస్తున్న ఎంబీబీఎస్ డాక్టర్లకు అందిస్తున్న ఆర్థిక వెసులుబాటును పీహెచ్‌సీ డాక్టర్లకూ వర్తింపజేయాలి' అని డిమాండ్ చేశారు. వైద్యుల డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారు. 'పీహెచ్‌సీ వైద్యులు పీజీ పూర్తి చేసుకుని 2027లో సరీసులోకి చేరే సమయానికి వివిధ స్పెషలిస్టు డాక్టర్ల ఖాళీల లభ్యతను దృష్టిలో పెట్టుకుంటా. ఆమేరకు ఈ సంవత్సరం పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ఆశిస్తున్న వైద్యుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటాం. వారికి వీలైనంత మేరకు న్యాయం చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తాం. ఇందుకోసం జీవో 85లో సవరణలు చేస్తాం. 2024 నాటికి ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల ఖాళీల లభ్యత, ఈ ఏడాది పీజీ పరీక్షల్లో అర్హత పొందిన పీహెచ్‌సీ వైద్యుల సంఖ్య మధ్య భారీ వ్యత్యాసం ఉంది. అయినా వైద్యుల ఆశల్ని నేరవేర్చడానికి ప్రయత్నం చేస్తాం. ఈ దిశగా మరోసారి పీహెచ్‌సీ వైద్యులతో చర్చిస్తాం. హెల్త్ వర్సిటీ సీట్ మ్యాట్రిక్స్ ప్రకటించేలోగా తుది నిర్ణయాన్ని తీసుకుంటాం. సమస్యలు పరిష్కారం కావాలంటే పట్టువిడుపు ధోరణితో వ్యవహరించాలి. ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల పోస్టుల లభ్యత, నియామకాలపై ప్రభుత్వానికి ఉన్న పరిమితుల్ని వైద్యులు అర్థం చేసుకోవాలి' అని మంత్రి విజ్ఞప్తి చేశారు. జీవో 85లో ప్రస్తావించిన ఆరు పీజీ కోర్సుల్లోనే కాకుండా అన్ని కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలన్న వైద్యుల డిమాండ్‌ను కూడా సానుకూలంగా పరిశీలించడానికి మంత్రి అంగీకరించారు. పలు డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో వైద్యులు తమ ఆందోళన విరమించుకుని విధుల్లో చేరాలని మంత్రి కోరారు. త్వరలో మరోసారి వైద్యుల సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కమిషనర్ హరికిరణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నా సస్పెన్షన్ రద్దుచేయండి

▸ క్రమశిక్షణ చర్యలపైనా స్టే ఇవ్వండి

▸ హైకోర్టుకు 'గనుల' వెంకటరెడ్డి వినతి

▸ పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి న్యాయస్థానం ఆదేశం

▸ విచారణ అక్టోబరు 14కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి సస్పెన్షన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను అక్టోబరు 14కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుకతో పాటు ఇతర మైనింగ్ టెండర్ల కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడి, ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారని పేర్కొంటూ వెంకటరెడ్డిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం జూలై 31న ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. సస్పెన్షన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని.. తనపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ గత నెల 21న జారీ చేసిన ఉత్తర్వులపైనా స్టే విధించాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. వెంకటరెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ డిప్యుటేషన్ జూలై 31తో ముగిసిందన్నారు. ఆగస్టు 1న ఆయన తన ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు రిపోర్ట్ చేశారని, ఈ నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేసి, క్రమశిక్షణ చర్యలకు ఆదేశించే అధికారం రాష్ట్రప్రభుత్వానికి లేదని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని.. పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.



కేబినెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

క్వార్టర్ మద్యం రూ.99

(మొదటి పేజీ తరువాయి)

కల్లుగీత కులాలకు కేటాయించాలని నిశ్చయించినట్లు సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. అక్టోబరు నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తుందన్నారు. బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. కేబినెట్ నిర్ణయాలను వివరించారు. 2023 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 15 వరకు గ్రామ/వార్డు వలంటీర్ల సర్వీసును పొడిగిస్తూ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కేబినెట్ విభేదించిందన్నారు. వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపుపై లోతైన అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. వార్తా పత్రిక కొనుగోలు కోసం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు నెలకు రూ.200 చొప్పున అదనపు ఆర్థిక సాయం అందించేందుకు గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని చేసిన ప్రతిపాదనలను కూడా కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. 'రాజకీయ లబ్ధి కోసం, ఎవరికో ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ఇచ్చిన ఈ జీవోల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.205 కోట్ల నష్టం వాటిల్లింది. దీనిపై కమిటీ వేసి పూర్తి వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేస్తూ అసెంబ్లీ ఉభయ సభల ముందుంచే తీర్మానం, కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడానికి చేసిన ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది' అని చెప్పారు.

మంత్రివర్గం మరిన్ని నిర్ణయాలివీ..

- పోలవరం కొత్త డయాఫ్రం వాల్ పనులు మేఘా ఇంజనీరింగ్ సంస్థకే అప్పగించేందుకు ఆమోదం.
- ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు.
- తీవ్ర గుండెపోటు.. ఎస్టీ-ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (స్టెమీ) వస్తే అందించాల్సిన ప్రాథమిక అత్యవసర చికిత్సలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం. కమ్యూనిటీ స్థాయిలో సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు.
- కేంద్రం ఆధ్వర్యంలోని క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ స్కీం కింద అందే లబ్ధిని రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు అందజేసి వాటిని అభివృద్ధి పథంలో నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.100 కోట్లతో కార్పస్ ఏర్పాటు. ఈ క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ స్కీం ద్వారా సుమారు 35 వేల కొత్త గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులకు ప్రయోజనం.
- ప్రతి ఇంటా ఒక ఎంఎస్ఎంఈ ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్న ఆకాంక్ష నెరవేరేందుకు ఆయా పరిశ్రమలకు 50 ఎకరాల కంటే తక్కువ భూములు కేటాయించేందుకు ఆమోదం.
- మాజీ సైనికులు, యుద్ధ వికలాంగ సైనికులు, యుద్ధ వితంతువులు, మాజీ సైనిక వితంతువులు.. వారిపై ఆధారపడిన వారి స్వయం సమృద్ధి, సహాయ పునరావాసం కోసం సొంత పీడీఎఫ్ ఖాతా నుంచి రూ.3 కోట్ల కార్పస్ నిధితో ఆంధ్రప్రదేశ్ ఎక్స్ సర్వీస్‌మెన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి ప్రతిపాదన. ఈ కార్పస్ నిధిని రూ.10 కోట్లకు పెంచుతూ ముఖ్యమంత్రి ఆమోదం.
- అమరావతిలో కృత్రిమ మేధ (ఏఐ) విశ్వవిద్యాలయం, స్కిల్లింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీని.. యూజీసీ నిబంధనల ప్రకారం డీమ్డ్ టు బీ యూనివర్సిటీగా మార్పు చేసేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌వోసీ) ప్రభుత్వపరంగా జారీచేసేందుకు ఆమోదం.
- రాష్ట్రంలోని బీసీలకు చట్టసభల్లో సమానమైన ప్రాతినిధ్యాన్ని కల్పించాలనే లక్ష్యంతో వారికి 33 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదనలను కేంద్రం ఆమోదానికి పంపాలని నిర్ణయం.
- సహకార సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964లో క్లాజ్(ఐ-1)ను తొలగించి సెక్షన్ 2లో క్లాజ్(ఎన్-ఐ)ను చేర్చే చట్ట సవరణ ప్రతిపాదనకు ఆమోదం. అలాగే సెక్షన్ 21ఏ లోని సబ్‌సెక్షన్ (1ఏ)ని తొలగించడంతో పాటు 115-ఈ సవరణకు సంబంధించిన ముసాయిదా బిల్లుకూ ఆమోదం.
- గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రంగా మార్చుతూ ఇప్పటికే జారీచేసిన జీవోకు ధ్రువీకరణ.
- అక్టోబరు మొదటి వారం నుంచి నూతన మద్యం పాలసీ అమలు. దీని కాలపరిమితి రెండేళ్లు. మద్యం ధరలు, రిటైల్ వ్యాపారం, పన్నులపై కేబినెట్ సబ్‌కమిటీ వేసిన సిఫారసులకు ఆమోదం. రాష్ట్రంలోని 3,736 మద్యం దుకాణాల్లో కల్లుగీత కులాలకు 10 శాతం కేటాయింపు. ఈ రిజర్వ్‌డ్ దుకాణాలకు ప్రత్యేక మార్గదర్శకాలు, నోటిఫికేషన్ల జారీ.
- బిట్స్ పిలానీ వంటి విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్లతో విద్యాసంస్థల ఏర్పాటు.
- సుప్రీంకోర్టు లాయర్ల ఆధ్వర్యంలో బెంగళూరులో మాదిరిగా అమరావతిలో కూడా లా యూనివర్సిటీ ఏర్పాటు.
- సాధారణ పరిపాలన విభాగం-ముఖ్యమంత్రి సహాయనిధి కేసులు, సీఎం ఫిర్యాదులు తదితర అంశాలను పరిష్కరించేందుకు అవసరమైన యంత్రాంగం పటిష్ఠానికి జూన్ 12 నుంచి ముఖ్యమంత్రి కార్యాలయంలో వివిధ కేటగిరీల్లో 58 పోస్టులను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు ఇచ్చిన జీవో 78కి ఆమోదం.
- కౌలు రైతులకు కౌలు కార్డులు అందించేందుకు నిర్ణయం. కౌలు రైతుల సంతకాలు తప్పనిసరి కాకుండా కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకోవడానికి కేబినెట్ ఆమోదం.

పంచాయతీలకు రూ.989 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ పంచాయతీలను కేంద్రం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. దీంతో గతంలో రావాల్సిన ఆర్థికసంఘం నిధులు నిలిచిపోయాయి. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర అధికారులతో సంప్రదించి లైన్ క్లియర్ చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ చొరవ తీసుకుని రాష్ట్రానికి ఆర్థిక సంఘం నిధులు త్వరగా తీసుకురావడానికి కృషి చేశారు. వీరి ప్రయత్నాలు ఫలించడంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడతగా రూ.989 కోట్లు మంజూరు చేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల ఖాతాల్లో నేరుగా జమచేయనుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాతే ఆర్థిక సంఘం నిధులకు మోక్షం కలిగిందని, దీంతో గ్రామ పంచాయతీలకు సుమారు రూ.2వేల కోట్లు వచ్చినట్లయిందని పేర్కొంటున్నారు. ఈ నిధులు జమ అయిన తర్వాత పంచాయతీల్లో చేపట్టే పనులపై నిఘా ఉంటుందని కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. దీనికి సంబంధించి ఒక పోర్టల్‌ను రూపొందించామని, ఇప్పటికే రెండు పంచాయతీల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేశామని పేర్కొన్నారు. త్వరలో ఈ పోర్టల్‌ను అమల్లోకి తెచ్చి పంచాయతీల్లో లెక్కలు పక్కాగా, పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఖర్చు చేస్తే అధికారులతో పాటు సర్పంచ్‌లపైనా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

రెండో ధనిక రాష్ట్రం తెలంగాణ

▸ విభజన తరువాత దెబ్బతిన్న ఏపీ

▸ 131.6 శాతానికి పడిపోయిన తలసరి ఆదాయం

▸ ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశ జీడీపీలో దాదాపు 30 శాతం దక్షిణాది రాష్ట్రాల నుంచే లభిస్తోందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించింది. 2023-24లో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు కలిసి దేశ జీడీపీలో 30 శాతం మేర సాధించాయని, ఈ రాష్ట్రాల తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని తన తాజా నివేదికలో తెలిపింది. తెలంగాణ తలసరి ఆదాయం 193.6 శాతం ఉండగా, కర్ణాటక 181 శాతం, తమిళనాడు 171 శాతం, కేరళ తలసరి ఆదాయం 152.5 శాతం ఉందని పేర్కొంది. సరళీకృత ఆర్థిక సంస్కరణల తర్వాత తెలంగాణ, కర్ణాటక బలమైన ఆర్థిక కేంద్రాలుగా వెలిశాయని, విభజన తర్వాత ఏపీ పరిస్థితి బాగా దెబ్బతిందని తెలిపింది. 2023-24లో తెలంగాణలో తలసరి ఆదాయం 193.6 శాతం పెరగ్గా ఏపీలో 131.6 శాతానికి పడిపోయిందని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం... తలసరి ఆదాయంలో ఢిల్లీ, తెలంగాణ, కర్ణాటక, హరియాణా తొలి నాలుగు స్థానాల్లో నిలిచి సంపన్న రాష్ట్రాలుగా గుర్తింపు పొందాయి. బిహార్, జార్ఖండ్, యూపీ, మణిపూర్, అసోం పేద రాష్ట్రాలుగా నిలిచాయి. తెలంగాణలో ఒక సగటు వ్యక్తి జాతీయ సగటు కంటే 94 శాతం ఎక్కువ ఆదాయం ఆర్జిస్తుండగా తర్వాత స్థానంలో కర్ణాటకలో సగటు వ్యక్తి 81 శాతం, తమిళనాడులో 71 శాతం ఆర్జిస్తున్నారు. పశ్చిమ రాష్ట్రాల్లో మహారాష్ట్ర, గుజరాత్ మంచి పనితీరు కనబర్చాయి. గోవా తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉంది. ఉత్తరాదిన పంజాబ్ తలసరి ఆదాయం తగ్గుతూ వస్తోంది.

జగన్ పత్రికకు రూ.650 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు ఈ లెక్కలు తెలిపారు. వలంటీర్లు ఆ పత్రికను తెప్పించుకోవడానికి వీలుగా వారికి నెలకు రూ.200 చొప్పున రెండేళ్ల పాటు ప్రభుత్వం అధికారికంగా డబ్బు మంజూరు చేసిందని, ఆ మొత్తం రూ.205 కోట్లని చెప్పారు. ఇదే పత్రికకు వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రకటనల కింద రూ.440 కోట్లు చెల్లించారని.. మిగిలిన అన్ని పత్రికలకూ కలిపి ఇదే కాలంలో రూ.400 కోట్లు మాత్రమే ఇచ్చారని వారు వివరించారు. ఈ చెల్లింపులపై ముఖ్యమంత్రి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'ఒక వ్యక్తికి లబ్ధి చేకూర్చడానికి అధికారాన్ని ఎలా దుర్వినియోగం చేస్తారు? ముఖ్యమంత్రి కుటుంబం నిర్వహిస్తున్న పత్రికను మాత్రమే తెప్పించుకోవాలని వలంటీర్లను ఆదేశించి దానికి ప్రభుత్వం తరఫున డబ్బు ఇవ్వడం కచ్చితంగా అధికార దుర్వినియోగమే. మిగిలిన అన్ని పత్రికలకూ కలిపి ఎంత డబ్బు ఇచ్చారో అంతకు మించి సొంత పత్రికకు ఎలా ఇస్తారు? ప్రజలు అధికారం ఇచ్చింది సొంత వ్యాపారాలు బాగు చేసుకోవడానికా? ఇది ఎలా జరిగిందో.. అధికార దుర్వినియోగం అవునో కాదో విచారణ జరుపుదాం' అని ఆయన అన్నారు. దీనిని మిగిలిన మంత్రులంతా సమర్థించారు. అలాగే వైసీపీ హయాంలో నియమితులైన గ్రామ/వార్డు వలంటీర్ల ఉద్యోగ కాల పరిమితి గత ఏడాది ఆగస్టులోనే ముగిసిపోయిందని కూడా అధికారులు మంత్రివర్గ సమావేశంలో తెలిపారు. దీనిపై జరిగిన చర్చలో వారు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'వలంటీర్ల కాల పరిమితిని గత ఏడాది ఆగస్టు తర్వాత పొడిగించలేదు. పొడిగించకుండా ప్రభుత్వ ఖజానా నుంచి వారికి జీతాలివ్వడానికి వీల్లేదు. అయినా ఈ ఏడాది మే నెల వరకూ 9 నెలల పాటు ఇచ్చుకుంటూ వచ్చారు. 2.20 లక్షల మంది వలంటీర్లలో సగం మంది రాజీనామా చేశారు. చేయని వారికి జూన్, జూలై, ఆగస్టు నెలలకు జీతాలు చెల్లించే ప్రతిపాదనను ఇప్పుడు కేబినెట్ ముందు పెట్టాం' అని సంబంధిత అధికారి వివరించారు. అసలు ఉద్యోగంలోనే లేని వారికి జీతాలు ఎలా ఇస్తామని కొందరు మంత్రులు ప్రశ్నించారు. అందుకే పోయిన ఏడాది ఆగస్టు నుంచి ఈ ఆగస్టు వరకూ వారి ఉద్యోగాలు పొడిగిస్తున్నట్లు ప్రతిపాదనను కూడా పెట్టామని ఆ అధికారి వెల్లడించారు. దీనిపై కొంత అధ్యయనం చేయాల్సి ఉందని, ఇప్పుడే నిర్ణయం తీసుకోవలసిన అవసరం లేదని కేబినెట్ అభిప్రాయపడింది. గ్రామ/వార్డు సచివాలయాల్లో నియమితులైన ఉద్యోగుల్లో అక్కడ ఎందరు అవసరమో.. ఎవరు అక్కర్లేదో కూడా పరిశీలించి.. అవసరం లేనివారిని సంబంధిత శాఖలకు మార్చాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. రాష్ట్రం కోసం రూపొందిస్తున్న విజన్ ప్రణాళికకు స్వర్ణాంధ్ర-47 అని పేరు పెట్టాలని కేబినెట్ నిర్ణయించింది.

తెల్ల కార్డుదారులకు 3 ఉచిత సిలిండర్లు

పేద కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించాలని కేబినెట్ నిర్ణయించింది. తెల్ల కార్డు ఉన్న కుటుంబాలకు ఏటా ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తామని టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన విషయం తెలిసిందే. ఈ హామీ తర్వాత వరుస క్రమంలో తల్లికి వందనం, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాలు ప్రారంభించాలని నిర్ణయించారు. వాస్తవానికి తల్లికి వందనం పథకాన్నే ముందు ప్రారంభించాలని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. కానీ ఎక్కువ మంది మంత్రులు గ్యాస్ సిలిండర్ల వైపు మొగ్గు చూపడంతో అదే ఖరారుచేశారు.

కౌలుదారులకు న్యాయం..

వరద బాధిత ప్రాంతాల్లో పంటలు సాగుచేసి నష్టపోయిన కౌలుదార్లకు నష్టపరిహారంపై మంత్రివర్గం చర్చించింది. తమ భూమిని కౌలుకు ఇచ్చినట్లు లిఖిత పూర్వకంగా ఇవ్వడానికి భూ యజమానులు ముందుకు రావడం లేదని, దీంతో ఏ భూమిని ఏ కౌలుదారు సాగు చేశారో గుర్తించడం కష్టమవుతోందని కొందరు మంత్రులు చెప్పారు. 'భూ యజమానులు భయభ్రాంతులకు గురి కాకుండా కౌలుదారులకు న్యాయం చేయడంపై ఆలోచన చేయాలి. భూ యజమానులతో కూడా చర్చించి వారికి ఇబ్బంది లేని విధానం రూపొందించాలి. అవసరమైతే ఒక కమిటీ వేద్దాం' అని ముఖ్యమంత్రి చెప్పారు.

బిట్స్... లా యూనివర్సిటీ

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ విద్యా సంస్థ బిట్స్, జాతీయ లా యూనివర్సిటీని అమరావతిలో ఏర్పాటు చేయించడానికి ప్రయత్నిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. బిట్స్ ఏర్పాటుపై బిర్లాలతో చర్చించానని, త్వరలో వారు అమరావతిని సందర్శించనున్నట్లు చెప్పారు. లా వర్సిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టుకు సంబంధించిన వారితో చర్చించానని, వారు కూడా సుముఖంగా ఉన్నారని వివరించారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం ప్రైవేటు యూనివర్సిటీని డీమ్డ్ యూనివర్సిటీగా మార్చడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆ వర్సిటీకి గతంలో ఇచ్చిన వంద ఎకరాలకు అదనంగా మరో వంద ఎకరాలను ఇవ్వడానికి కూడా అంగీకరించింది. తలపెట్టిన విద్యా సంస్థలన్నీ ఏర్పాటైతే అమరావతిలో సుమారు లక్ష మంది విద్యాభ్యాసం చేస్తారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

వరద సాయంపై సీఎంకు అభినందనలు

వరదల సమయంలో ఎంతో కష్టపడి బాధితులను ఆదుకోవడంతోపాటు వారికి ఆసరాగా మంచి ప్యాకేజి ఇచ్చిన ముఖ్యమంత్రికి మంత్రులంతా అభినందనలు తెలిపారు. ఆయన సమావేశ మందిరంలోకి రాగానే వారంతా లేచి నిలబడి చప్పట్లు చరిచారు. ఇది తన ఒక్కడి కృషి కాదని, మొత్తం అందరం కలిసి చేసిన శ్రమని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ఉచితంగా రూ.19 వేల ఇంజక్షన్

స్టెమీ పేరుతో కొత్తగా ప్రారంభిస్తున్న పథకం కింద గుండెపోటుకు గురైనవారికి.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన ఇంజక్షన్ ఉచితంగా అందచేయాలని కేబినెట్ నిశ్చయించింది. ఈ ఇంజక్షన్ ధర రూ.19 వేలు. ఆస్పత్రుల్లో ఈసీజీ పరీక్షలు చేసి నివేదికను ఒక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రాష్ట్రం, కేంద్రంలోని నిపుణులు దానిని చూసి రోగికి ఇంజక్షన్ ఇవ్వడం అవసరమనుకుంటే సిఫారసు చేస్తారు. దానిని ఆ రోగికి ఉచితంగా చేస్తారు. దానివల్ల ప్రాణాపాయం తప్పుతుంది. తర్వాత మరింత మెరుగైన చికిత్సకు తరలించడానికి సమయం చిక్కుతుంది.

చౌకగా చీప్ లిక్కర్..!

▸ నాణ్యత లేని లిక్కర్ బ్రాండ్లకు చెల్లుచీటీ

▸ రాష్ట్రంలో 12 ఎలైట్ షాపులకు గ్రీన్‌సిగ్నల్

▸ షాపు పక్కనే వాక్ ఇన్ స్టోర్‌కు అనుమతి

▸ లైసెన్సు ఫీజులు 50 నుంచి 85 లక్షలు

▸ త్వరలోనే మద్యం పాలసీకి నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మద్యం ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో చీప్ లిక్కర్‌ను చౌకగా అందించాలని, నాసిరకం బ్రాండ్లకు ఫుల్‌స్టాప్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సరిహద్దు రాష్ట్రాల్లోని ధరలపై అధ్యయనం చేసి.. అక్కడి ధరల ఆధారంగా ఇక్కడ సగటు ధర పెట్టాలని భావించింది. చీప్ లిక్కర్ క్వార్టర్ సీసా ధరలు తెలంగాణలో రూ.140, కర్ణాటకలో రూ.80, తమిళనాడులో రూ.90, ఒడిశాలో రూ.90గా ఉన్నందున వాటి సగటును పరిగణనలోకి తీసుకుని ఏపీలో క్వార్టర్ రూ.99గా ఉండాలని నిర్ణయించింది. గత ప్రభుత్వంలో కొత్తగా పుట్టుకొచ్చిన బ్రాండ్లను తొలగించి, వాటి స్థానంలో గతంలో ఉన్న పాపులర్ బ్రాండ్లను ప్రవేశపెట్టనుంది. సాధారణ లిక్కర్ షాపులతో పాటు కేవలం ప్రీమియం రకం మద్యం బ్రాండ్లు దొరికే ఎలైట్ షాపులకూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా 12 ఎలైట్ షాపుల ప్రారంభానికి అనుమతివ్వనుంది. తిరుపతిలో మాత్రం ఈ షాపునకు అనుమతి ఇవ్వరు. అలాగే లైసెన్సీలు వారి షాపుల పక్కన వాక్ ఇన్ స్టోర్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికోసం లైసెన్సీలు అదనంగా రూ.5 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలి. డ్రాట్ బీరు తయారు చేసి, విక్రయించే మైక్రో బ్రూవరీలకు మళ్లీ అనుమతివ్వనున్నారు. మైక్రో బ్రూవరీల్లో అప్పటికప్పుడు బీరును తయారుచేసి విక్రయిస్తారు. మైక్రో బ్రూవరీ ఏర్పాటు చేసుకునే వారు బార్‌తో సమానంగా లైసెన్సు ఫీజు చెల్లించాలి. కొత్త మద్యం పాలసీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం లభించడంతో త్వరలో నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. కేబినెట్ ఆమోదంపై తీర్మానం వచ్చిన వెంటనే ఎక్సైజ్ చట్టంలో సవరణకు ఆర్డినెన్స్ ఫైలును రాజ్‌భవన్‌కు పంపనుంది. ఆర్డినెన్స్ జారీ అయిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సెప్టెంబరు నెలాఖరుతో ప్రభుత్వ షాపుల పాలసీ ముగుస్తున్నందున కొత్త పాలసీ అమలుకు గడువు సరిపోదనే వాదన వినిపిస్తోంది. అక్టోబరు మొదటి వారంలో ప్రైవేటు షాపుల పాలసీని అమల్లోకి తెచ్చేలా షెడ్యూలు రూపొందించేందుకు కసరత్తు జరుగుతోంది. తొలుత 3,396 షాపులకు నోటిఫికేషన్ ఇస్తారు. ఆ తర్వాత గీత కార్మికుల కోసం అందులో 10శాతం అంటే 340 షాపులకు విడిగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

షాపుల లైసెన్సు ఫీజులను భారీగా పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ప్రాతిపదికన కనీసం రూ.50లక్షల నుంచి రూ.85లక్షల వరకు ఫీజులు పెట్టనుంది. ఎలైట్ షాపుల లైసెన్స్ ఫీజు రూ.కోటిగా ఉండనుంది. అయితే వీటికి కాలపరిమితి ఐదేళ్లు ఉంటుంది. ఏటా 10శాతం లైసెన్స్ ఫీజు పెంచుతారు. షాపుల దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ప్రతి మద్యం కంపెనీ కనీసం ఒక బ్రాండ్‌ను తక్కువ ధరతో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం మరో నిబంధన పెట్టనుంది.



వరద బాధితుల సహాయార్థం సీఎం చంద్రబాబుకు రూ.2 కోట్ల చెక్కును అందజేస్తున్న అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు పి.వసంతరావు, తదితరులు



గీతం యూనివర్సిటీ తరఫున సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న ఎంపీ ఎం.శ్రీభరత్

వరద బాధితులకు సాయం

▸ అల్ట్రాటెక్ సిమెంట్స్ 2 కోట్లు, గీతం వర్సిటీ కోటి

▸ ఏపీసీఎంఆర్ఎఫ్‌కీ 50 వేలు ఇస్తా... కుమారి ఆంటీ

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పిలుపునకు స్పందించిన ఎందరో దాతలు వరద బాధితుల్ని ఆదుకునేందుకు ముందుకొస్తున్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును పలువురు దాతలు కలిసి, సీఎంఆర్ఎఫ్ పేరుతో విరాళాల చెక్కులను అందజేశారు. వరద బాధితుల కోసం విరాళాలిచ్చిన దాతల్ని సీఎం చంద్రబాబు అభినందించారు. అల్ట్రాటెక్ సిమెంట్స్ అధినేత డాక్టర్ వసంతరావు పాలపల్లి రూ.2 కోట్లు, గీతం యూనివర్సిటీ తరఫున విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ రూ.కోటి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన వ్యక్తిగత విరాళం రూ.5 లక్షలతో కలిపి, నియోజకవర్గ ప్రజల తరఫున రూ.83,44,624, భాగ్యనగర్ గ్యాస్ ఎండీ రామ్మోహన్‌రావు రూ.50 లక్షలు, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ తరఫున మోహిత్ బన్సాల్ రూ.50 లక్షలు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య నియోజకవర్గ ప్రజలు కలసి రూ.35 లక్షలు, ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ తరఫున డాక్టర్ విజయ్ కుమార్ రూ.20 లక్షలు, రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ హైర్ బసెస్ ఓనర్స్ అసోసియేషన్ తరఫున ఎస్ వెంకటేశ్వరరెడ్డి రూ.24 లక్షలు, గుంటూరుకు చెందిన సీఏ గడ్డిపాటి సుధాకర్ రూ.20 లక్షలు, మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ రూ.14.50 లక్షలు, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ తరఫున వై రవిబాబు రూ.10 లక్షలు, 108 ఎంప్లాయిస్ అసోసియేషన్ రూ.10 లక్షలు, ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ రూ.10 లక్షలు, రాయదుర్గం గార్మెంట్స్, స్పాంజ్ ఐరన్ ప్లాంట్స్ రూ.8.20 లక్షలు, మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో నెయ్యలకుల మత్స్యకారుల సంక్షేమ సంఘం రూ.6.50 లక్షలు, కిన్నెర ఫౌండేషన్ కిన్నెర మాల్యాద్రి రూ.5 లక్షలు, ఎస్ఏఎస్ఆర్ ఇన్‌ఫ్రా కే వెంకటరమణారెడ్డి రూ.5 లక్షలు చెక్కును సీఎంకు అందజేశారు.

లోకేశ్‌కు అందించిన విరాళాలు

వరద బాధితుల సహాయార్థం పలువురు దాతలు బుధవారం ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్ చెక్కులు అందజేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.8,11,063, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.6,38,435, గుంటూరుకు చెందిన దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ రూ.6,01,116, అమలాపురానికి చెందిన బోనం వెంకట చలమయ్య ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ బోనం కనకయ్య రూ.5 లక్షలు, సుధా సోమెనీ సిరావిక్స్ నిర్వాహకులు రూ.5 లక్షలు అందజేశారు. కాగా, తెలంగాణలో వరదల బారిన ప్రజల సహాయార్థం రూ.50 వేలు సాయం అందించిన కుమారి ఆంటీ... ఏపీకి కూడా రూ.50 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్

▸ మేఘా సంస్థకే అప్పగింతకు కేబినెట్ ఆమోదం



అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా 63,656 చదరపు కిలోమీటర్ల మేర కొత్త వాల్‌ను రూ.990 కోట్లతో నిర్మించే బాధ్యతను మేఘా ఇంజనీరింగ్‌కు అప్పగింతకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. జల వనరుల శాఖ జారీ చేసిన మెమోకు ఆమోదం తెలిపింది. అయితే.. డయాఫ్రం వాల్ నిర్మాణంలో అనుభవం కలిగిన జర్మన్ సంస్థ 'బావర్'తో ఈ పనులు చేయించాల్సిందేనని కేంద్ర జల శక్తి శాఖ, కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) షరతు పెట్టాయి. దీంతో వాల్ నిర్మాణాన్ని సబ్‌కాంట్రాక్టు కింద బావర్‌కే మేఘా ఇవ్వనుంది. ఈ అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. కేంద్ర జల సంఘం నిర్ణయం మేరకు కొత్తగా టెండర్లు పిలవకుండా ప్రస్తుతం డయాఫ్రం వాల్ మరమ్మతు పనులు చేస్తున్న మేఘాకే 'స్టాండర్డ్ ఆఫ్ రేట్స్ (ఎస్‌వోఆర్)' మేరకు పనులు అప్పగించడం వల్ల ఒక సీజన్ నష్టపోకుండా లక్ష్యం మేరకు పనులు పూర్తి చేసే వీలుందని మంత్రివర్గం అభిప్రాయపడింది. ఈ నెల ఏడో తేదీన జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జారీ చేసిన మెమోను యథాతథంగా ఆమోదించింది. కొత్త వాల్ నిర్మాణానికి సంబంధించి రెండు అంశాలను రాష్ట్రప్రభుత్వం కేంద్రం ముందుంచింది. ఒకటి.. కొత్తగా టెండర్లు పిలవడం; రెండోది.. ప్రస్తుత కాంట్రాక్టు సంస్థనే కొనసాగించడం. రెండో దానికే కేంద్రం మొగ్గు చూపింది. కొత్త వాల్ నిర్మాణ పనులు మేఘాకు అప్పగిస్తూనే.. 100 మీటర్ల లోతులో ప్లాస్టిక్ డయాఫ్రం వాల్ నిర్మాణంలో అనుభవం కలిగి.. రాతి నేల తగిలేంత వరకూ లోతుల్లోకి వెళ్లి గోడకట్టే బావర్ సంస్థ సహకారం తీసుకోవడం మంచిదని కేంద్ర జలశక్తి శాఖ సూచించింది. కొత్త వాల్‌ను 1.5 మీటర్ల వెడల్పున నిర్మించాలని జల సంఘం స్పష్టం చేసింది. డయాఫ్రం వాల్ తప్ప విగతా పనులన్నీ మేఘాయే చేస్తుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 19 సెప్టెంబరు 2024

కౌన్సెలింగ్

మాయిశ్చరైజర్లు ఇంజక్షన్ రూపంలో...

డాక్టర్! నా వయసు 50 ఏళ్లు. చర్మం మీద ముడతలతో పెళ్లిళ్లు లాంటి వేడుకలకు దూరంగా ఉంటున్నాను. అలాగని ఖరీదైన కాస్మటిక్ చికిత్సలు తీసుకోలేను. కాబట్టి ఏదైనా తేలికపాటి ప్రత్యామ్నాయం సూచించగలరు?

- ఓ సోదరి, హైదరాబాద్

చర్మపు తేమను పెంచడానికి, హైల్యురోనిక్ యాసిడ్ ఎంతో బాగా ఉపయోగపడుతుంది. దీన్ని నేరుగా చర్మంలోకి ఇంజెక్ట్ చేయగలిగే వెసులుబాట్లు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. అలాగే వయసుతో పాటు పెరిగే చర్మపు ముడతలను తగ్గించడం కోసం, హైల్యురోనిక్ యాసిడ్‌తో పాటు, గ్లూటోథయాన్, పాలీడియాక్సీ న్యూక్లియొటైడ్ అనే పెప్టైడ్స్‌ను కలిగి ఉండే వాటినీ, విటమన్ సిని కూడా జోడించి ఇంజెక్ట్ చేయవచ్చు. వీటితో యాంటీ ఏజింగ్, స్కిన్ లైటెనింగ్ ప్రయోజనాలను కూడా పొందవచ్చు. వీటితో చర్మం మెరుగ్గా హైడ్రేట్ అవడంతో పాటు మెరుపును కూడా సంతరించుకుంటుంది.



ఏ వయసు వారైనా...

ఈ చికిత్సకు వయసుతో సంబంధం లేదు. 20 నుంచి 60 ఏళ్ల వాళ్లు కూడా ఈ ఇంజెక్టబుల్ చికిత్సల ప్రయోజనాలను పొందవచ్చు. వీటిలో వయసుకు తగిన ఇంజెక్టబుల్ మాయిశ్చరైజర్స్ ఉన్నాయి. కొన్ని ఇంజెక్షన్ల ప్రభావం 3 నుంచి ఆరు నెలలు ఉంటుంది. ఇంకొన్నిటిని ప్రతి ఆరు నెలలకూ రిపీట్ చేస్తూ ఉండాలి. హైల్యురోనిక్ యాసిడ్ సాంద్రత మీదే ఇదంతా ఆధారపడి ఉంటుంది. ఇది డే కేర్ ప్రొసిజర్. చికిత్స తర్వాత సగం రోజులోనే వాపు మొత్తం తగ్గిపోతుంది. ఒక్క రోజులో పూర్తిగా నార్మల్ అయిపోతుంది. ప్రభావం కనిపించడానికి వారం నుంచి పది రోజుల సమయం పడుతుంది. పెళ్లిళ్లు, వేడుకలకు ముందు ముఖం మెరుస్తూ, ఆకర్షణీయంగా కనిపించడం కోసం ఈ చికిత్సలను ఎవరైనా ఎంచుకోవచ్చు. ఈ ఇంజక్షన్లకు ఎటువంటి దుష్ప్రభావాలూ ఉండవు.

- డాక్టర్ స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

ఇంటికి న్యూ లుక్

ఇంటిని అందంగా అలంకరించుకోవడం మన చేతుల్లో పనే. కాస్త అభిరుచి ఉంటే చాలు, ఇల్లు చిన్నగా ఉన్నా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చు. నిపుణులు సూచిస్తున్న హోమ్ డెకరేషన్ టిప్స్ ఇవి.

- ఇంటిని అలంకరించే ముందు ఏయే వస్తువులు తీసేయాలి. కొత్తగా ఏ వస్తువులు తీసుకురావాలి అనే విషయాల గురించి పేపర్‌పై రాసుకోవాలి. ప్లానింగ్ ఉంటేనే ఫలితం బాగుంటుంది. సమయం, డబ్బులు ఆదా అవుతాయి.
- డెకరేషన్ ఐడియాల కోసం మ్యాగజైన్లు తిరగేయాలి. ఆన్‌లైన్‌లో బోలెడు వెబ్‌సైట్లు ఉన్నాయి. వాటిపై ఒక లుక్కేయాలి.
- మీ అభిరుచికి తగిన విధంగా, అవసరానికి తగ్గట్టుగా ఫర్నిచర్‌ను ఎంపిక చేసుకోవాలి. అనవసరమైన వాటికి ఇంట్లో చోటివ్వద్దు.
- ఇల్లు చిన్నగా ఉన్నట్లయితే ప్రతీదీ ప్లాన్‌గా అమర్చుకోవాలి. ఇంట్లో ప్రతి మూలను మీరు ఉపయోగించుకునేందుకు వీలుగా ఉండాలి.
- ఇంట్లోకి సహజసిద్ధమైన వెలుతురు వచ్చేలా ఉండాలి. వెలుతురుకు అడ్డుపడేలా డెకరేషన్ ఉండకూడదు. కిటికీలకు డార్క్ కర్టెన్స్ వేయకూడదు. ఇంట్లో అన్ని ప్రదేశాల్లో వెలుతురు సమంగా ఉండేలా ల్యాంప్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- హాల్‌లో గోడకు పెయింటింగ్స్ వేలాడదీసుకుంటే ఆకర్షణీయంగా ఉంటుంది. అలా అని మొత్తం గోడను పెయింటింగ్స్‌తో నింపకూడదు.
- ఇండోర్ ప్లాంట్స్‌తో ఇల్లు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అంతేకాకుండా ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కూడా చేకూరుతాయి.



- ఈ మధ్య కాలంలో ఇంట్లో ఒక్కో గదిలో గోడలకు రకరకాల రంగులు వేస్తున్నారు. అయితే వీటి ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. హాల్‌లో లేత రంగులు వేయాలి. పడకగదిలో ఒక గోడకు మాత్రమే భిన్నమైన రంగును ఎంచుకోవాలి. కళ్లకు హాయినిచ్చే రంగులను ఎంచుకోవడం ఉత్తమం.
- ప్రధాన ద్వారం పక్కన స్థలం ఉంటే కొన్ని మొక్కలను ఏర్పాటు చేసుకోవచ్చు. వాటి మధ్యలో బుద్ధుని విగ్రహం చిన్నది పెట్టుకుంటే సూపర్బ్‌గా ఉంటుంది.
- బాల్కనీలో మొక్కలతో పాటు సాయంకాలం కూర్చునేందుకు అనువుగా కుర్చీలు ఏర్పాటు చేసుకుంటే టీ టైమ్‌ని ఎంజాయ్ చేయవచ్చు.
- మీపై బాగా ప్రభావం చూపిన కొటేషన్‌ను గదిలో ఒక చోట గోడపై ఫ్రేమ్ చేయించి పెట్టుకోవచ్చు. రోజూ అది మీలో స్ఫూర్తిని నింపుతూ ఉంటుంది.



పరుగు పందేలకు వయసుతో పని లేదని నిరూపించారు హైదరాబాద్‌కు చెందిన **సుంకర మల్లీశ్వరి, కృతి కడాకియా.** జాతీయ స్థాయిలో పతకాలను గెలుచుకున్న ఈ వనితలు, తాజాగా స్వీడన్ గోథెన్‌బర్గ్‌లో జరిగిన వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. 45, 47 ఏళ్ల ఈ పరుగుల రాణులు 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

నడి వయసు పరుగుల రాణులు

"మాది కాకినాడ దగ్గర ఆర్యవటం. అది ఇసుక ప్రాంతం. ఆ ఇసుక నేల మీదే, నాన్నతో పొలానికీ, అమ్మతో గుడికీ పరుగులు పెట్టేదాన్ని. అలా చిన్నప్పటి నుంచీ ఇసుకలో పరుగులు పెట్టడం వల్లనేమో, పరుగు చాలా సులువైపోయింది. ఏమాత్రం ఆయాస పడకుండా, సునాయాసంగా పరుగులు పెట్టడం అలవాటైపోయింది. బడిలో, ఎన్‌సిసిలో చురుగ్గా ఉండే నేను, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పైచేయి సాధిస్తూ, అంతిమంగా 1993లో జాతీయ స్థాయి పరుగు పోటీలో తొలి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాను. అది మర్చిపోలేని అనుభవం. అక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగే సమయంలోనే నాకు పెళ్లైపోయింది. దాంతో పరుగుకు బ్రేక్ పడింది. అలా ఏకంగా 20 ఏళ్ల పాటు పరుగుకు దూరంగా ఉండిపోయాను. పిల్లలిద్దరూ ఎదిగిన తర్వాత, కొవిడ్‌కు ముందు, మళ్లీ నేను గ్రౌండ్‌లోకి అడుగు పెట్టి, నాలోని క్రీడాకారిణిని నిద్ర లేపాను. అలా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాను. రెండో ఇన్నింగ్స్‌లో 6 జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. అన్ని పోటీల్లో స్వర్ణ పతకాలనే సాధించాను. 100, 200, 400 మీటర్ల స్ప్రింట్‌లో పాల్గొంటూ ఉంటాను. అలాగే రిలేల్లో కూడా పాల్గొంటూ ఉంటాను. గత ఆగస్టులో, స్వీడన్‌లో, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న పోటీల్లో 100, 200, 400 మీటర్ల పరుగు పందెంతో పాటు, 100, 4x400 రిలే పోటీల్లో కూడా పాల్గొన్నాను.



క్రీడాస్ఫూర్తి చెక్కుచెదరలేదు

తొలి 50 ర్యాంకుల్లో...

35 నుంచి 100 ఏళ్ల వయస్కుల కోసం ఉద్దేశించిన పోటీలే.. వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్. ఈ పోటీల్లో మెడల్స్ కంటే అంతర్జాతీయ ర్యాంకింగ్ ప్రధానం. ఈ పోటీల్లో, రిలేలో 5, 7వ స్థానాలను పొందగలిగాను. వ్యక్తిగతా పోటీల్లో 30, 42, 46 ర్యాంకులు సాధించాను. ఈ ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో తెలంగాణా నుంచి 129 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మరీ ముఖ్యంగా దశాబ్దాల అనుభవమున్న ప్రపంచవ్యాప్త క్రీడాకారులు, ఒలింపిక్ విజేతలు లాంటి హేమాహేమీలు ఈ పోటీల్లో పాల్గొంటారు కాబట్టి గెలుపు కష్టమే! అయినా ఈ పోటీల్లో పాల్గొనే అర్హత పొందడమే మహా అదృష్టంగా భావిస్తూ ఉంటాం. మరో రెండేళ్లలో జరగబోయే అంతర్జాతీయ పోటీల్లో కచ్చితంగా స్వర్ణ పతకం గెలవాలనే పట్టుదలతో సాధన చేస్తున్నాను.

పట్టుదలే ప్రధానం

సాధారణంగా మహిళలు పెళ్లి, పిల్లల తర్వాత కెరీర్‌కు గుడ్‌బై చెప్పేస్తూ ఉంటారు. కానీ పెళ్లి , ఆ తర్వాత రెండు సిజేరియన్లు, పిల్లల పెంపకంతో 20 ఏళ్ల పాటు పూర్తిగా ఇంటికే పరిమితమైపోయినా, నాలో క్రీడాస్ఫూర్తి చెక్కుచెదరలేదు. సమయం కలిసి రాగానే మళ్లీ పరుగుకు పదును పెట్టాను. నా ఎదుగుదల వెనక మా వారు లక్ష్మణ్ మూర్తి, పిల్లల ప్రోత్సాహం కూడా లేకపోలేదు. మా వారిది కన్‌స్ట్రక్షన్ కంపెనీ. బాబు ఇంటర్ చదువుతున్నాడు. పాప 8వ తరగతి. బాబు కరాటెలో జాతీయ స్థాయికి ఎదిగాడు. పాప పరుగు పందేల్లో రాణిస్తోంది. నేనిప్పటివరకూ 38 నుంచి 40 స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలు సాధించాను. పాల్గొన్న ప్రతి పోటీలో పతకం గెలవడం నా లక్ష్యం. మరో రెండేళ్లలో జరగబోయే వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించాలనే పట్టుదలతో ఉన్నాను.

- సుంకర మల్లీశ్వరి

"వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 45 నుంచి 49 ఏళ్ల విభాగంలో పాల్గొన్నాను. నా వయసు 47. మాది ముంబయి అయినా, 26 ఏళ్ల క్రితమే పెళ్లి చేసుకుని, హైదరాబాద్ వలస వచ్చేశాను. 2016 నుంచి ఫ్రీల్యాన్స్ ఇంటీరియర్ డిజైనర్‌గా వృత్తి జీవితాన్ని కొనసాగిస్తూనే, క్రీడాకారిణిగా కూడా రాణిస్తున్నాను. 2015లో 10, 21 వేల కిలోమీటర్ల మారథాన్స్‌లో పాల్గొన్నాను. 400, 800, 1500 మీటర్ల పరుగు పందేల్లో కూడా రాణించాను. జాతీయ పోటీల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలను గెలుచుకున్నాను. వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ నా తొలి అంతర్జాతీయ ఈవెంట్. దీన్లో 800 మీటర్ల మొట్టమొదటి పోటీ, స్వీడన్‌లోని న్యూ ఉల్లేవి ఒలింపిక్ స్టేడియంలో జరిగింది. ఆ పోటీలో నేను మునుపటి కంటే

మెరుగ్గా రాణించగలిగాను

ఎంతో బాగా రాణించి, 12 సెకన్లు తక్కువ సమయంలోనే, 3:02 నిమిషాల్లోనే 800 మీటర్ల పరుగును ముగించి, ప్రపంచంలో 28వ ర్యాంకును పొందగలిగాను. తర్వాత జోర్ ల్యాండా స్టేడియంలో 1500 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని, 19వ స్థానాన్ని దక్కించుకోగలిగాను. 4x400 రిలే పోటీల్లో మన భారతీయ జట్టు, 4 నిమిషాల 47 సెకన్లలోనే పోటీని పూర్తి చేసి, ప్రపంచ ర్యాంకింగ్‌లో ఆరవ స్థానంలో నిలిచింది. మా వారిది ఫార్మస్యూటికల్ వ్యాపారం. నాకిద్దరు అమ్మాయిలు. ఇద్దరూ విదేశాల్లో చదువుకుంటున్నారు. ఈ వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు గెలవకపోయినా, మరో రెండేళ్లలో జరగబోయే



పోటీల్లో భారత దేశం గర్వపడేలా పతకాలను గెలుచుకోవాలని ఆశిస్తున్నాను"

- కృతి కడాకియా

• గోగుమళ్ల కవిత

130 ఏళ్ల చరిత్ర ఉన్న వ్యాపార సామ్రాజ్యం. తండ్రి చనిపోవడంతో మూడు పదుల వయసులో వ్యాపార బాధ్యతలను భుజానకెత్తుకోవాల్సి వచ్చింది. అయితే తన మీద ఉంచిన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయలేదు. సమర్థవంతమైన వ్యాపారవేత్తగా సంస్థను ప్రగతి పథంలో నడిపిస్తూ 'కిర్లోస్కర్ టాటా' సంస్థకు తగిన వారసురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమే మానసి కిర్లోస్కర్ టాటా. కిర్లోస్కర్ వంశంలో ఐదో తరానికి చెందిన మానసి విశేషాలు ఇవి...



మానసి... సక్సెస్‌కు మారుపేరు

కిర్లోస్కర్ గ్రూపు సంస్థలకు అంతర్జాతీయంగా బ్రాండ్ ఇమేజ్ ఉంది. దేశీయంగా అగ్రగామి సంస్థలుగా గుర్తింపు పొందిన వాటిల్లో కిర్లోస్కర్ ఒకటి. 2022 వరకు విక్రమ్ కిర్లోస్కర్ వ్యాపార బాధ్యతలను చూసుకునే వారు. 64 ఏళ్ల వయసులో ఆయన గుండెపోటుతో చనిపోయారు. దాంతో వ్యాపార నిర్వహణ బాధ్యతలు ఆయన కూతురు మానసి భుజానకెత్తుకుంది. 1990లో జన్మించిన మానసి వ్యాపార బాధ్యతలు చేపట్టాక సంస్థ గణనీయమైన విజయాలు సాధించింది. అయినా మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు మానసి పెద్దగా ఆసక్తి చూపరు. కుటుంబ గౌరవాన్ని,



వ్యాపార వారసత్వాన్ని నిలబెట్టేందుకు ఆమె ఎప్పుడూ కష్టపడుతుంటారు. రతన్ టాటా సవతి సోదరుడు అయిన నోయల్ టాటా కుమారుడు నెవిల్లే టాటాను 2019లో ఆమె వివాహం చేసుకున్నారు. అలా టాటా మనవరాలిగా మారిపోయారు. ఈ వివాహంతో రెండు అగ్రశ్రేణి వ్యాపార కుటుంబాల మధ్య బంధుత్వమే కాకుండా ఆశయాలను, లక్ష్యాలను సాధించేందుకు కలిసి పని చేసే అవకాశం దక్కింది. మానసి తల్లి గీతాంజలి కిర్లోస్కర్ కిర్లోస్కర్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

బాధ్యతలు చేపట్టాక...

మానసి చదువంతా విదేశాల్లోనే జరిగింది. ఆమెరికాలోని రోడ్ ఐలాండ్ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో ఆమె ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. తండ్రి తరువాత కిర్లోస్కర్ సిస్టమ్స్ జాయింట్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా నియమించబడ్డారు. అంతేకాకుండా టయోటా ఇంజన్ ఇండియా లిమిటెడ్, కిర్లోస్కర్ టయోటా టెక్స్‌టైల్ ప్రైవేట్ లిమిటెడ్, టయోటా మెటీరియల్ హ్యాండ్లింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెనో కిర్లోస్కర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. సంస్థలను విజయపథంలో నడిపించేందుకు ఆమె చాలా కష్టపడ్డారు. టయోటా కిర్లోస్కర్ మోటార్ విభాగంలో మూడేళ్ల పాటు శిక్షణ తీసుకున్నారు. అక్కడే టెక్నికల్ ప్రొసీజర్లు, తయారీ, జపనీస్ వర్క్ కల్చర్, క్వాలిటీ కంట్రోల్ టెక్నిక్స్, కమర్షియల్ ఆపరేషన్స్ వంటి విభాగాల్లో పట్టు సాధించారు. సంస్థ బాధ్యతలు చేపట్టడానికి ముందే ఆమె పూర్తి స్థాయిలో సిద్ధమయ్యారు. కిర్లోస్కర్ సంస్థ టయోటాతో కలిసి ఇన్నోవా, ఫార్చ్యూనర్ కార్ల తయారీ, అమ్మకాలను ఇండియాలో నిర్వహిస్తోంది.

బిజీ లైఫ్‌లోనూ....

నిత్యం వ్యాపార నిర్వహణలో బిజీగా గడిపే మానసి తన హాబీలను నెరవేర్చుకునేందుకు సమయం కేటాయిస్తుంది. మానసి మంచి స్విమ్మర్. అడ్వెంచర్లు చేయడమంటే మానసికి చాలా ఇష్టం. పర్వతాలు అధిరోహించడం, డీప్ సీ డైవింగ్, టెన్నిస్, వాటర్ స్పోర్ట్స్‌ను ఇష్టపడతారు. అలాగే ఆర్ట్ గ్యాలరీలను, హిస్టారికల్ సైట్స్‌ని, మ్యూజియంలను సందర్శించేందుకు అమితాసక్తి కనబరుస్తుంటారు. 'కేరింగ్ విత్ కలర్' అనే స్వచ్ఛంద సంస్థతో కలసి ఆమె పని చేస్తున్నారు. ఈ సంస్థ మన దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య మెరుగవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తోంది. అంతేకాకుండా మానసి మంచి పెయింటర్ కూడా. ఆమె వేసిన చిత్రాలు ఎగ్జిబిషన్లలో ప్రదర్శనకు కూడా పెట్టారు.

కొత్త తరాన్ని ప్రకృతికి చేరువ చెయ్యడం, మొక్కలు, జంతువులు, పక్షుల్లోని వైవిధ్యాన్ని పరిచయం చెయ్యడం, వాటి సంరక్షణ మన బాధ్యత అని గుర్తించేలా చెయ్యడం...
ఈ లక్ష్యాలతో **సాయిదేవి సంజీవిరాజా** చేపట్టిన ప్రయత్నం...
వేలాది పిల్లలకు చేరువై, వారిలో స్ఫూర్తి నింపుతోంది.
"ప్రకృతి విలువ పిల్లకు తెలియాలి. వాళ్లకు దానిపట్ల ఆసక్తి, ఆపేక్ష కలిగించాలి. అప్పుడే ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సాధ్యం" అంటున్న సాయిదేవి గురించి ఆమె మాటల్లోనే...

కొత్త తరానికి ప్రకృతి పాఠాలు



"మా ఊరుకు కొద్ది దూరంలో అడవి. ఇక మా బడి పరిసరాలైతే జూపార్క్ మాదిరిగా ఉండేవి. పక్షులు, జంతువులు, ఆహ్లాదమైన ప్రకృతి... వీటి మధ్య నా బాల్యం ఆడుతూ పాడుతూ సాగింది. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో వన్యప్రాణుల అభయారణ్యం ఉంది. దానికి సమీపంలోని రాజాపాళ్యం మా ఊరు. అక్కడ మా స్కూలు దాదాపు 30 ఎకరాల్లో విస్తరించి ఉండేది. అందులో నెమళ్ళు, ఊసరవెల్లులు, పునుగు పిల్లులు, ఇంకా ఎన్నో జంతువులు, పక్షులు పుష్కలంగా ఉండేవి. అప్పుడప్పుడు పాములు కూడా కనిపించేవి. మా బడిలోనే మా అమ్మ టీచర్. కొన్నిసార్లు నాకు సెలవున్నా... అమ్మ స్కూల్‌కి వెళ్ళాల్సి వచ్చేది. అమ్మతో నేనూ వెళ్ళేదాన్ని. పాఠాలు లేవు కాబట్టి... నాకు నచ్చినట్టు ఆ పరిసరాల్లో తిరిగేదాన్ని. మాది చిన్న పట్టణం. పెద్దగా వినోదాలేవీ ఉండేవి కావు. ఖాళీ సమయం పుష్కలంగా ఉండేది. నేను, నా ఫ్రెండ్స్ చేసిన సాహసాలకు లెక్కలేదు. నేచురలిస్ట్ అవ్వాలనుకున్నా. కానీ.. ఇంట్లో వాళ్ళ ఒత్తిడితో... ఎంబీఏ చదివాను.

ఆ ధ్యాస పెద్దల్లోనే లేదు...

చదువు పూర్తి చేశాక... బెంగళూరు వచ్చాను. అక్కడ... కర్ణాటకలోని ఎలిఫెంట్ కారిడార్స్ సంరక్షణ కోసం పాటుపడుతున్న ఒక సైంటిస్ట్‌తో పని చేసే అవకాశం వచ్చింది. ఆ సమయంలోనే 'నేచర్ వాక్స్' నిర్వహించడం ప్రారంభించాను. మళ్ళీ నాకు బాల్యంలోకి అడుగు పెట్టినట్టనిపించింది. నాకు ప్రకృతిలో నడక, రకరకాల జాతుల పక్షుల్ని గుర్తించడం ఎంతో ఇష్టం. కానీ చుట్టూ ఎంతో ప్రకృతి ఉన్నా... పిల్లల్లో ఆ ఆసక్తి నాకు కనిపించలేదు. ప్రతిదీ గమనిస్తూ, ఎప్పుడూ ప్రశ్నిస్తూ, అన్నీ తెలుసుకోవాలనే తపన పిల్లల్లో కొరవడితే... అది వారి వికాసానికి అవరోధంగా మారుతుంది. వాళ్ళు ప్రశ్నలు వేసి, సమాధానాలు కోరే వాతావరణాన్ని తల్లితండ్రులు, టీచర్లు కల్పించాలి. అయితే పోటీ చదువుల్లో పడిన పిల్లలకు... బడి వేళల తరువాత మరే యాక్టివిటీ ఉండదు. ఇంటికి వెళ్ళి మళ్ళీ పాఠాలు చదవడం, హోమ్ వర్క్ చేసుకోవడం, లేదా గాడ్జెట్స్ చూసుకోవడం. దీంతో ప్రకృతితో కానీ, అవుట్‌డోర్ యాక్టివిటీసతో కానీ వాళ్ళకు ఎలాంటి సంబంధం ఉండదు. మరొక వైపు అడవులు అంతరించి పోతున్నాయి. ఎన్నో జీవజాతులు అంతరించి పోతున్నాయి. ప్రకృతిని కాపాడుకోవాలనే ధ్యాస పెద్దల్లోనే కనిపించడం లేదు. కనీసం రాబోయే తరమైనా దీన్ని పట్టించుకోకపోతే... ఎడారులు తప్ప మరేం మిగలవు. దీనికి పరిష్కారం ఏమిటని ఆలోచించాను. 2000లో... కరోనా విజృంభణకు కాస్త ముందు... బెంగళూరులోని కబ్బన్ పార్కులో పిల్లల కోసం ఒక కార్యక్రమం ఏర్పాటు చేశాను. ఇన్‌స్టాగ్రామ్ పోస్టుల ద్వారా, ఆ నోటా ఈనోటా తెలుసుకొని... కేవలం ఏడుగురు పిల్లలు మాత్రం దానికి హాజరయ్యారు. చెట్లు, పక్షులు, జంతువుల గురించి వాళ్ళకు ఎన్నో విషయాలు చెప్పాను. 'ఎందుకు', 'ఎలా', 'ఏమిటి'? అని వాళ్ళు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం నాకు ఆనందం కలిగించింది.

50 స్కూళ్ళు 50 పార్కుల భాగస్వామ్యం...

ఆ తరువాత వాళ్ళు మరికొందరు పిల్లలకు ఈ సంగతి చెప్పారు. వారు కూడా తదుపరి కార్యక్రమాలకు రావడానికి ఆసక్తి చూపించారు. ఇంతలోనే కరోనా వచ్చింది. దీంతో... ఆన్‌లైన్ సెషన్స్ పెట్టాలని వాళ్ళు కోరారు. దీని కోసం ఒక ప్రణాళిక రూపొందించాను. స్టోరీ టెల్లింగ్, చర్చా కార్యక్రమాలను నిపుణుల భాగస్వామ్యంతో నిర్వహించాను. అలాగే పూర్తిగా ప్రకృతి సంబంధమైన అంశాల ఆధారంగా కథలు రాశాను, సెషన్స్ ఏర్పాటు చేశాను. పిల్లల ఉత్సాహం చూసి... తల్లితండ్రులు కూడా నన్ను సంప్రతించారు. నా ప్రయత్నానికి మద్దతు ఇచ్చారు. 'థికెట్ టేల్స్' ఏర్పాటుకు అది దారి తీసింది. 'థికెట్ టేల్స్' ప్రకృతి ఆధారమైన ఒక విద్యా సంస్థ. ఉత్తేజం కలిగించే అనుభవాల ద్వారా పిల్లలను ప్రకృతికి అనుసంధానం చేయడం కోసం ఇది పని చేస్తుంది. లాక్‌డౌన్ తరువాత... మళ్ళీ ఆఫ్‌లైన్ సెషన్స్ మొదలుపెట్టాను. 'లెర్న్ ఎరౌండ్ నేచర్' అనే ప్రోగ్రామ్‌ను 'థికెట్ టేల్స్' నిర్వహిస్తోంది. ఇది తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు చెందిన ఆరు, ఏడు ఎనిమిది తరగతుల విద్యార్థుల కోసం. ప్రకృతితో మమేకమయ్యే అనుభవాలు, నేచర్ వాక్స్, చర్చలు, దృశ్యరూపంలో సైన్స్, సోషల్ సైన్స్‌ను వారికి వివరించడం, బృంద కార్యకలాపాలు దీనిలో భాగాలు. ఇది ఏడాది పాటు... ప్రతి వారం ఎనభై నిమిషాలు ఉండే ప్రయోగాత్మకమైన కార్యక్రమం. 'గ్రీన్‌జెన్ ఎక్స్‌ప్లోరర్స్' అనే మరో కార్యక్రమం కింద పిల్లలను జీవ వైవిధ్యం కలిగిన పార్కులకు తీసుకువెళ్ళి, శాస్త్రీయంగా, ప్రయోగాత్మకంగా వివిధ అంశాలను వివరిస్తున్నాం. మొక్కలు, పక్షులు, జంతువులు.. వాటిలో వైవిధ్యం, వాటి లక్షణాలు, తీసుకొనే ఆహారం, ప్రత్యేకతలు, వాటిని సంరక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలు... ఇలా అనేక విషయాలు వీటిలో ఉంటాయి. ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం బెంగళూరులోని యాభై స్కూళ్ళు, యాభై పార్కులు, కొన్ని వేల మంది పిల్లలు భాగస్వాములు.

'ఇదంతా నాన్సెన్స్' అన్నారు...

ప్రస్తుతం మా సంస్థలో ఇద్దరు ఫుల్ టైమ్ ఫెసిలిటేటర్లు, శిక్షణ పొందిన బయాలజిస్ట్, సైన్స్ కమ్యూనికేటర్, ఒక అకడమిక్ డైరెక్టర్ ఉన్నారు. మా కార్యక్రమాలన్నీ పూర్తిగా ఉచితమే. దాతలు ఇచ్చే విరాళాలతోనే నిర్వహణ సాగుతోంది. స్కూళ్ళకు ఈ కాన్సెప్ట్ వివరిస్తే... మొదట్లో 'ఇదంతా నాన్సెన్స్' అన్నవాళ్ళు, "నాలుగు రోజుల్లో ఆపేస్తార్లే!" అని నిరాశపరుస్తూ మాట్లాడినవాళ్ళు ఉన్నారు. కానీ ఇప్పుడు ఎంత ఆదరణ లభిస్తోందంటే... వారంలో ఏ రోజూ ఖాళీ ఉండడం లేదు. నేను ఇదంతా చెయ్యడానికి కారణం కేవలం ప్రకృతి, జంతుజాలం పట్ల నాకున్న అభిమానం మాత్రమే కాదు... మనిషిగా ఇది నా బాధ్యత. ప్రకృతిని మనం సృష్టించలేం. కాబట్టి దాని నుంచి ప్రయోజనాలు పొందాలి తప్ప దాన్ని నాశనం చెయ్యకూడదు. అలా జరగాలంటే... ప్రకృతి విలువ రాబోయే తరాలకు తెలియాలి. వాళ్ళకు దానిపట్ల ఆసక్తి, ఆపేక్ష కలిగించాలి. అవే ఆ తరువాత బాధ్యతగా మారుతాయి. అప్పుడే ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. నా ప్రయత్నమంతా ఆ దిశగానే. రాబోయే రోజుల్లో వెయ్యికి పైగా పాఠశాల పిల్లలకు ప్రకృతి పాఠాలు చెప్పాలి. వారిలో కొందరినైనా ప్రకృతి సంరక్షకులుగా తీర్చిదిద్దాలి. ఇదీ నా లక్ష్యం."

> **"అమ్మతో నేనూ వెళ్ళేదాన్ని. పాఠాలు లేవు కాబట్టి... నాకు నచ్చినట్టు ఆ పరిసరాల్లో తిరిగేదాన్ని. మాది చిన్న పట్టణం. పెద్దగా వినోదాలేవీ ఉండేవి కావు. ఖాళీ సమయం పుష్కలంగా ఉండేది. నేను, నా ఫ్రెండ్స్ చేసిన సాహసాలకు లెక్కలేదు. నేచురలిస్ట్ అవ్వాలనుకున్నా. కానీ... ఇంట్లో వాళ్ళ ఒత్తిడితో... ఎంబీఏ చదివాను."**



ఇళ్ల బిల్లులు ఇవ్వకుండా అడ్డుకున్నారు

» టీడీపీ నేతల గ్రీవెన్స్‌లో బాధితుల వినతులు

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో హౌసింగ్ బోర్డు తరఫున ఇళ్లు కట్టుకుంటే.. బిల్లులు రాకుండా అడ్డుకున్నారని, గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేసిన బిల్లులు ఇప్పటికీ రాలేదని బాధితులు ఫిర్యాదు చేశారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, నజీర్ అహ్మద్ ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి వినతులు స్వీకరించారు. గత ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలైన లబ్ధిదారులు పక్కా ఇళ్లు నిర్మించుకుంటే.. బిల్లులు రానీయకుండా వైసీపీ నేతలు అడ్డుకోవడంతో 54 మంది అప్పుల పాలయ్యారని, తక్షణం బిల్లులు మంజూరు చేసి, ఆదుకోవాలని కోరుతూ కర్నూలు జిల్లా గణేకల్లుకు చెందిన బి.పెద్ద విరూపాక్షి వినతిపత్రం ఇచ్చారు. వినుకొండ నియోజకవర్గంలో 2014-19 మధ్య ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్ల పనులు చేస్తే.. గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పులు కట్టలేక ఈపూరు మండలంలో ఒకవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని, తమకు రావాల్సిన రూ.36.50 కోట్లను వెంటనే విడుదల చేయాలని బాధితులు కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యేలు కోరారు.

100 రోజుల్లోనే హామీ నెరవేర్చా: మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో నేను ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాల్చుతున్నాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మాజీ సైనికులు యువగళం పాదయాత్రలో వినతిపత్రాన్ని సమర్పించారు. అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చా. అన్నట్టుగానే 100 రోజుల్లోనే ఆ హామీని నెరవేరుస్తూ, బుధవారం కేబినెట్ సమావేశంలో తీర్మానం చేశాం' అని ఎక్స్‌లో మంత్రి లోకేశ్ తెలిపారు. కాగా, కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలపడంపై మాజీ సైనికులు కృతజ్ఞతలు తెలిపారు.

పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేయాలి: బుద్దా



విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 18: ముంబై నటి జెత్వానీ కేసులో విశాల్ గున్ని స్టేట్‌మెంట్ ప్రకారం సీఎం వోలో జరిగిన కుట్ర బయటపడిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులను తక్షణం అరెస్టు చేసి విచారిస్తే మరిన్ని వాస్తవాలు బయటపడతాయని, జగన్ పాత్ర కూడా వెలుగులోకి వస్తుందని చెప్పారు. బుధవారం విజయవాడలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎస్ఆర్ ఆంజనేయులు గతంలో కూడా అనేక మందిని ఇబ్బంది పెట్టాడన్నారు. జెత్వానీ కేసులో డీసీపీ రమణమూర్తి పాత్ర కూడా ఉన్నట్లు తేలిందని చెప్పారు. ముగ్గురు ఐపీఎస్‌లు కలిసి ఒక ఆడపిల్లను హింసించారని, తప్పుచేసిన వారు ఎవరైనా కఠినంగా శిక్షించబడాలని తేల్చిచెప్పారు. పీఎస్ఆర్ ఆంజనేయులను అరెస్ట్ చేసి విచారిస్తే అందరూ బయటకు వస్తారని, ప్రభుత్వం ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.


'జమిలి' రాజకీయ జిమ్మిక్కే: సీపీఐ నారాయణ

అమరావతి (ఆంధ్రజ్యోతి), విజయవాడ, సెప్టెంబరు 18: జమిలి ఎన్నికలంటూ మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కేవలం రాజకీయ జిమ్మిక్కేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ కొట్టిపారేశారు. సమాఖ్య విధానం ఉన్న భారత్‌లో జమిలి ఎన్నికలు సాధ్యం కాదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల కార్పస్ ఫండ్‌తో జాతీయ విపత్తు నిధిని ఏర్పాటు చేయాలని నారాయణ సూచించారు. విజయవాడలోని పాతరాజరాజేశ్వరి పేటలో వరద బాధిత కుటుంబాలకు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ మాట్లాడుతూ బుడమేరు వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరాలని సూచించారు.

పలు జిల్లాల రిజిస్ట్రార్ల బదిలీ

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. పలు జిల్లాల రిజిస్ట్రార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

వాతావరణ శాఖ ఆధునికీకరణ



భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర

» మరింత పక్కాగా వాతావరణ సమాచారం
» 2,600 కోట్లతో 'మిషన్ మౌసం' ప్రాజెక్టు
» విశాఖపట్నం, మచిలీపట్నంలో కొత్త రాడార్లు
» వచ్చే నైరుతి నాటికి పంచాయతీల వారీగా వాతావరణ బులెటిన్లు
» అక్టోబరు 15కు నైరుతి వైదొలుగుతుంది
» భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర

విశాఖపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'ఎండలు, వర్షాలు, వరదలు, పిడుగులు, తుఫాన్లు వంటి విపత్తులకు సంబంధించి పూర్తి, పక్కా సమాచారంతో కూడిన బులెటిన్లు రూపొందించేందుకు వాతావరణ శాఖను మరింత ఆధునికీకరిస్తున్నాం. ఇందుకు రూ.2,600 కోట్లతో రూపొందించిన 'మిషన్ మౌసం' ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది' అని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించారు. బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం 75వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఈ ప్రాజెక్టు రెండేళ్ల వ్యవధిలో అమలు చేయడానికి నిర్ణయించాం. దీనిలో భాగంగా దేశంలో మరో 50 డాప్లర్ వెదర్ రాడార్లు (ప్రస్తుతం 39 పనిచేస్తున్నాయి) ఏర్పాటు చేస్తాం. దేశంలో ఏ ప్రాంతంలో ప్రకృతి విపత్తు సంభవించినా వెంటనే తెలుసుకునేందుకు ఇది ఎంతగానో దోహదపడతాయి. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం నుంచి పనిచేస్తున్న చెన్నై, మచిలీపట్నం, విశాఖపట్నం, కోల్‌కతాల్లోని రాడార్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే మచిలీపట్నం రాడార్ పని చేయడం లేదు. ఇటీవల వర్షాలకు సంబంధించి సమాచారం శ్రీహరికోట, చెన్నై, హైదరాబాద్ రాడార్‌ల నుంచి తీసుకున్నాం. ఉపరితలంలో గాలి, ఉష్ణోగ్రత, తేమ అంచనా వేయడానికి ప్రస్తుతం దేశంలో 56 స్టేషన్ల నుంచి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సెన్సార్లతో కూడిన బెలూన్లు విడిచిపెడుతున్నాం. అయితే మరో 60 కేంద్రాల నుంచి ఈ విధానం అమలు చేయడానికి నిర్ణయించాం. ఇప్పటివరకూ అమలులో ఉన్న మోడళ్లకు అదనంగా మరికొన్ని విధానాలను అనుసరించడం ద్వారా కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటివరకూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం జిల్లా, బ్లాక్ స్థాయిలో వాతావరణ బులెటిన్లు అందిస్తుండగా, వచ్చే నైరుతి రుతుపవనాల సీజన్ నుంచి గ్రామ పంచాయతీల స్థాయిలో ఇవ్వనున్నాం. తద్వారా పెనుగాలులు, మేఘాల విచ్ఛిన్నం, పిడుగులు, మెరుపులు వంటివి సంభవించేటప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం తీవ్రతను అరికట్టవచ్చు. పిడుగులు, మెరుపుల తీవ్రతతో ఏటా మరణాల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ 'దామిని', 'మౌసం' యాప్‌లను వినియోగించాలి.

వాతావరణ మార్పులతో వర్షపాతం తగ్గుతోంది

వర్షపాతం కొలిచే యంత్రాలను వాతావరణ శాఖతోపాటు కేంద్ర జల సంఘం, ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్నాయి. అయితే కొన్ని పర్యాయాలు సాంకేతిక సమస్యలతో అవి పనిచేయడం లేదు. ఏటా ఒక ప్రాంతంలో భారీ వర్షాలు ఉంటే మరో ప్రాంతంలో కరువు, వర్షాభావం నెలకొంటున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇంతవరకు దక్షిణ, మధ్య, వాయువ్య భారతంలో పుష్కలంగా వర్షాలు కురిశాయి. హిమాలయాలకు ఆనుకుని ఉన్న రాష్ట్రాలు, ఈశాన్య, తూర్పు భారతంలో కొంత వర్షపాతం తక్కువగా నమోదైందన్నారు. గడచిన రెండు, మూడు దశాబ్దాల నుంచి గంగా మైదాన పరీవాహక ప్రాంతాలైన బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్.. వీటికి ఆనుకుని ఈశాన్య రాష్ట్రాల్లో వర్షపాతం తగ్గుతున్నమాట వాస్తవమేనని ఆయన అన్నారు. వాతావరణ మార్పులతో ఆ ప్రాంతంలో తగ్గుతున్న వర్షపాతంపై పరిశోధనలు చేయాలని అభిప్రాయపడ్డారు. ఆగ్నేసియా దేశాలను వణికించిన యాగీ పెనుతుపాను అవశేషాలు బంగాళాఖాతంలో ప్రవేశించి అల్పపీడనం ఏర్పడి తరువాత వాయుగుండంగా బలపడి బుధవారానికి మధ్యప్రదేశ్‌లో తీవ్ర అల్పపీడనంగా కొనసాగుతుంది. ఈ నెల 22 లేదా 23న బంగాళాఖాతంలో అల్పపీడనం ఒకటి వచ్చే అవకాశం ఉంది. అయితే ఇది బలపడే అవకాశం లేదు. ఇది పూర్తిగా బలహీనపడిన తరువాత దేశం నుంచి నైరుతి రుతుపవనాలు ఉపసంహరణపై స్పష్టత వస్తుంది. అక్టోబరు 15 నాటికి దేశం నుంచి నైరుతి రుతుపవనాలు వైదొలుగుతాయి. వచ్చే నెలలో తుఫాన్‌లు ఏర్పడతాయా? లేదా అనేది పది రోజులు ముందుగా అంచనాకు రాగలం. అంతే తప్ప ఇప్పుడు చెప్పలేం' అని మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు.

జగన్ సర్కారు పాపాలు వెంటాడుతున్నాయి

» మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆవేదన
» కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ
» ఏపీ రహదారులపై వినతులు
» రహదారుల బాగుజేతకు 290 కోట్లు విడుదల చేసిన రాష్ట్రం

న్యూఢిల్లీ/అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీలోని జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి జనార్దన్‌రెడ్డి, ఆర్ అండ్ బీ అధికారులు సమావేశమయ్యారు. అనంతరం.. బీసీ జనార్దన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం ఖర్చు పెట్టకపోవడంతో పనులన్నీ ఆగిపోయాయని తెలిపారు. జగన్ ప్రభుత్వ పాపాలు తమను వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రోడ్లు, మౌలిక సదుపాయాల నిధి(సీఆర్ఐఎఫ్) కింద ఇప్పటికే రూ.350 కోట్లకు ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. అదనంగా మరో రూ.150 కోట్ల నిధుల విడుదలకు కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఇటీవలి వరదలలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులకు రూ.186 కోట్లతో అంచనాలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. రూ.296 కోట్ల నిధులతో రహదారులపై గుంతల పూడ్చివేత, మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు.

రోడ్ల మరమ్మతులు చకచకా!

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు రూ.290 కోట్ల విడుదలకు మార్గం సుగమమైంది. దీనికి సంబంధించి పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విపత్తు నిధి కింద రూ.290 కోట్లు కేటాయించనున్నారు.

లా నేస్తం పేరు న్యాయ మిత్రగా మార్పు

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):వైఎస్ఆర్ లా నేస్తం పేరును ప్రభుత్వం న్యాయ మిత్రగా మార్చింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) సునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

భోగాపురం విమానాశ్రయానికి 'అల్లూరి' పేరు హర్షణీయం: మంతెన

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు విమానాశ్రయంగా నామకరణం చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడికి ఇచ్చే గొప్ప గౌరవమని ప్రశంసించారు.

మరో తొమ్మిది వరద బాధిత జిల్లాలు

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో తొమ్మిది జిల్లాలను భారీ వర్షాలు, వరద పీడిత ప్రాంతాలుగా ప్రకటిస్తూ విపత్తు నిర్వహణశాఖ గజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇటీవల ఎన్టీఆర్ జిల్లాను పూర్తి వరదపీడిత ప్రాంతంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా విజయనగరం, అల్లూరి, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడును ప్రకటించారు.

విపత్తుల నుంచి స్వీయ ప్రణాళికల రూపకల్పన అవశ్యం

» వాతావరణంలో అనూహ్య మార్పులతో వర్షాల పంపిణీలో తీవ్ర అంతరం
» కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్



డాక్టర్ ఎం.రవిచంద్రన్

విశాఖపట్నం,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'గత కొద్దికాలంగా ప్రకృతి విపత్తులు.. ప్రధానంగా వరదలు, తుపాన్‌ల ప్రభావంతో నగరాలు నీట మునిగి అనేక ఇబ్బందులు పాలవుతున్నాయి. ప్రకృతి విపత్తుల నుంచి స్వీయ రక్షణకు నగరాలు, పట్టణాలు బృహత్తర ప్రణాళికలు రూపొందించుకోవాలి' అని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ ఎం.రవిచంద్రన్ అభిప్రాయపడ్డారు. ఆయన గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం 75వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో రవిచంద్రన్ మాట్లాడారు. ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోకపోతే భారీమూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏ ఏ ప్రాంతాల్లో ఎటువంటి విపత్తులు సంభవిస్తాయో అంచనాకు వచ్చి అందుకు తగినట్టుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో పరిశోధనలు పెరగాలి. ప్రతి విశ్వవిద్యాలయంలో దీనికి సంబంధించి కోర్సులు బోధించాలి' అని రవిచంద్రన్ సూచించారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

» గంజాయి నిర్మూలనకు వంద రోజుల ప్రణాళిక: డీజీపీ



ఏలూరు క్రైం, సెప్టెంబరు 18: రాష్ట్రంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. బుధవారం ఏలూరు డీఐజీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి నియంత్రణపై వంద రోజుల ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మల్కాజ్‌గిరి ప్రాంతం, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా అవుతున్నట్లు గుర్తించామని, క్షేత్రస్థాయిలోనే వాటిని ధ్వంసం చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు ఇప్పటి వరకూ విజయవాడ, విశాఖపట్టణం సీఐడీలలో మాత్రమే ఉన్నాయని, అన్ని జిల్లాలో వీటిని ఏర్పాటు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి చర్యలు చేపట్టామని, పోలీస్ క్యాంటీన్ల మరమ్మతులకు రూ.4.7 కోట్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలో 13 జిల్లాలుగానే పరిగణించి పోలీస్‌శాఖలో బదిలీలు ఉంటాయని, సొంత జిల్లాలో లూప్‌లైన్ విభాగాల్లో పని చేయవచ్చునని, లా అండ్ ఆర్డర్‌లో మాత్రం అలా పని చేయకూడదన్నారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రూబ్రిడ్జి వద్ద ఆక్రమణల తొలగింపు



విజయవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురు నుంచి నగరం వైపునకు రావాలన్నా, నగరం వైపు నుంచి యనమలకుదురు వైపునకు వెళ్లాలన్నా వాహనదారులకు రామలింగేశ్వరనగర్ కట్టమార్గమే దిక్కు. దీంతో ఈ మార్గంలో రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. బెంజ్‌సర్కిల్‌కు వెళ్లానుకున్నవారు స్క్రూబ్రిడ్జి వద్ద ఉన్న జంక్షన్ వద్ద జాతీయ రహదారిని దాటాలి. సరిగ్గా ఇక్కడే ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. కట్టపైనుంచి వస్తున్న వాహనాలు మలుపు తీసుకోలేని పరిస్థితి. కట్టపైకి వెళ్తున్న వాహనాలు ముందుకు కదలని పరిస్థితి. సరిగ్గా జంక్షన్‌కు ఎదురుగా ఉన్న ఆక్రమణలే కారణమని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలమురళీకృష్ణ, ఎస్ఐ సాగర్ గుర్తించారు. బుధవారం జంక్షన్ వద్ద ఆక్రమణలను తొలగించారు. రోడ్డుపైకి ఉన్న పండ్ల వ్యాపారులను వెనక్కి పంపించి రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో రహదారి కాస్త విశాలంగా మారింది.

పవర్‌లిఫ్టింగ్‌లో అనిల్‌సాయి, వెంకటరెడ్డికి పతకాలు



విజేతలు అనిల్‌సాయి, వెంకటరెడ్డి

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 18: అమలాపురంలో ఈ నెల 14, 15న జరిగిన ఏపీ అన్‌ఎక్విప్డ్ స్టేట్ పవర్‌లిఫ్టింగ్‌లో నగరానికి ఎనీటైమ్ ఫిట్నెస్ ట్రైనర్లు అనిల్ సాయి, ఎం వెంకటరెడ్డి పతకాలతో సత్తాచాటారు. 93 కేజీల విభాగంలో సీహెచ్ లితేష్ అనిల్‌సాయి స్క్వాట్‌లో 212.5 కేజీలు, బ్రెంచ్ ప్రెస్‌లో 122 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 250 కేజీలతో కలుపుకుని మొత్తం 585 కిలోల బరువెత్తి ఓవరాల్ స్వర్ణాన్ని వశం చేసుకున్నాడు. 105 కేజీల బ్రెంచ్ ప్రెస్‌లో 115 కేజీల బరువెత్తి కాంస్యం వశం చేసుకున్నాడు. విజేతలను ఎనీటైమ్ జిమ్ అధినేత మండవ మధుబాబు, కోచ్ కేఎన్‌వీ నరేంద్ర, జిమ్ సభ్యులు దుర్గారావు, వెంకటేష్ సురేష్ అభినందించారు.

వరద బాధిత లైసెన్స్ పోర్టర్లకు వితరణ



పోర్టర్లకు నిత్యావసరాలు అందజేస్తున్న రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 18: బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన 69 మంది లైసెన్స్ పోర్టర్లకు డివిజినల్ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందజేశారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పిలుపు మేరకు డివిజన్‌లోని కమర్షియల్, టికెట్ చెక్కింగ్ సిబ్బంది రూ.2లక్షలు విరాళంగా అందించారు. ఈ డబ్బుతో కొనుగోలు చేసిన నిత్యావసర సరుకులను బుధవారం రైల్వే స్టేషన్ పార్సిల్ కార్యాలయంలో లైసెన్స్ పోర్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా లైసెన్స్ పోర్టర్లు వాణిజ్య విభాగానికి ధన్యవాదాలు తెలిపారు.

పదే పదే ఆక్రమిస్తున్నా ఎందుకీ అలసత్వం?

● స్థానికుల ఫిర్యాదుతో అక్రమ కట్టడాల తొలగించిన అధికారులు ● విద్యుత్ శాఖ, సచివాలయ సిబ్బంది హస్తం ఉన్నట్టు అనుమానం ● శాశ్వత పరిష్కారం చూపాలంటున్న స్థానికులు





అక్రమ కట్టడాలు తొలగిస్తున్న వీఎంసీ సిబ్బంది, అధికారులు, మహాదళ్ పేరుతో వెలసిన ఫ్లెక్సీ

మధురానగర్, సెప్టెంబరు 18: మధురానగర్ బీఆర్‌టీఎస్ రోడ్డు పడవల రేవు వద్ద ఉన్న సబ్ స్టేషన్ వెనుక ఖాళీ జాగాను ఆక్రమించి వేసిన రెండు రేకుల షెడ్‌లను వీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం తొలగించారు. ఎన్నికల ముందు ఇక్కడి స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించి ఇనుపగడ్డర్లతో సిమెంట్, రాయితో రేకుల షెడ్ వేశారు. మీడియాలో వీరి ఆక్రమణ గురించి రావడంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది గోడలకు కన్నాలు పెట్టి తూతూమంత్రంగా అయిందనిపించారు. అధికారులంతా వరద డ్యూటీల్లో ఉండగా మహాదళ్ పేరుతో ఫ్లెక్సీ పెట్టి మరోసారి ఆక్రమణకు తెరతీశారు. స్థానికుల ఫిర్యాదుతో బుధవారం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అరుణ, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో వచ్చి గతంలో పాక్షికంగా మిగిలిన కట్టడాలను తొలగించారు. భారీ ఇనుప గడ్డర్లను గ్యాస్ కట్టర్‌లతో తొలగించారు. అయితే ఈ ఆక్రమణల వెనుక విద్యుత్ శాఖ, సచివాలయ సిబ్బంది హస్తం ఉన్నట్టు తెలుస్తోంది. వైసీపీ హయాంలో విద్యుత్ సిబ్బంది కొందరు ఆక్రమించారు. ఇపుడు దేవుడి పేరుతో బ్యానర్ పెట్టి ఆక్రమణలకు బరితెగించారు. ఇలా పదేపదే ఆక్రమార్కులు ఈ స్థలంపై కన్నేయడం, కట్టడాలు కడుతున్నా పట్టించుకోకపోవడంపై సచివాలయ సిబ్బంది హస్తం ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. పప్పుల మిల్లు రోడ్డులోని 1వ డివిజన్ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీని వివరణ కోరగా ఆయన మౌనంగా ఉండిపోయాడు. వీఎంసీ కమిషనర్ స్పందించి పడవలరేవు నుంచి గులాబీతోట వంతెన వరకు ఉన్న కాల్వగట్టు స్థలానికి ఫెన్సింగ్ వేయించి గ్రీనరీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ: లుక్కా

వన్‌టౌన్, సెప్టెంబరు 18: సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారంతో 100 రోజులు పూర్తి చేసుకుంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. ఈ సం టదర్భంగా బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వ విజయాలను వివరించారు. రాష్ట్ర ప్రజలు భారీ మెజార్టీతో కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని, కేవలం 100 రోజులలోనే మంచి ఫలితాలు చూపించి ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

విలీన సిబ్బందికి ప్రత్యేక నిబంధనలు విడుదల చేయాలి

వన్‌టౌన్, సెప్టెంబరు 18: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడెడ్ నుంచి ప్రభుత్వంలోకి విలీనమైన సిబ్బందికి ప్రత్యేక నిబంధనలను వెంటనే ఇప్పించాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. బుధవారం మంగళగిరిలోని కళాశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద అధ్యాపకులు ధర్నా చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ డాక్టర్ గోవిందు సురేంద్ర, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొల్లేటి రమేష్, గౌరవాధ్యక్షుడు కాకాని సుధాకర్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస రెడ్డి, సభ్యులు డాక్టర్ బాబు, డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ పుష్పమ్మ, తలతోటి రాంబాబు విద్యాశాఖ మంత్రి ఓఎస్‌డీకి, కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు.

ఐవోటీ కోర్సులకు ఉపాధి అవకాశాలు మెండు

● సాఫ్ట్ ప్రాజెక్ట్ సొల్యూషన్స్ హెచ్ఆర్ జాషువా

లబ్బీపేట, సెప్టెంబరు 18: ఎలక్ట్రానిక్స్ అండ్ ఐవోటీ కోర్సులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సాఫ్ట్ ప్రాజెక్ట్ సొల్యూషన్స్ హెచ్ఆర్ పి.జాషువా పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నలంద డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ ఐవోటీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సర్క్యూట్ డిజైన్ అండ్ ఐవోటీ అప్లికేషన్స్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన అకడమిక్స్‌తో పాటు న్యూ టెక్నాలజీ ఆవశ్యకతను వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. అనురాధ మాట్లాడుతూ ఈ వర్క్‌షాపులో శిక్షణ పొందటం వల్ల విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా ఉన్న రంగాల్లో కెరీర్ మలుచుకోవచ్చన్నారు. ఈ వర్క్‌షాపులో బీఎస్సీ అండ్ బీసీఏ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ అండ్ ఐవోటీ హెచ్‌వోడీ కె.రామ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.



బాధితులకు వస్త్రాల పంపిణీ చేస్తున్న మధురవాణి బృందం

వరద బాధితులకు ఏబీఎన్ బృందం వస్త్రాల పంపిణీ

వన్‌టౌన్: 63వ డివిజన్ ఉడా కాలనీలో ఏబీఎన్ సిబ్బంది మధురవాణి ఆధ్వర్యంలో వరద బాధితులకు బుధవారం చీరలు, దుప్పట్లు, టవల్స్, మహిళలకు టాప్‌లు పంపిణీ చేశారు. 100 మంది వరద బాధితులకు వీటిని అందచేశారు. మధురవాణి స్నేహితులు ఎం.రూప, వి.నరేష్, హేమలత, కల్పన పాల్గొన్నారు.

మా బాబు బంగారం

బుద్దా కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పుష్పాభిషేకం

వన్‌టౌన్, సెప్టెంబరు 18: నగర, రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు రుణపడి ఉన్నారని వరద విపత్తు సమయంలో బాధితులకు సహాయక చర్యలు చేపట్టటంలో ఆయన పనితీరు ఎంతో ఆదర్శనీయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. బుధవారం వన్‌టౌన్‌లోని ఆయన కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి నేతలు, కార్యకర్తలతో కలిసి పుష్పాభిషేకం చేశారు. ఈసందర్భంగా కార్యకర్తలు మా బాబు బంగారమంటూ నినాదాలు చేశారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ వరద బాధితులకు దేశంలో ఏ సీఎం చేయని విధంగా రూ.25వేలు సహాయం అందిస్తున్నారని చెప్పారు. వరద బాధితుల విషయంలో జగన్ రెడ్డి రాజకీయం చేయటం దుర్మార్గమన్నారు.

మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కాండ్రేగుల రవీంద్ర

ఇటీవల వరద సమయంలో సహాయక చర్యలు చేపడుతూ గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కిల్లాని దుర్గారావు కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఆదేశాల మేరకు రూ.50వేలు ఆర్థికసాయాన్ని బుధవారం పశ్చిమ టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల రవీంద్ర అందచేశారు. నేతలు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, కామా దేవరాజ్, పునుగుపాటి చిన సుబ్బయ్య, పత్తి నాగేశ్వరరావు, రేగళ్ల లక్ష్మణరావు, పొల్లంటి గంగాధర్, గంగాధర్ రెడ్డి, బడుగు గణేష్ పాల్గొన్నారు.



ఆదివాసీలతో ఎస్టీ కమిషన్ సభ్యులు

వరదలతో ప్రజా జీవితాలు అస్తవ్యస్తం

● రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

కృష్ణలంక, సెప్టెంబరు 18: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేశాయని, ఎస్టీల జీవనోపాధిని దెబ్బతీశాయని, వాస్తవ స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనున్నట్టు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. బుధవారం ఆయన ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్‌తో కలిసి అర్బన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరీ పేట, వాంబేకాలనీ, జక్కంపూడి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులకు జరిగిన నష్టాన్ని ఎన్యూమరేషన్ చేసి, ప్యాకేజీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్టీ కమిషన్ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ కార్యదర్శి కె.రామశేషు, ఏవో ఎం.విజయకుమార్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) ప్రెసిడెంట్ మానుపాటి నవీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ కె.రామచంద్రయ్య, ఎస్టీ సంక్షేమ సంఘం నేత ఉదయ్‌కుమార్, నార్త్, రూరల్ తహసీల్దార్లు సీహెచ్.శిరీషాదేవి, బి.సుగుణ పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు బూట్ క్యాంపుల దోహదం

ఉంగుటూరు, సెప్టెంబరు 18: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల వినూత్న ఆలోచనలకు మరింత పదునుపెట్టడంతోపాటు కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు బూట్ క్యాంపులు ఎంతో దోహదం చేస్తాయని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మ్యానేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(సీమాట్) డైరెక్టర్, ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) స్టేట్ నోడల్ ఆఫీసర్ వీఎన్ మస్తానయ్య అన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేషన్ సెల్ (ఎంఐసీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ సంయుక్త ఆధ్వర్యంలో ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐడీఈ) బూట్ క్యాంపును బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ఏఐసీటీఈ మేనేజర్ ఐ.ఎన్.భీమ, ఏఐసీటీఈ ఫైనాన్స్ ఆఫీసర్ యోగేష్ వాధ్వాన్, వాధ్వాని ఫౌండేషన్ నోడల్ ఆఫీసర్ గౌరి గోపీనాథ్, వాధ్వాని ఫౌండేషన్ రిసోర్స్‌పర్సన్ ద్రిష్ట, సీమాట్ నోడల్ ఆఫీసర్ ఎస్.ప్రసాద్‌రాజు, కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులకు ఆమోదం తెలిపిన సీఎంకు కృతజ్ఞతలు: ఆళ్ల

వన్‌టౌన్: గత టీడీపీ ప్రభుత్వ కాలంలో అన్ని రకాల అనుమతులు తీసుకుని నీరు - చెట్టు పథకంలో చేసిన పనులకు ప్రస్తుతం ఓటు ఆన్ బడ్జెట్ అకౌంట్‌లో రూ.256 కోట్లు కేటాయించినందుకు టీడీపీ నీరు - చెట్టు ఫిర్యాదుల విభాగం బాధ్యుడు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు సీఎం చంద్రబాబుకు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించటానికి కృషి చేసిన మంత్రులు నిమ్మల, పయ్యావుల, టీడీపీ నేత బీద రవిచంద్ర యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 19 సెప్టెంబరు 2024

ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.



సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారికోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. ఈని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/ బీఎస్సీ ఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.


దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000(పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరితేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

ఎన్ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీ హెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



కోర్సు, సీట్లు
- యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.
- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్ఎల్ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్ఎల్ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్‌లో ప్రొఫెషనల్ సర్టిఫికెట్

రిమైండర్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్(ఐఐపీఎం)- 'ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ టీ టేస్టింగ్ అండ్ మార్కెటింగ్(పీసీపీ-టీటీఎం)'ను అందిస్తోంది. టీ బోర్డ్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించే ఈ ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ వ్యవధి 45 రోజులు. నవంబరు 4 నుంచి డిసెంబరు 18 వరకు ట్రెయినింగ్ సెషన్స్ ఉంటాయి. ఫ్రెషర్స్, టీ ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ సహా టీ మాన్యుఫాక్చరింగ్, టీ ప్రొడక్షన్, టీ ట్రేడింగ్/బ్లెండింగ్, టీ రిటైలింగ్ విభాగాల్లో అనుభవం ఉన్నవారికి టెక్నికల్, ఫంక్షనల్, మార్కెటింగ్ అవసరాలకు తగ్గట్టుగా టీ టేస్టింగ్ సెషన్స్ నిర్వహిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో టీ బిజినెస్ మేనేజ్‌మెంట్, మార్కెట్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నిక్‌లకు సంబంధించిన అంశాలు వివరించడంతోపాటు టీ టేస్టింగ్ స్కిల్స్ నేర్పిస్తారు. దేశ విదేశాల్లో తయారుచేసే టీ రకాలను టేస్ట్ చేసే మెథడాలజీని వివరిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా అకడమిక్, టెక్నికల్, ప్రాక్టికల్ మాడ్యూల్స్ ఉంటాయి. చివరలో అసెస్‌మెంట్ వర్క్ ఉంటుంది.

- అకడమిక్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్ ఫర్ రైట్ మార్కెటింగ్, టీ టేస్టింగ్-ప్రొడక్షన్ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ అంశాలు; టెక్నికల్ మాడ్యూల్‌లో మైక్రో ప్రొఫైలింగ్ ఆఫ్ టీ గ్రేడింగ్, లాంగ్వేజ్ ఆఫ్ టీ టేస్టింగ్, కప్ టేస్టింగ్ టెక్నిక్స్, ఎలక్ట్రానిక్ నోస్ అండ్ ఎలక్ట్రానిక్ టంగ్, ఎవల్యూషన్ అండ్ స్కోరింగ్, టేస్టింగ్ ఫర్ ప్రొక్యూర్‌మెంట్స్ అండ్ టీ బ్లెండ్స్, ప్యాలెట్ మెమరీ-టీ టేస్టింగ్/ బ్లెండింగ్ అంశాలు ఉంటాయి. ప్రాక్టికల్ మాడ్యూల్‌లో టీ టేస్టింగ్, సెన్సరీ స్కిల్స్‌కు సంబంధించిన శిక్షణతోపాటు ఫీల్డ్ స్టడీ, టీ ఎస్టేట్/ ఫ్యాక్టరీ విజిట్స్, మార్కెటింగ్ అంశాలు ఉంటాయి. అసెస్‌మెంట్‌లో ప్రాజెక్ట్ ప్రజంటేషన్, ప్రాక్టికల్ టెస్ట్‌లు, రిటెన్ టెస్ట్‌లు, కేస్ అనాలిసిస్, ఎక్స్‌పర్ట్ కమిటీ ఎవల్యూషన్ అండ్ సర్టిఫికేషన్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్ చదవడం, రాయడంలో ప్రావీణ్యం తప్పనిసరి. టీ సంబంధిత ప్రొడక్షన్, మార్కెటింగ్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. విదేశీయులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: ఇంటర్వ్యూ, టీ టేస్టింగ్‌కు సంబంధించిన సైకోమెట్రిక్ టెస్ట్, బ్లైండ్ సెన్సరీ టెస్ట్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.80,000+జీఎస్టీ(విదేశీయులకు 1100 యూఎస్ డాలర్లు)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500, విదేశీయులకు 15 యూఎస్ డాలర్లు
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 18
- **చిరునామా:** ఎండీపీ యూనిట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, జ్ఞాన భారతి క్యాంపస్, బెంగళూరు-560056
- **వెబ్‌సైట్:** www.iipmb.edu.in

జాబ్ కార్నర్

కెనరా బ్యాంకులో

ఖాళీలు 3000

బెంగళూరులోని కెనరా బ్యాంకు, హ్యూమన్ రిసోర్సెస్ విభాగం, ప్రధాన కార్యాలయం దేశవ్యాప్తంగా రీజియన్ల వారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటీస్‌షిప్ శిక్షణలో భాగంగా అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 21 నుంచి అక్టోబరు 4 లోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్ పూర్తి వివరాలు సెప్టెంబరు 21న వెల్లడికానున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.

వయసు: సెప్టెంబరు 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: సెప్టెంబరు 21

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ: అక్టోబరు 4

వెబ్‌సైట్: canarabank.com/

నార్త్ సెంట్రల్ రైల్వేలో

ఖాళీలు 1679

ఉత్తరప్రదేశ్, ప్రయాగ్‌రాజ్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) నార్త్ సెంట్రల్ రైల్వే ఈసీఆర్ పరిధిలోని డివిజన్/ వర్క్‌షాపుల్లో 1,679 యాక్ట్ అప్రెంటీస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అభ్యర్థులు అక్టోబరు 15 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, మెకానిక్, వైర్‌మన్, బ్లాక్ స్మిత్, ప్లంబర్, డ్రాఫ్ట్‌మన్, స్టెనోగ్రాఫర్, టర్నర్, సీఓపీఏ తదితరాలు.

వయసు: అక్టోబరు 15 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: అక్టోబరు 15

వెబ్‌సైట్: www.rrcpryj.org/

హెచ్ఎస్ఎఫ్‌సీలో టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్‌లు

ఖాళీలు 103

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)కు చెందిన బెంగళూరులోని హ్యూమన్ స్పేస్ ఫ్లయిట్ సెంటర్(హెచ్ఎస్ఎఫ్‌సీ) తాత్కాలిక ప్రాతిపదికన 103 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఖాళీలు
- మెడికల్ ఆఫీసర్(ఎస్‌డీ/ఎస్‌సీ)- 3
- సైంటిస్ట్/ ఇంజనీర్-ఎస్‌సీ- 10
- టెక్నికల్ అసిస్టెంట్ - 28
- సైంటిఫిక్ అసిస్టెంట్ - 1
- టెక్నీషియన్-బి - 43
- డ్రాఫ్ట్స్‌మన్- 13
- అసిస్టెంట్(రాజ్ భాష)- 5

అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ, బీఈ/ బీటెక్(సివిల్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్), ఎంబీబీఎస్/ ఎండీ, ఎంఈ/ ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: అసిస్టెంట్ పోస్టులకు 28 సంవత్సరాలు, మిగతా పోస్టులకు 18 నుంచి 35 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, స్క్రీనింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

దరఖాస్తుకు చివరితేదీ: అక్టోబరు 9

వెబ్‌సైట్: www.hsfc.gov.in/



అప్రెంటీస్‌లు

ఎన్‌పీసీఐఎల్‌లో ఖాళీలు

ఖాళీలు 70

ఉత్తరప్రదేశ్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

- ట్రేడ్ అప్రెంటీస్ - 50
- డిప్లొమా అప్రెంటీస్ - 10
- గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ - 10

విభాగాలు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

జీతం: నెలకు ట్రేడ్ అప్రెంటీస్‌కు రూ.7,700 - రూ.8,050; డిప్లొమా అప్రెంటీస్‌కు రూ.8,000; గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ పోస్టుకు రూ.9,000.

వయసు: దరఖాస్తు చివరితేదీ నాటికి ట్రేడ్ అప్రెంటీస్ పోస్టుకు 18-24 సంవత్సరాలు, డిప్లొమా అప్రెంటీస్‌కు 18-25, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కు 18-26 సంవత్సరాలు ఉండాలి. (ఎస్సీ/ ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ట్రైనింగ్ ప్రదేశం: నరోరా అటామిక్ పవర్ స్టేషన్, నరోరా, బులంద్‌షహర్, ఉత్తరప్రదేశ్.

శారీరక ప్రమాణాలు: ఎత్తు 137 సెం.మీ.; బరువు 25.4 కిగ్రా, ఛాతి 3.8 సెం.మీ. ఉండాలి.

ఎంపిక: మార్కుల పర్సంటేజ్, షార్ట్ లిస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరితేదీ: అక్టోబరు 3

వెబ్‌సైట్: npcilcareers.co.in/

ఈసీజీసీ లిమిటెడ్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఖాళీలు 40

ముంబయిలోని ప్రభుత్వరంగ సంస్థ ఈసీజీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేడర్‌లో 40 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు అక్టోబరు 13 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీలు: ప్రొబేషనరీ ఆఫీసర్: 40 పోస్టులు(ఎస్సీ-6, ఎస్టీ-4, ఓబీసీ-11, ఈడబ్ల్యూఎస్-3, అన్‌రిజర్వుడు-16)

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమానమైన అర్హత కలిగి ఉండాలి.

వయసు: 2024 సెప్టెంబరు 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

జీతభత్యాలు: నెలకు రూ.53,600 - రూ.1,02,090

ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్), డిస్క్రిప్టివ్ పేపర్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.175, ఇతరులకు రూ.900

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ/ దరఖాస్తు సవరణ తేదీ: అక్టోబరు 13 వరకు.

దరఖాస్తు రుసుము చెల్లింపు తేదీలు: అక్టోబరు 13 వరకు

ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ(నాన్-క్రీమీలేయర్) అభ్యర్థులకు ప్రీ-ఎగ్జామినేషన్ ట్రైనింగ్ ప్రారంభం: అక్టోబరు 28 నుంచి

ఆన్‌లైన్ రాతపరీక్షల కాల్‌లెటర్స్ డౌన్‌లోడ్ ప్రారంభం: నవంబరు 5 నుంచి

ఆన్‌లైన్ రాతపరీక్ష తేదీ: నవంబరు 16

రాతపరీక్ష ఫలితాల ప్రకటన తేదీలు: డిసెంబరు 16 నుంచి 31 మధ్య

వెబ్‌సైట్: www.ecgc.in/

చిట్కాలు

సౌమ్యమైన మాట


గోపాలపురంలో రాజారాం అనే కూరగాయల వ్యాపారి ఉండేవాడు. అతని కొట్టులో సత్యం అనే యువకుడు కొత్తగా పనిలో చేరాడు. ఆ యువకుడు మంచి నిజాయితీపరుడు, కష్టపడి పనిచేసే స్వభావం ఉన్నవాడు కానీ, అతనికి కోపం ఎక్కువ, ఓపిక తక్కువ. కొట్టు దగ్గరకు వచ్చిన కొనుగోలుదారులు ఎవరైనా బేరమాడితే, 'వెళ్లండి వెళ్లండి ఇలా అయితే మీరేం కొంటారు'అంటూ పరుషంగా మాట్లాడేవాడు సత్యం మాటలకు కొందరు నొచ్చుకుని, రాజారాంకు ఫిర్యాదు కూడా చేసేవారు. రాజారాం ఒకటి రెండు సార్లు చెప్పి చూసాడు కానీ సత్యంలో మార్పు ఏమీ కనపడలేదు. ఒక రోజు ఆ ఊరి ప్రభుత్వ అధికారి ఇంటివారితో కూడా సత్యం కటువుగా మాట్లాడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో సత్యంను పనిలోనుంచి తొలగించాల్సి వచ్చింది రాజారాంకి. పని కోల్పోయిన కొన్ని రోజులకు సత్యం తనను క్షమించి మరలా పనిలోకి తీసుకోవలసిందిగా యజమానిని అడగడానికి కొట్టు దగ్గరికి వెళ్లి మాటలాడేందుకు ప్రయత్నించగా రాజారాం అదేమీ వినిపించుకోకుండా 'ఏయ్ ఎన్నిసార్లు చెప్పాలి? నువ్వేమి పని చేయగలవు? వెళ్లు'అని కసిరి



కొట్టాడు.ఎంతో బాధ పడిన సత్యం కళ్ల నిండా నీళ్లతో తిరిగి వెళ్లబోతూ, యజమానితో ఇలా అన్నాడు. 'అయ్యా.. మీరు నాకు మరలా పని ఇవ్వకున్నా కనీసం నేను చెప్పేది ఒకసారి వినండి దయచేసి' అన్నాడు. రాజారాం వెంటనే అతన్ని వెనక్కి పిలిచి, ' ఇపుడు అర్థం అవుతుందా మనతో ఒకరు కటువుగా మాట్లాడితే ఎలా అనిపిస్తుందో?

అచ్చు ఇలాగే మనం ధర తగ్గించినా లేకున్నా కనీసం కొనుగోలుదారులు బేరం ఆడుతున్నపుడు వారి మాట వినాలి కదా.నువ్వు ఎన్నిసార్లు వాళ్లను ఇలాగే విదిలించి ఉంటావు? వారంతా కూడా ఇలాగే బాధపడి ఉంటారు అని ఇప్పుడైనా తెలిసిందా?అన్నాడు. దానికి సత్యం 'సౌమ్యంగా మాట్లాడటంఎంత మంచిదో ఇపుడు నాకు బాగా అర్థమైంది అండి మరెపుడూ ఎవరితో పరుషంగా మాట్లాడను అని మీకు మాట ఇస్తున్నాను' అన్నాడు.దానికి 'నేను ఇపుడు నిన్ను నమ్మగలను రేపటినుండే మరలా పనిలో చేరు' అని రాజారాం అనడంతో, సంతోషపడి ఇంటికి వెళ్లిపోయాడు సత్యం.

10 తేడాలను కనిపెట్టండి





దారి కనుక్కోండి



సరైన నీడను గుర్తించండి



డైలీ సుడోకు - 413

1		7		5				8
					2		7	
			3			5	9	
3	8					6		
			8		4			
		4					8	5
	5	1			3			
	2		5					
9				2		8		1

సుడోకు - 412 సమాధానం

3	2	9	8	4	7	1	6	5
6	1	8	5	2	3	4	9	7
4	5	7	9	6	1	2	3	8
8	4	5	1	3	6	7	2	9
9	7	6	2	5	4	8	1	3
1	3	2	7	8	9	6	5	4
7	6	1	3	9	8	5	4	2
5	9	4	6	7	2	3	8	1
2	8	3	4	1	5	9	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.